ISSN 2766-0168
అంతర్జాల త్రైమాస పత్రిక
వ్యవస్థాపక సంపాదకులు
కీ.శే. గురజాడ వేంకట అప్పారావు
www.prakasika.org

# ప్రకాశిక

సమగ్ర సాహిత్య, సామాజిక పత్రిక

సంపుటి 5 | సంచిక 4 అక్టోబర్-డిసెంబర్ 2025

మమత-సమత-మానవత
www.gurajada.org




# ఊహాసంగమం



# సంపాదక మండలి


**వ్యవస్థాపక సంపాదకులు**

మహాకవి గురజాడ అప్పారావు

**ప్రధాన సంపాదకులు**

ఆచార్య కొవ్వలి గోపాలకృష్ణ(USA)

**నిర్వాహక సంపాదకులు**

శ్రీమతి అరుణ గురజాడ (USA)

శ్రీ గురజాడ రవీంద్రుడు *(విశాఖపట్టణం)*

## విద్యాసంబంధిత ప్రచురణ విభాగ సంపాదకులు

**కార్యనిర్వాహక సంపాదకులు**

ఆచార్య దార్ల వెంకటేశ్వర రావు

*(హైదరాబాద్ విశ్వవిద్యాలయం, హైదరాబాద్)*

**సంపాదక సలహాదారులు**

ఆచార్య, సూర్యా ధనంజయ్

*(ఉపకులపతి, చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయం, హైదరాబాదు)*

ఆచార్య చల్లా శ్రీరామచంద్రమూర్తి

*(అధ్యక్షులు, తెలుగుశాఖ, బెనారస్ హిందూ యూనివర్శిటీ, వారణాసి)*

ఆచార్య మాడభూషి సంపత్ కుమార్

*(సంచాలకులు, ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం, నెల్లూరు)*

డా. వి.ఆర్. రాసాని

*(విశ్రాంత ఆచార్యులు, తిరుపతి)*

**సంపాదకులు**

ఆచార్య నల్లపరెడ్డి ఈశ్వర రెడ్డి

*(యోగి వేమన విశ్వ విద్యాలయం, కడప)*

ఆచార్య రాచుగాల్ల రాజేశ్వరమ్మ

*(శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి)*

ఆచార్య జొన్నలగడ్డ వెంకటరమణ

*(మదురై విశ్వవిద్యాలయం, మదురై)*

**సహ సంపాదకులు**

డా. నందవరం మృదుల, *(సహ ఆచార్యులు & తెలుగు విభాగాధిపతి, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల (అటానమస్) బేగంపేట, హైదరాబాద్)*

డా. వి. వింధ్యవాసినీ దేవి, *తెలుగు ఉపన్యాసకులు ప్రభుత్వ డిగ్రీ కళాశాల (పురుషులు) క్లస్టర్ యూనివర్సిటీ, కర్నూలు*

## కథలు, కవితలు, వ్యాసాల విభాగం

**సంపాదకులు**

డా. ఎస్. రఘు, *(సహాయ ఆచార్యులు, ఉస్మానియా విశ్వ విద్యాలయం, హైదరాబాదు)*



ISSN 2766-0168 | అంతర్జాల త్రైమాస పత్రిక | www.prakasika.org | editor@prakasika.org

# స్మృత్యంజలి

110 శిశిరాలక్రితం రాలిన తెలుగు సాహితీ కుసుమం ఈనాటికీ అభ్యుదయ భావపరిమళాలు వెదజల్లుతూనే ఉంది. తెలుగు సాహితీవృక్షానికి పూసిన గురజాడ బహుముఖ ప్రజ్ఞాశాలి, సాహిత్య, భాషావిషయాలలో పలు కొత్తందనాల ఆవిష్కర్త. తెలుగు సాహిత్యరంగంలో అత్యంత ప్రభావవంతమైన సాహితీవేత్త గురజాడ అనడం అతిశయోక్తి కాదు. ఆంధ్రసాహిత్యాన్ని అవుపోసన పట్టిన ఆరుద్ర, శ్రీశ్రీ వంటివారినుండి, శ్రీపాద, కొడవటిగంటి దాకా గురజాడ రచనల వైశిష్ట్యాన్ని పరిశోధించి ప్రపంచానికి తెలియచేశారు. గురజాడ నిత్యస్మరణీయుడు, గురజాడ మాట నిత్యస్ఫూర్తిదాయకం అయినా ఆయన జన్మదినానికి, వర్ధంతికి ఆయనని స్మరించడం, ఆయన సాహిత్యాన్ని పునఃపరిశీలించడం తెలుగువారు మరిచిపోకుండా చేస్తున్న గొప్పకార్యక్రమం.

2025 శిశిరంలో మరో సుందర తెలుగు సాహితీపుష్పం నేలరాలడం తెలుగువారికి అత్యంత బాధాకరమైన విషయం. ఆధునిక తెలుగు సాహిత్యాన్ని, ముఖ్యంగా వాగ్గేయకారునిగా, ఉర్రూతలూగించిన అందెశ్రీ 'మాయమైన మనిషి'ని వెదకడంకోసం పరలోకం హఠాత్తుగా పయనమవ్వడం తెలుగుసాహితీలోకానికి తీరని లోటు. గురజాడలాగే, అందెశ్రీ మనుషుల్లో 'మనిషి'కోసం వెదికిన మనీషి. అవయవాలతో మాత్రమే కాక మనిషత్వం,

మానవత్వం నిండిన 'పురుషుడిని' సమాజంలో చూడాలని తపించిన ఇద్దరు మహాకవుల స్మృతికి అంజలి ఘటించడం మన ధర్మం.

అందెశ్రీ, గురజాడ ముఖాముఖీ కూర్చుని 'మనిషన్నవాడి' గురించి మాట్లాడుకుంటుంటే ఎలా ఉంటుంది! ఆ ఊహే ఆనందకారకం. AI సాధనం ఉపయోగించి అలాంటి ఊహకి చిత్రరూపం కల్పించిన ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు గారు అభినందనీయులు. ఆ చిత్రాన్ని ప్రకాశిక ఐదవ వార్షిక సంచికకి ముఖచిత్రంగా వేయడం సముచితంగా భావిస్తున్నాను.

ఒక గురజాడ, ఒక జాషువా, ఒక అందెశ్రీ – ప్రాదేశిక, అస్తిత్వవాద చట్రాలలో ఇమడని సాహితీ విరాణ్మూర్తులు. భారతీయ సాహితీవేత్తలు, ముఖ్యంగా తెలుగువారు, ప్రముఖ సాహితీవేత్తలని జాతిసొత్తుగా పరిగణించి వారి సాహిత్యం ప్రపంచ పటంలో నిలిచేలా ప్రయత్నం చేయాలి. అది మాత్రమే, నా దృష్టిలో, ఈ కవులకు మనం ఇవ్వగల నిజమైన నివాళి.

భవదీయుడు

**డాక్టర్ కొవ్వలి గోపాలకృష్ణ**

ప్రధాన సంపాదకులు, ప్రకాశిక

# ముఖచిత్రం




## లోపల

మాయమైపోతున్నాడమ్మా – అందెశ్రీ ........................................ 6

తెలంగాణ జాతీయగీత రచయిత అందెశ్రీ
ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు........................................ 9

నా పిన తల్లి – పంజె మంగేశ రాయరు ........................................ 28

తెలుగు మరాఠీ అనుబంధాలు – శ్రీ అంబల్ల జనార్దన్ ........................ 42

ఆధునికాంధ్ర సాహిత్యయుగకర్త 'గురజాడ': ఆరుద్ర దృక్పథం
ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు........................................ 56

కన్యాశుల్కం : భాషా విశేషాలు – డా. ఎస్.షమీఉల్లా ........................ 68

మెదడులోని "ప్రపంచ స్థానీకరణ వ్యవస్థ(ప్రస్థావ్య) లో
కీలక నాడీకణాలు – 2014 నాటి వైద్యశాస్త్ర నోబెల్ పరిశోధన
డా. చాగంటి కృష్ణ కుమారి ........................................ 76

ఈ పత్రికలోని వ్యాసాలు, కథలు, కవితలు, అభిప్రాయాలు, ఆయా రచయితల స్వంతం. పత్రికకు ఆ అభిప్రాయాలతో ఎటువంటి సంబంధమూ లేదు.

# మాయమైపోతున్నాడమ్మా....

రచయిత : అందెశ్రీ

మాయమైపోతున్నాడమ్మా మనిషన్నవాడు
మచ్చుకైనా లేడు చూడు మానవత్వం వున్నవాడు
నూటికో కోటికో ఒక్కడే ఒక్కడు
నూటికో కోటికో ఒక్కడే ఒక్కడు
యాడ వున్నాడో కాయాన్ని కంటికి కానరాడు

మాయమైపోతున్నాడమ్మా మనిషన్నవాడు
మచ్చుకైనా లేడు చూడు మానవత్వం వున్నవాడు

నిలువెత్తు స్వార్ధము నీడలగొస్తుంటే
చెడిపోక ఏమైతదమ్మ చెడిపోక ఏమైతదమ్మ
ఆత్మీయ బంధాల ప్రేమ సంబంధాల
దిగ జారుతున్నాడోయమ్మా దిగ
జారుతున్నాడోయమ్మా
అవినీతి పెను ఆశ అంధకారంలోనే
అవినీతి పెను ఆశ అంధకారంలోనే
చిక్కిపోయి రోజు శిథిలమౌతున్నాడు

మాయమైపోతున్నాడమ్మా మనిషన్నవాడు
మచ్చుకైనా లేడు చూడు మానవత్వం వున్నవాడు

ఇనుప రెక్కల డేగ విసిరినా పంజాకు
కోడి పిల్లై చిక్కి కొట్టుకుంటున్నారు
కోడి పిల్లై చిక్కి కొట్టుకుంటున్నారు
ఉట్టికి స్వర్గానికి అందకుండా తుదకు
అస్థిపంజరామయ్యి అగుపించనున్నాడు
అస్థిపంజరామయ్యి అగుపించనున్నాడు
కదిలే విశ్వము తన కనుసన్నల్లో నడుమ
కదిలే విశ్వము తన కనుసన్నల్లో నడుమ
కనుబొమ్మలుఎగరేసి కాలగమనము లోన

మాయమైపోతున్నాడమ్మా మనిషన్నవాడు
మచ్చుకైనా లేడు చూడు మానవత్వం వున్నవాడు

కుక్క నక్కలా దైవ రూపాలుగా కొలిచి
పంది నందిని జూస్తే పడి మొక్కుతుంటాడు
పంది నందిని జూస్తే పడి మొక్కుతుంటాడు
చీమలకు చక్కర పాములకు పాలోసి
జీవకారుణ్యమే జీవితం అంటాడు
జీవకారుణ్యమే జీవితం అంటాడు
తోడ పుట్టిన వాళ్ళ ఉరవతలకినెట్టి
తోడ పుట్టిన వాళ్ళ ఉరవతలకినెట్టి
కులమంటూ ఇలా మీద కలహాల గిరి గీసి

మాయమైపోతున్నాడమ్మా మనిషన్నవాడు
మచ్చుకైనా లేడు చూడు మానవత్వం వున్నవాడు

ఇరువైదు పైసలగరొత్తులు కాల్చి
అరవైదు కోట్ల వారములడుగుతాడు
అరవైదు కోట్ల వారములడుగుతాడు
ధైవాల పేరుతో ఛంధ్దలకై గండ
భక్తి ముసుగు తొడిగి భలే పోజు పెడతాడు
యుక్తి పేరా నరుడు రక్తిలో రాజై
యుక్తి పేరా నరుడు రక్తిలో రాజై
రాకాసి రూపాన రంజిల్లు తున్నాడు

మాయమైపోతున్నాడమ్మా మనిషన్నవాడు
మచ్చుకైనా లేడు చూడు మానవత్వం వున్నవాడు

అవసరాలకు మనిషి సృష్టించి రూపాయి
చుట్టూ తిరుగుతున్నాడమ్మా
అవసరాలకు మనిషి సృష్టించి రూపాయి
చుట్టూ తిరుగుతున్నాడమ్మా
రూపాయి కొరకు ఏ పాపానికైతేమి
వొడిగట్టే నదిగో చూడమ్మా
కోటి విద్యలు కూటి కోసమన్నది పోయి
కోటి విద్యలు కూటి కోసమన్నది పోయి
కోట్లకు పరిగెత్తి కోరికలు చెలరేగ

మాయమైపోతున్నాడమ్మా మనిషన్నవాడు
మచ్చుకైనా లేడు చూడు మానవత్వం వున్నవాడు
మానవత్వం వున్నా వాడు
మానవత్వం వున్నవాడు

# తెలంగాణ జాతీయగీత రచయిత అందెశ్రీ

ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు
9989628049



తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిన తర్వాత అధికారికంగా అన్ని విద్యాలయాలు, అధికార కార్యాలయాల్లో ఆలపించే 'జయ జయహే తెలంగాణ'' గీతం రచించిన కవి అందెశ్రీ. అందరిలా చదువుకోవడం ద్వారా తనకేమీ డిగ్రీలు లేవు; కానీ, కాకతీయ విశ్వవిద్యాలయం గౌరవడాక్టరేట్ డిగ్రీని ఇచ్చే స్థాయిలో సాహిత్య రంగంలో కృషి చేశాడు. తానేమీ రాజకీయ నాయకుడు కాదు; కానీ, కాంగ్రెస్ పార్టీ తెలంగాణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడుగా ఉన్ననాటి నుండీ ముఖ్యమంత్రి అయ్యేవరకూ శ్రీరేవంత్ రెడ్డిగారితో ఎంతో సన్నిహిత సంబంధాలను కొనసాగించాడు. తెలంగాణరాష్ట్ర తొలి ముఖ్యమంత్రి, శ్రీ కె.సి.ఆర్ గారితోను, ఆ రాజకీయ పార్టీలతోను అందెశ్రీ తన 'జయ జయహే తెలంగాణ గీతం' విషయంలో వచ్చిన విభేదాల వల్ల తీవ్రంగా వ్యతిరేకించాడు. తనకు కులమత భేదాలు అంటగట్టవద్దు అనేవాడు. సభలు, సమావేశాలు జరుగుతుంటే వేదికపై కూర్చోవడం కంటే అందరిలో ఒక సామాన్యప్రేక్షకుడిగా ఉండడానికే ఇష్టపడేవాడు. హైదరాబాదులోని అనేక సాహిత్యసభలలో సామాన్యవ్యక్తిగానే పాల్గొన్నా, ఆ నిర్వాహకులు అందెశ్రీని గుర్తించి వేదికపైకి పిలిచి మాట్లాడించేవారు. చాలాసేపు బ్రతిమాలితే తప్ప వేదికపైకి వచ్చేవాడు కాదు. తాను ప్రేక్షకుడిగా ఉండే తన మాటనైనా, పాటనైనా వినిపిస్తాననేవాడు. ఒక సామాన్యకుటుంబంలో జన్మించిన అందె ఎల్లయ్య కొన్ని పాటతోనే 'అందెశ్రీ'గా తెలుగు సమాజంలో, తెలుగు సాహిత్యంలో, తెలుగు సినీచరిత్రలో ఒక ప్రత్యేక గుర్తింపుని తెచ్చుకున్నాడు. ఆయన 10 నవంబర్ 2025 వ తేదీన హఠాన్మరణం చెందారు. ప్రకాశిక పత్రిక ఆయనకు నివాళులు

అర్పిస్తూ ఈ సందర్భంగా ఆయన వ్యక్తిత్వం, జీవిత విశేషాలు, ఆధునిక వాగ్గేయకారుడుగా ఆయన సాధించిన ప్రత్యేక ముద్రను ఈ వ్యాసంలో తెలుసుకుందాం.

అందె ఎల్లయ్యగా తన జీవనోపాధి కోసం గొర్రెలకాపరిగా, రోజువారీ కూలీగా, తాపీపని కార్మికుడిగా జీవితాన్ని ప్రారంభించాడు.

**అందెశ్రీ జీవితం :**

అందెశ్రీ 1961 జూలై 18న సిద్దిపేట జిల్లా (పూర్వపు వరంగల్) రేబర్తి గ్రామంలో జన్మించాడు. ఆయన అసలు పేరు అందె ఎల్లయ్య. తల్లిదండ్రులు శ్రీమతి ఎల్లవ్వ, శ్రీ బొడ్డయ్య. చిన్నతనంలోనే తల్లిదండ్రులను కోల్పోయి అనాథగా పెరిగానని అందెశ్రీ చెప్పుకునేవారు. తన తండ్రి పేరు చెప్పుకోవడానికి అందెశ్రీ ఇష్టపడేవాడుకాదు. తల్లి ప్రస్తావన తీసుకొస్తే, తనను చిన్న వయసులోనే వదిలేసి వెళ్లిపోయిందనే బాధతో కన్నీళ్ళు పెట్టేవాడు. ఆయన విద్యాభ్యాసం పాఠశాలల్లో జరగలేదు. తన మిత్రులవల్ల అక్షరాలు నేర్చుకున్నాడు. ఆ అక్షరాలతోనే చదవడాన్నీ నేర్చుకున్నాడు. ఈ విషయాలన్నీ ఈ వ్యాసకర్తకు వివిధసందర్భాల్లో కలిసినప్పుడు ప్రత్యక్షంగా చెప్పిన విషయాలు. తాను ఏ పాఠశాలలోనూ చదువుకోలేదు. కనుక అడిగిన వారందరికీ తనకు ఎలాంటి ప్రాథమికవిద్యా లేదని చెప్పేవాడు. అందె ఎల్లయ్యగా తన జీవనోపాధి కోసం గొర్రెలకాపరిగా, రోజువారీ కూలీగా, తాపీపని కార్మికుడిగా జీవితాన్ని ప్రారంభించాడు.

**అందె ఎల్లయ్య 'అందెశ్రీ' గా గుర్తింపు:**

తాపీపని కోసం ఒకసారి నిజామాబాద్ వెళ్ళాడు. అక్కడ పాటలు పాడుకొంటూ పనిచేసేవాడు. తొలినుండీ తనకు ఆధ్యాత్మిక భావాలు ఉండేవి. అందువల్ల శృంగేరీ మఠం స్వామి శంకర్ మహారాజ్‌ని కలిశాడు. అందె ఎల్లయ్య ఆశువుగా చెప్పిన కవిత్వాన్ని, పాటలను శంకర్ మహరాజ్ విని, ఆయనలోని ప్రతిభను గుర్తించి 'అందెశ్రీ' అనే పేరు పెట్టారు. ఆనాటి నుండీ అందె ఎల్లయ్య 'అందెశ్రీ' గా ప్రాచుర్యం పొందాడు. ఆయన ఇచ్చిన అనేక ఇంటర్వ్యూల్లో తన జీవితవిశేషాలు వివరించాడు. ముఖ్యంగా ఏబిఎన్ ఆంధ్రజ్యోతి టి.వి.ఛానల్‌లో ప్రముఖపాత్రికేయులు వేమూరి రాధాకృష్ణ

గారు నిర్వహించిన ఓపెన్ హార్ట్ విత్ ఆర్కే లో భాగంగా 33వ ఎపిసోడ్, 6.6.2010లో అనేక విషయాలు చెప్పాడు. డా.రామకృష్ణారెడ్డిగారు చేరదీయకపోతే 1991లోనే తాను ఆత్మహత్య చేసుకునేవాడినని చెప్పాడు. కుటుంబ ఆర్థిక పరిస్థితులు అతడినలా ప్రేరేపించాయి. జగ్గిరెడ్డి మల్లారెడ్డి అనే బాల్యపు గురువు చదువు నేర్పాడు.భారత, రామాయణ, యక్షగానాలు వంటివన్నీ పనులు చేసుకుంటూ ఆయన దగ్గరనుండి నేర్చుకున్నాడు. మునీర్ శేక్ మాటల వల్ల వైరాగ్యంనుండి బయటపడ్డాడు. జానపద సాహిత్యంలో విశేషంగా కృషి చేసిన ఆచార్య బిరుదురాజు రామరాజుగారు కూడా అందెశ్రీని చేరదీసారు. పాటలు పాడ్డం, రాయడంలో డప్పురమేష్, గద్దర్ వంటి వాళ్ళంతా ప్రోత్సాహం అందించారు. అందెశ్రీ తాను ఆశువుగా పాటలు అల్లుతాడు. వాటిని తనదైన శైలిలో రాగయుక్తంగా ఆలపిస్తాడు. ఎడమచేతిని మూతికి అడ్డంగా పెట్టుకొని, మరొకచేతిని పైకెత్తుతూ తన నోటిని కనిపించకుండా గంభీరమైన స్వరంతో వినిపిస్తుంటాడు. మైకు లేకపోయినా ఎంతోమందికి స్పష్టంగా వినిపించేలా పాడేవాడు. తెలంగాణాలోని మరొక ప్రజా వాగ్గేయకారుడుగా పేరొందిన గోరేటి వెంకన్నకు, ఈయనకు మధ్య సహృదయవాతావరణం ఉండేది కాదు. ఇద్దరూ ఒకేసారి ఉస్మానియా విశ్వవిద్యాలయం దగ్గర జరిగిన ఒక సభలో (17.8.2023) ఒకరిపై ఒకరు వ్యంగ్యాస్త్రాలు వేసుకొంటూ పాటలు పాడుతూ మాట్లాడడమే దీనికి నిదర్శనం. అయితే దీనిలో అందెశ్రీ వాదనలోని సారాంశాన్ని చూస్తే కవులు, కళాకారులు అధికారానికి దాసోహం కాకూడదు అనేదే కనిపిస్తుంది.

అందెశ్రీ ప్రకృతిని ప్రేమిస్తాడు. ప్రకృతితో తన్మయమై పాటగా మారిపోతుంటాడు. తన జీవితానుభవంతో పాటలను ఆలపిస్తాడు.

**అందెశ్రీ రచనలు:**

అందెశ్రీ ప్రకృతిని ప్రేమిస్తాడు. ప్రకృతితో తన్మయమై పాటగా మారిపోతుంటాడు. తన జీవితానుభవంతో పాటలను ఆలపిస్తాడు. తర్వాత దాన్ని ఒక పాటగా రాసుకుంటాడు. ఆయన పాటలు కొద్దిసంఖ్యలోనే ఉన్నాయి. అయినప్పటికీ అవన్నీ శక్తివంతంగా ప్రజల్లోకి వెళ్ళాయి. ఆ పాటల్లో కనిపించే జానపదతత్వం, ప్రకృతిపట్ల ప్రేమ, మానవీయతలను ముప్పేట కలిపి ఉండడమే

దానికి ప్రధానకారణంగా భావించవచ్చు. అలా తాను ప్రకృతినీ, తనను ప్రోత్సహించినవారినీతనగురువులనుఅనేకఇంటర్వ్యూలలోస్మరించుకున్నాడు. 'పాటల పూదోట'(1994) అనే లలితగీతాల సంపుటి నిండా ఆ భక్తి భావమే కనిపిస్తుంది. తర్వాత గతంలో తాను రాసిన కొన్ని పాటలను 'అందెల సందడి' (1994) అనే కవితాసంపుటి పేరుతో ప్రచురించాడు. తెలంగాణ పాటలు, వచన కవితలు కలిపి అందెశ్రీ తాను సంపాదకుడు, సంకలన కర్తగా వెయ్యి పేజీలకు పైగా ఉండే, 'నిప్పుల వాగు' తెలంగాణ ఉద్యమపాట అనే ట్యాగ్ లైన్ తో (2022) ఒక బృహత్ సంకలనాన్ని తీసుకొచ్చాడు. 1946 నుండి 2021 వరకు వచ్చిన తెలంగాణ ఉద్యమస్ఫూర్తిని, సంస్కృతిని ప్రతిఫలించే పాటలు, కవితలను సేకరించి, ఈ పుస్తకంలో ప్రచురించాడు. 'నన్ను కన్న నా తెలంగాణ తల్లి ఋణం తీర్చుకోవడానికి తెచ్చిన పుస్తకం 'నిప్పుల వాగు' అని పదేపదే అనేక ఉపన్యాసాలలో, ఇంటర్వ్యూలలో చెప్పేవాడు. దీనిలో తెలంగాణ కోసం తమ జీవితాలను త్యాగం చేసిన వాళ్ళను స్మరిస్తూ రాసిన పాటలు అనేకం ఉన్నాయి. తెలంగాణ ఉద్యమగీతాలను ప్రచురణల సంస్థల వారు పట్టించుకోలేదని ఆరోపించేవాడు. కనీసం నూరుపాటలను కలిపి ఒక పుస్తకంగా తీసుకురాలేదనే బాధతో తాను సేకరించి ఈ పుస్తకంగా తీసుకొచ్చానని చెప్పుకున్నాడు. నిజానికి ఆచార్య జయధీర్ తిరుమలరావు, బి.ఎస్.రాములు, మరికొంతమందితో పాటు, ప్రజానాట్యమండలి వంటి సంస్థలు పాటలపై ప్రత్యేక గ్రంథాలనే ప్రచురించారు. అయితే, విప్లవ సంస్థల కార్యకలాపాల్లో భాగంగా వాటిని చూడ్డం ఒక ప్రత్యేకమైన గుర్తింపు. కానీ, అందెశ్రీ తెలంగాణ పాటగా చూడాలనీ, తెలంగాణ అస్తిత్వం, సంస్కృతుల ప్రతిఫలనంగా వాటిని ప్రత్యేకమైన గుర్తింపునివ్వాలనేది ఆయన ఆలోచన.

**తెలంగాణ రాష్ట్ర గీతం 'జయజయహే తెలంగాణ':**



అందెశ్రీ, 'జయ జయహే తెలంగాణ జననీ జయ కేతనం' అనే గేయాన్ని రచించి, మలిదశ తెలంగాణ ఉద్యమానికి, ప్రజల్లో చైతన్యానికి ఊపిరి పోసారు. ఈ గీతం తెలంగాణ రాష్ట్ర అధికారిక గీతంగా నిలిచింది. ఈ గీతాన్ని తెలంగాణ

ప్రత్యేక రాష్ట్రం కోసం జరుగుతున్న ఉద్యమ సమయంలోనే అందెశ్రీ ఒక పెద్దపాటగా రచించారు. అంతేకాకుండా తన పెద్దస్వరంతో దాన్ని ఎంతో భావోద్వేగంతో పాడి ప్రజలను చైతన్యపరచేవారు. అలా ఆ గీతం తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా మారుమ్రోగేసరికి దాన్ని అప్పటి ఉద్యమ ప్రధాననాయకుడు కె. చంద్రశేఖరరావు (కెసిఆర్) గారు మెచ్చుకోవడమే కాకుండా, ప్రతి సభల్లోనూ దాన్ని పాడడానికి అవకాశం కలిగించారు. తెలంగాణ ప్రత్యేకరాష్ట్రంగా ఆవిర్భవించిన తర్వాత ఆ గీతాన్ని రాష్ట్ర అధికారగీతంగా చేయడానికి కొన్ని మార్పులు, చేర్పులు చేయాలని భావించి, కవి అందెశ్రీని ముఖ్యమంత్రి కె. చంద్రశేఖరరావుగారు తనదగ్గరకు పిలిపించుకొని, కొన్ని మార్పులు సూచించారు. అయితే, ఆ మార్పులకు కవి అందెశ్రీ అంగీకరించకపోవడంతో దాన్ని అధికారిక గీతంగా ప్రకటించడానికి కొన్ని ఆటంకాలు ఎదురయ్యాయని వార్తలు వచ్చాయి. ఆ తర్వాత కెసిఆర్ గారితో అందెశ్రీకి రాజకీయ వివాదాలు కూడా పెరిగాయి. ప్రత్యక్షంగా కెసిఆర్, వారి కుటుంబాన్ని కవి అందెశ్రీ వ్యతిరేకించడం ప్రారంభించారు. కవి అధికార పార్టీలకు అమ్ముడుపోకూడదని నినదించారు. విచిత్రం ఏమిటంటే, కెసిఆర్ గారు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు, ఆ గీతాన్ని తెలంగాణ రాష్ట్ర అధికారగీతంగా ప్రకటించకపోయినా, అనేక పాఠశాలల్లో ఆ గీతాన్నే ప్రార్థనాగీతంగా ఆలపించేవారు. తర్వాత, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ముఖ్యమంతి రేవంత్ రెడ్డిగారు, కవి అందెశ్రీకి అత్యధిక ప్రాధాన్యాన్నిచ్చేవారు. ఆ గీతాన్నే అధికారికంగా తెలంగాణ రాష్ట్రగీతంగా ప్రకటించారు. అంతే కాకుండా, ఆ పూర్తిగీతాన్ని అంగీకరిస్తున్నట్లు ప్రకటించారు. అయితే, పాట నిడివి, జిల్లాల సంఖ్య మార్పు మూర్పు కారణంగా తెలంగాణ సంస్కృతికి భంగం వాటిల్లకుండా చిన్న చిన్న పదాలను మార్పు చేశారు. దానితో పాటు అధికార కార్యక్రమాల్లో పాడుకోవడానికి వీలుగా ఒక చిన్నగేయం కూడా రూపొందించారు.

ఆ గీతాన్ని తెలంగాణ రాష్ట్ర అధికారగీతంగా ప్రకటించకపోయినా, అనేక పాఠశాలల్లో ఆ గీతాన్నే ప్రార్థనాగీతంగా ఆలపించేవారు.

**పల్లవి:**

జయ జయహే తెలంగాణ జననీ జయకేతనం
ముక్కోటి గొంతుకలు ఒక్కటైన చేతనం
తరతరాల చరిత గల తల్లీ నీరాజనం
పదపదాన నీ పిల్లలు ప్రణమిల్లిన శుభతరుణం

జై తెలంగాణ జైజై తెలంగాణ
జై తెలంగాణ జైజై తెలంగాణ

**చరణం: (1)** జానపద జనజీవన జావళీలు జాలువార
కవిగాయక వైతాళిక కళలా మంజీరాలు
జాతిని జాగృత పరచే గీతాల జనజాతర
అనునిత్యము నీగానం అమ్మా నీవే మా ప్రాణం
జై తెలంగాణ జైజై తెలంగాణ
జై తెలంగాణ జైజై తెలంగాణ

**చరణం: (2)** గోదావరి, కృష్ణమ్మలు తల్లీ నిన్ను తడుపంగా
పచ్చని మా నేలల్లో పసిడిసిరులు పండంగ
సుఖశాంతుల తెలంగాణ సుభిక్షంగా ఉండాలి
ప్రతిదినమది తెలంగాణ ప్రజల కలలు పండాలి
జై తెలంగాణ జైజై తెలంగాణ
జై తెలంగాణ జైజై తెలంగాణ

ఈ పాటను జాతికి అంకితం ఇస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు, నాయకులు, ప్రజలు లేచి నిలబడి ఆ పాట వింటున్నప్పుడు కవి అందెశ్రీ ఎంతో ఉద్వేగానికి గురై, పదేపదే చేయెత్తుతో ఆనందబాష్పాలను కురిపిస్తూ తాను కూడా ఆ పాటను పాడారు. ఆ దృశ్యం అన్ని టీవీల్లోనూ ప్రత్యక్షప్రసారం చేశారు. ఆయన చనిపోయినప్పుడు కూడా ఆ దృశ్యాల్ని పదేపదే టీ.వీ.లలో ప్రసారం చేశారు.

ఒక చరణం, రెండు పల్లవులు ఉన్న ఈ పాట కంటే, పూర్తి నిడివిగా ఉన్న పాటలో తెలంగాణ చైతన్యం, సిరిసంపదలు, సంస్కృతి బాగా ప్రతిఫలిస్తాయి. అంతవరకు తెలంగాణ చరిత్ర సంస్కృతిని భాషను అవహేళన చేశారని భావించే ప్రజలకు ఈ గేయంలోని ప్రతి పదం గుండెల్ని తాకింది. ఒక ఉద్వేగానికి గురి చేసింది. ఒక శక్తివంతంగా అందెశ్రీ ఆ పదాలను ప్రయోగించాడు. తాను జానపద సంస్కృతి వారసత్వానికి చెందిన కవిత్వాన్నే రాస్తున్నప్పటికీ సంస్కృతపదభూయిష్టమైన శైలి కూడా ఆయన పాటల్లో సందర్భానుసారంగా మిళితమై ఉంటుంది. అది ఈ పాటలో కూడా కనిపిస్తుంది. అందుకే ఆయన

చదువుకోలేదని చెప్పినా, ఆయనది సంప్రదాయ సాహిత్య శైలి మిళితమైన జానపద సాహిత్య బాణీగా కనిపిస్తుంది.

*'పంపనకు జన్మనిచ్చి బద్దెనకు పద్యమిచ్చి*
*భీమకవికి చనుబాల బీజాక్షరమైన తల్లి*
*హాలుని గాథాసప్తశతికి ఆయువులూదిన నేల*
*బృహత్కథల తెలంగాణ కోటి లింగాల కోన'*

నన్నయకంటే ముందే హాలుడు గాథాసప్తశతిలో గొప్ప కవిత్వాన్ని చెప్పాడు. ఆ కవి తెలంగాణ ప్రాంతానికి చెందిన వాడు. శాతవాహన వంశానికి చెందిన రాజు హాలుడు. హాలుడు అశ్మక రాజ్యంలోని ప్రతిష్ఠాన పురాన్ని పరిపాలిస్తూ ఉన్నాడని లీలావతి అనే ప్రాకృత కావ్యం చెబుతుంది. నిజామాబాద్ దగ్గరలోని బోధన్ పట్టణాన్ని 'అశ్మక' రాజ్యానికి రాజధానిగా చరిత్రకారులు భావిస్తున్నారు. ఆ మహారాజు సంకలనం చేసిన గాథా సప్తశతి అనే గ్రంథంలో అనేక తెలుగు పదాలు ఉన్నాయని భాషా శాస్త్ర పరిశోధకులు కూడా భావిస్తున్నారు. ఇతన్ని శాతవాహనుల వంశంలో 17వ రాజుగా మత్స్యపురాణం పేర్కొంది. ఇతని ఆస్థానంలోనే గుణాఢ్యుడు అనే గొప్ప కవి ఉండేవాడు. పంపన కవినే 'పంపకవి' అని కూడా పిలుస్తారు. చాళుక్య రాజు రెండవ అరికేసరి ఆస్థానంలో ఉన్న కవిగా పంపనను సాహిత్య చరిత్రకారులు భావిస్తున్నారు. చాళుక్యులు. తెలంగాణాలోని వేములవాడను రాజధానిగా చేసుకొని పరిపాలించారు.ఆయన కన్నడ భాషలో ఆదిపురాణం రాశాడు. కన్నడ కవులలో ఆదికవిగా ప్రసిద్ధి చెందాడు. ఈ కవి గురించి తెలంగాణ సాహిత్య చరిత్రకారులు విస్తృతమైనటువంటి సమాచారాన్ని అందిస్తున్నారు. ఇలా ఒక్కొక్క పేరు చెప్తే అనేక వందల పుటల చరిత్ర కనిపిస్తుంది. ఇంతటి చరిత్ర తెలంగాణాకు ఉందని అందెశ్రీ ఈ పాటలో ధ్వనింప చేస్తున్నాడు.

**ఇంతటి చరిత్ర తెలంగాణాకు ఉందని అందెశ్రీ ఈ పాటలో ధ్వనింప చేస్తున్నాడు.**

*'ప్రజల భాషలో కావ్య ప్రమాణాలు ప్రకటించిన*
*తెలుగులో తొలి ప్రజాకవి 'పాలకుర్కి' సోమన్న*

***రాజ్యాన్ని ధిక్కరించి రాములోరి గుడిని గట్టి***
***కవిరాజై వెలిగె దిశల 'కంచర్ల గోపన్న...'***

మహాకవి కాళిదాసు కావ్యాలకు వ్యాఖ్యానాలు రచించిన మల్లినాథసూరి మా తెలంగాణా ప్రాంతానికి చెందినవాడేననే సగర్వంగా చాటడం కనిపిస్తుంది.

తెలుగు సాహిత్యచరిత్రలో తెలుగులో ఆదికవి ఎవరనే విషయంలో అనేక చర్చలు జరిగాయి. ఆంధ్ర మహాభారతాన్ని రెండున్నర పర్వాలు రచించిన నన్నయను ఆదికవిగా అనేకమంది భావిస్తే, అది అనువాదమే తప్ప స్వతంత్ర కావ్యం కాదు కాబట్టి, నన్నయ ఆదికవి కాదని కొంతమంది అన్నారు. స్థానిక భక్తుల జీవితాలను సాహితీకరిస్తూ స్వీయసృజనతో 'బసవపురాణం' కావ్యాన్ని రచించిన పాల్కురికి సోమనాథుడు తొలి తెలుగు కవి అవుతాడని మరికొంతమంది వ్యాఖ్యానించారు. ఇది సాహిత్య చరిత్రకారుల చర్చోపచర్చలలో కనిపిస్తుంది. ఇలా పాల్కురికి సోమనాథుడిని తొలి తెలుగుకవిగా స్థిరీకరించుకునే ప్రయత్నం కూడా ఈ గేయం చేసింది. అలాగే, తెలంగాణ ప్రాంతంలో ఎంతో ప్రసిద్ధి చెందిన భద్రాచలంలో శ్రీ సీతా రామచంద్రస్వామి దేవాలయం నిర్మాణం చేసిన కంచర్ల గోపన్నను ప్రభుత్వ అధికారాన్నీ, అదీ నాటి ముస్లిం రాజ్యాన్ని ఎదిరించి, హిందూమత ఔన్నత్యాన్ని పునః ప్రతిష్ఠించిన గొప్ప పోరాటయోధుడిగా, భక్తుడిగా వర్ణించటం గమనించాలి. ఇలాంటివన్నీ తెలంగాణ ప్రజలను అనేక భావోద్వేగాలతో ఈ గేయం ప్రతిస్పందించేలా చేసింది.

***'కాళిదాస కావ్యాలకు భాష్యాలను రాసినట్టి***
***'మల్లినాథసూరి' మా మెతుకు సీమ కన్నబిడ్డ***
***ధూళికట్ట నేలినట్టి భౌద్ధానికి బంధువతడు***
***ధిజ్ఞాగుని గన్న నేల ధిక్కారమే జన్మహక్కు'***

నేటి మెదక్ ప్రాంతాన్నే చరిత్రలో మెతుకు సీమగా పిలుస్తారు. ఈ ప్రాంతాన్ని ఒక సాధారణ ప్రాంతంగా కాకుండా, సాహిత్యపండితులు నడయాడిన నేలగా భావిస్తారు. మహాకవి కాళిదాసు కావ్యాలకు వ్యాఖ్యానాలు రచించిన మల్లినాథసూరి మా తెలంగాణా ప్రాంతానికి చెందినవాడేననే సగర్వంగా చాటడం కనిపిస్తుంది.

దిఙ్నాగుడు క్రీ.శ. 5వ శతాబ్దంలో జీవించిన ఒక ప్రసిద్ధ బౌద్ధ పండితుడు, తర్కశాస్త్రవేత్త. ఆయన బౌద్ధ తర్కశాస్త్రానికి బలమైన పునాది వేశారు. బౌద్ధ తర్కశాస్త్రం ద్వారా అప్పటి ఆచారాలను, పద్ధతులను, తప్పుగా భావించిన తాత్వికతలను ప్రశ్నించారు. ఆ నేల నుండి వచ్చిన మేధావులు అన్యాయాన్ని, అజ్ఞానాన్ని ప్రశ్నించడం, తిరస్కరించడం (ధిక్కారం) అనేది తమ హక్కుగా భావించి, సమాజంలో మార్పు తీసుకొచ్చారని చెప్పడానికి బలంగా ఉపయోగించుకున్నారు. అయితే, దిఙ్నాగుని జన్మస్థలం గురించి చారిత్రక ఆధారాలలో స్పష్టత లేదు. కొంతమంది మాత్రం తమిళనాడు రాష్ట్రం, కాంచీపురానికి చెందిన వాడిగా చెప్తారు. మరికొంతమంది ప్రకారం తమిళనాడుకి చెందినవాడే గానీ, తెలంగాణలోని జగిత్యాల జిల్లాలో ఉన్న పాశిగామ గ్రామంలో స్థిరపడి తన కార్యకలాపాలు కొనసాగించాడనే వాదన ఉంది. అలాగే, బౌద్ధ తర్క పండితుడు దిఙ్నాగుడు మెదక్ జిల్లా కొండాపురం ప్రాంతవాసి అని ఆర్.వి. రామారావుగారి అభిప్రాయం.('గతమెంతో ఘనకీర్తి – భవితెంతో భవదీప్తి' వ్యాసం, ఈమాట అంతర్జాల మాసపత్రిక, జూలై, 2013)

**తెలంగాణ నేలయొక్క మేధో, సాంస్కృతిక వారసత్వాన్ని ఈ పాట ఎంతో బలంగా వ్యక్తం చేస్తుంది.**

ఒకప్పటి కరీం నగర్ జిల్లా, ప్రస్తుతం పెద్దపల్లి జిల్లా ఎలిగేడు మండలం లోని ఒక గ్రామం పేరు ధూళికట్ట. ధూళికట్టగా ప్రసిద్ధిలో ఉన్న ఈ పేరు అసలు 'ధూళికోట' అంటే 'మట్టి కోట' అన్నమాట. ఇది కాలక్రమంలో ప్రజల వ్యవహారంలో ధూళికట్టగా రూపాంతరం చెందింది. ఇక్ష్వాకుల కాలంనాటి బౌద్ధ ఆవాసం.1975–76లలో పురావస్తు శాఖ వారి త్రవ్వకాలలో ఇక్కడ ఇక్ష్వాకుల కాలం నాటి కోటలు, బౌద్ధస్థూపం బయటపడ్డాయి. నాగముచుకుంద నాగశిల్పం కూడా లభించింది. మెగస్తనీసు ఇండికాలో ప్రస్తావించిన ఆంధ్రుల ముప్పై కోటలలో ధూళికట్ట కూడా ఒకటని శాసనాధారాల వల్ల తెలియజేస్తున్నాయి. తాత్విక మేధావులను (ధిఙ్నాగుడు), చారిత్రక (ధూళికట్ట బౌద్ధం) ఉద్యమాలను ప్రోత్సహించిన గొప్ప జ్ఞానభూమిగా తెలంగాణాను కీర్తిస్తుంది. ఇది తెలంగాణ నేలయొక్క మేధో, సాంస్కృతిక వారసత్వాన్ని ఈ పాట ఎంతో బలంగా వ్యక్తం చేస్తుంది.

*'పోతన'దీ పురిటిగడ్డ.. 'రుద్రమ'దీ వీరగడ్డ*
*గండరగండడు 'కొమురం భీముడే' నీ బిడ్డ*
*కాకతీయ కళాప్రభల కాంతి రేఖ రామప్ప*
*గోలుకొండ భాగ్యనగరి గొప్ప వెలుగు చార్మినారు...'*

శ్రీమదాంధ్ర మహాభాగవతాన్ని రచించిన భక్తకవి పోతన తెలంగాణ ప్రాంతానికి చెందిన వాడు. ఈయన కడప జిల్లాలోని ఒంటిమిట్ట గ్రామానికి చెందిన వాడని వాదనలు కూడా ఉన్న నేపథ్యంలో ఇది తెలంగాణ ప్రాంతానికి చెందిన వాడని చెప్పడానికి ఉపయోగపడింది. ఒక గొప్ప కవి తమ ప్రాంతానికి చెందిన వాడని చెప్పినట్లు అయింది. గిరిజన పోరాటయోధుడు కొమరం భీమ్ గురించి కూడా ఎంతో గొప్పగా కీర్తించుకున్నారు.

**తెలంగాణ ప్రాంతం, కేవలం యుద్ధాలకు, రాజులకే కాకుండా, ఉన్నతమైన సాహిత్యం, పండితులు, కళలు పోషించబడిన చారిత్రక కేంద్రమని స్పష్టం చేస్తుంది.**

*'సమ్మక్క'లు 'సారక్క'లు సర్వాయి పాపన్నలు*
*సబ్బండ వర్ణాల సాహసాలు కొనియాడుతు*
*ఊరూర పాటలైన 'మీరసాబు' వీరగాథ*
*దండు నిడిపే పాలమూరు 'పండు గొల్ల సాయన్న'*

తెలంగాణ ప్రాంతం, కేవలం యుద్ధాలకు, రాజులకే కాకుండా, ఉన్నతమైన సాహిత్యం, పండితులు, కళలు పోషించబడిన చారిత్రక కేంద్రమని స్పష్టం చేస్తుంది. తెలంగాణ చరిత్ర కేవలం రాజులది మాత్రమే కాదు, అన్ని వర్ణాల (గిరిజనులు, బహుజనులు, దళితులు) వీరత్వంతో కూడినదని, ఆ సాహసాలన్నీ ఆ నేల యొక్క అస్తిత్వంగా నిలిచాయని శక్తివంతంగా ప్రకటిస్తుంది.

*'జానపద జనజీవన జావళీలు జాలువార*
*జాతిని జాగృతపరిచే గీతాల జనజాతర*
*వేలకొలదిగా వీరులు నేల ఒరిగి పోతేనేమి*
*తరుగనిదీ నీ త్యాగం మరువనదీ శ్రమ యాగం'*

తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జరిగిన ఉద్యమం, అందులో కవులు, ప్రజల పాత్ర, మరియు ఆ త్యాగఫలితంగా భవిష్యత్తులో ప్రజలు సాధించాల్సిన లక్ష్యాలను వివరిస్తోంది. తెలంగాణ ఉద్యమంలో జానపద కళలు, పాటలు ఎంత కీలకపాత్ర వహించాయో ఈ గేయం చెబుతోంది.

*'కవిగాయక వైతాళిక కళల మంజీరాలు*
*డప్పు, ఢమరుకము, డక్కి, శారద స్వరనాదాలు*
*పల్లవుల చిరుజల్లుల ప్రతి ఉల్లము రంజిల్లగ*
*అనునిత్యము నీ గానం అమ్మ నీవే మా ప్రాణం'*

జానపద గేయాలు, జావళీలు (ఒక రకమైన లయాత్మక గీతాలు) ప్రజల జీవితాన్ని, కష్టాలను ప్రతిబింబిస్తూ, ఉద్యమస్ఫూర్తిని రగిలించాయి. కవులు, కళాకారులు తమ పాటల ద్వారా ప్రజలందరినీ ఏకం చేసి, తమ హక్కుల గురించి జాగృతం చేశారు. ఆ పాటలన్నీ కలిసి ఒక పెద్ద ఉత్సవం (జనజాతర) వలె ప్రజల హృదయాల్లో నిలిచాయి. తెలంగాణలోని జానపద కళలను కూడా ఆరాధించే విధంగా తన విజయాన్ని మలిచాడు.

**ఈ గేయం ఉద్యమంలో ప్రాణాలు కోల్పోయిన తెలంగాణ అమరుల త్యాగాన్ని ప్రస్తావిస్తోంది.**

*'బడుల గుడులతో పల్లెల ఒడలు పులకరించాలి*
*విరిసే జనవిజ్ఞానం నీ కీర్తిని పెంచాలి*
*తడబడకుండా జగాన తల ఎత్తుకొని బ్రతుక*
*ఒక జాతిగ నీ సంతతి ఓయమ్మ వెలగాలి.'*

అంతేకాదు, ఈ గేయం ఉద్యమంలో ప్రాణాలు కోల్పోయిన తెలంగాణ అమరుల త్యాగాన్ని ప్రస్తావిస్తోంది. ఎందరో యువకులు, ప్రజలు రాష్ట్ర సాధన కోసం ప్రాణాలర్పించిన విషాదకర వాస్తవాన్ని ఇది గుర్తు చేస్తుంది. ఆ వీరుల త్యాగం ఎప్పటికీ తరగనిదని, ఉద్యమకారులు పడిన శ్రమ, పోరాటం ఒక యజ్ఞంతో (యాగం) సమానమని, దానిని ఎప్పటికీ మర్చిపోకూడదని కవి ఉద్ఘాటిస్తున్నారు. ఉద్యమం తరువాత తెలంగాణ ప్రజలు ఆశించిన అభివృద్ధిని

ఇది సూచిస్తుంది. కేవలం ఆధ్యాత్మిక కేంద్రాలు (గుడులు) మాత్రమే కాకుండా, విద్యాలయాలు (బడులు) కూడా ముఖ్యమని, విద్యాభివృద్ధి, సామాజిక అభివృద్ధితో పల్లెలు పులకించిపోవాలని ఆకాంక్షిస్తున్నారు.

తెలంగాణ సాధించిన తర్వాత, ప్రజలలో విజ్ఞానం (జ్ఞానం) వికసించి, ఆ విజ్ఞానం ద్వారానే ఆ ప్రాంతంయొక్క కీర్తిప్రతిష్టలు పెరగాలని ఆశిస్తున్నారు. పోరాటాల చరిత్ర గల తెలంగాణ ప్రజలు ఇకపై ఏ ఇబ్బంది లేకుండా, గౌరవంగా (తల ఎత్తుకొని) జీవించాలని కోరుకుంటున్నారు. తెలంగాణ బిడ్డలు అందరూ ఒకేజాతిగా, సమైక్యంగా ప్రపంచంలో ప్రకాశించాలని, వారు సాధించుకున్న ఆత్మగౌరవాన్ని కాపాడుకోవాలని పద్యం ముగుస్తుంది. భౌగోళిక చరిత్రను, సంస్కృతిని, అన్ని వర్ణాల వర్గాల వారి సమైక్య ఉద్యమస్ఫూర్తినీ, సమైక్యశక్తిని ఎంతో అద్భుతంగా వర్ణించిన గేయం కనుకనే అన్నివర్ణాల వారినీ అన్నివర్గాల వారినీ ఆకట్టుకుంది.

**మరో మహా గేయం 'మాయమైపోతున్నాడమ్మా...':**

అందెశ్రీ అనగానే తెలంగాణ గేయం ఎలాగైతే గుర్తుకు వస్తుందో అంతేపేరు తెచ్చిన మరొక గేయం 'మాయమైపోతున్నాడమ్మా... మనిషన్నవాడు'.

***'మాయమైపోతున్నాడమ్మా మనిషన్నవాడు***
***మచ్చుకైనా లేడు చూడు మానవత్వం వున్నవాడు***
***మానవత్వం వున్నా వాడు***
***మానవత్వం వున్నవాడు.'***

అని ప్రారంభమవుతుంది. అతడికి మానవత్వం ఉన్నప్పటికీ, దాన్ని తనలోనే దాచుకుని మానవుడు గురించి చెప్తున్నాను అని తెలుగుభాషలోని ఆ ఊనికకు ఉన్న గొప్పతనంతో గేయాన్ని ప్రారంభిస్తాడు.

***'మాయమైపోతున్నాడమ్మా మనిషన్నవాడు***
***మచ్చుకైనా లేడు చూడు మానవత్వం వున్నవాడు***
***నూటికో కోటికో ఒక్కడే ఒక్కడు***
***నూటికో కోటికో ఒక్కడే ఒక్కడు***
***యాడ వున్నాడో కాని కంటికి కానరాడు' //మాయ//***

అందెశ్రీ గారి అత్యంత శక్తివంతమైన గేయాల్లో ఈ 'మాయమైపోతున్నాడమ్మా మనిషన్నవాడు'లో మానవీయత, అభివ్యక్తి, తెలంగాణ సంస్కృతి స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఈ గేయం ఆధునిక సమాజంలోని మానవీయ విలువలు పతనమవుతున్న తీరును కవి గుండె ఘోషగా వ్యక్తం చేస్తుంది. ఇది కేవలం పాట కాదు, సమాజంలోని వైరుధ్యాలు, స్వార్థం, కపటంపై కవి సంధించిన తీవ్రమైన విమర్శ.

**గేయంలోని మానవీయత (Humanity):**

గేయమంతటా ఒక ఆర్తి, నిస్సత్తువ కనిపిస్తుంది. కవి, "మనిషన్నవాడు మాయమైపోతున్నాడు" అని చెప్పడం ద్వారా, మనిషిలోని అంతర్గత విలువలు, దయ, కరుణ కనుమరుగవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మానవత్వం లేకపోవడం: "మచ్చుకైనా లేదు చూడు మానవత్వం వున్నవాడు" అనే వాక్యం, నిజమైన మనిషిని వెతుకుతూ కవి పడుతున్న వేదనను తెలియజేస్తుంది. స్వార్థం పెరిగి, ఆత్మీయబంధాలు తెగిపోతున్నాయని (దిగజారుతున్నాడోయమ్మా) కవి ఆందోళన చెందుతారు.

***'నిలువెత్తు స్వార్థము నీడలగొస్తుంటే***
***చెడిపోక ఏమైతదమ్మ చెడిపోక ఏమైతదమ్మ***
***ఆత్మీయ బంధాల ప్రేమ సంబంధాల***
***దిగజారుతున్నాడోయమ్మా దిగజారుతున్నాడోయమ్మా***
***అవినీతి పెను ఆశ అంధకారంలోనే***
***అవినీతి పెను ఆశ అంధకారంలోనే***
***చిక్కి పోయి రోజు శిథిలమౌతున్నాడు' //మాయ//***

ఆత్మీయబంధాలు, ప్రేమసంబంధాలు కేవలం స్వార్థం, డబ్బు చుట్టూ తిరుగుతున్నాయని, నిలువెత్తు స్వార్థం మనిషిని శిథిలం చేస్తుందని విమర్శించారు.

***'కుక్క నక్కలా దైవ రూపాలుగా కొలిచి***
***పంది నందిని జూస్తే పడి మొక్కుతుంటాడు***

*పంది నందిని జూస్తే పడి మొక్కుతుంటాడు*
*చీమలకు చక్కెర పాములకు పాలోసి*
*జీవకారుణ్యమే జీవితం అంటాడు*
*జీవకారుణ్యమే జీవితం అంటాడు*
*తోడ పుట్టిన వాళ్ళ ఊరవతలకినెట్టి*
*తోడ పుట్టిన వాళ్ళ ఊరవతలకినెట్టి*
*కులమంటూ ఇలా మీద కలహాల గిరి గీసి' //మాయ//*

జంతువులపై (కుక్క, నక్క, పాము, చీమలు) ప్రేమ చూపడం ('జీవకారుణ్యమే జీవితం' అంటాడు) బాగానే ఉన్నా, తనతో సమానమైన మనుషులను మాత్రం కులం, వర్గం పేరుతో దూరం నెట్టేస్తున్న కపటత్వాన్ని తీవ్రంగా ప్రశ్నించారు.

**అభివ్యక్తి (Expression and Style):**

అందెశ్రీ గారి కవితా శైలి ఈ గేయానికి ప్రాణాన్ని పోసింది. ఇది సూటిగా, సరళంగా ఉంటూనే, లోతైన భావాన్ని వ్యక్తం చేస్తుంది.గ్రామీణ తెలంగాణ యాసలో ఉన్న పదజాలం (ఉదా: యాడ, కాయాన్ని, వొడిగట్టె) పాఠకులకు / శ్రోతలకు త్వరగా చేరువవుతుంది. శక్తివంతమైన పోలికలు (Metaphors) కూడా ఈ గేయంలో గల సాహిత్యవిలువల్ని పెంచేలా చేసింది.

*'ఇనుప రెక్కల డేగ విసిరినా పంజాకు*
*కోడి పిల్లె చిక్కి కొట్టుకుంటున్నారు*
*కోడి పిల్లె చిక్కి కొట్టుకుంటున్నారు*
*ఉట్టికి స్వర్గానికి అందకుండా తుదకు*
*అస్థిపంజరామయ్యి అగుపించనున్నాడు*
*అస్థిపంజరామయ్యి అగుపించనున్నాడు*
*కదిలే విశ్వము తన కనుసన్నల్లో నడుమ*
*కదిలే విశ్వము తన కనుసన్నల్లో నడుమ*
*కనుబొమ్మలు ఎగరేసి కాలగమనము లోన' //మాయ//*

బలవంతుల దౌర్జన్యానికి, అణచివేతకు బలహీనులు ఎలా బలైపోతున్నారో అద్భుతంగా చూపించారు. అవినీతి ఒక పెద్ద ఆశగా, చీకటిగా మనిషిని మింగేస్తుందని వర్ణించారు.

> **'ఇరువైదు పైసలగరొత్తులు కాల్చి**
> **అరవైదు కోట్ల వారములడుగుతాడు**
> **అరవైదు కోట్ల వారములడుగుతాడు**
> **దైవాల పేరుతో చందాలకై గండ**
> **భక్తి ముసుగు తొడిగి భలే పోజు పెడతాడు**
> **యుక్తి పేరా నరుడు రక్తిలో రాజై**
> **యుక్తి పేరా నరుడు రక్తిలో రాజై**
> **రాకాసి రూపాన రంజిల్లుతున్నాడు' //మాయ//**

**ఈ పాటలో తెలంగాణ నేల వాసన, అక్కడి ప్రజల జీవనశైలి, భావోద్వేగాలు స్పష్టంగా కనిపిస్తాయి.**

ఇక్కడ కవి ప్రయోగించిన వ్యంగ్యం, మనుషులు దేవుడిని కూడా స్వార్థం కోసం, బేరసారాల కోసం ఎలా వాడుకుంటున్నారో స్పష్టంగా చెబుతుంది.

### తెలంగాణ సంస్కృతి, యాస :

ఈ పాటలో తెలంగాణ నేల వాసన, అక్కడి ప్రజల జీవనశైలి, భావోద్వేగాలు స్పష్టంగా కనిపిస్తాయి. పాటలోని పదాలు, వాక్యనిర్మాణం (ఉదా: మచ్చుకైనా లేదు చూడు, యాడ వున్నాడో, కొట్టుకుంటున్నారు) స్వచ్ఛమైన తెలంగాణ గ్రామీణ యాసను ప్రతిబింబిస్తాయి. ఈ యాస పాట భావాన్ని మరింత శక్తివంతంగా, హృదయానికి హత్తుకునేలా చేస్తుంది. పాటలోని ఆర్తి, నిస్సహాయత భావం, తరాల నుండి తెలంగాణ ప్రాంతం అనుభవించిన సామాజిక, ఆర్థిక అసమానతల నుండి పుట్టిన కన్నీటి చుక్కల్లా కనిపిస్తుంది. 'కులమంటూ ఇలా మీద కలహాల గిరి గీసి' అనే వాక్యం, సమాజంలో కుల, మత విభేదాలు సృష్టించే గీతలను, దాని వెనుక ఉన్న రాజకీయ, స్వార్థ ప్రయోజనాలను విమర్శిస్తుంది. ఈ గేయం డబ్బు (రూపాయి) మనిషిని ఎలా శాసిస్తుందో, ఎలా అన్ని పాపాలకు ఉసిగొల్పుతుందో చెబుతూ, నేటి ప్రపంచంలో మనిషి రాకాసి రూపం దాలుస్తున్నాడనే విషాదకర సత్యాన్ని అందెశ్రీ అత్యంత శక్తివంతమైన కవిత్వంతో, కళాత్మకతతో ప్రజల ముందుకు తీసుకువచ్చాడు.

**ఆధునిక మానవుని ఆలోచనల ప్రతిఫలనం:**

దీనితోపాటు ఈ గేయంలో ఆధునిక మానవుడి యాంత్రికజీవితం చాలా స్పష్టంగా, తీవ్రమైన విమర్శనాత్మక దృక్పథంతో కనిపిస్తుంది. మనిషి యంత్రంలా మారిపోతున్న తీరు, భావోద్వేగాలు కోల్పోతున్న వైనం ఈ గేయంలో ప్రతిధ్వనిస్తాయి.

*'అవసరాలకు మనిషి సృష్టించి రూపాయి*
*చుట్టూ తిరుగుతున్నాడమ్మా*
*అవసరాలకు మనిషి సృష్టించి రూపాయి*
*చుట్టూ తిరుగుతున్నాడమ్మా*
*రూపాయి కొరకు ఏ పాపానికైతేమి*
*వాడిగట్టే నదిగో చూడమ్మా*
*కోటి విద్యలు కూటి కోసమన్నది పోయి*
*కోటి విద్యలు కూటి కోసమన్నది పోయి*
*కోట్లకు పరిగెత్తి కోరికలు చెలరేగి' ||మాయ||*

**మనిషి భావోద్వేగాలను పక్కనపెట్టి, లాభనష్టాల లెక్కలతోనే బంధాలను కొలవడం యాంత్రికతను తెలియజేస్తుంది.**

మనిషి కేవలం తన కోసమే బ్రతకడం ఒక యంత్రపు లక్షణం. మనిషి తన చుట్టూ ఒక స్వార్థపు గోడ నిర్మించుకొని, భావోద్వేగాలను, ఆత్మీయతను పూర్తిగా కోల్పోయాడని సూచిస్తుంది. 'ఆత్మీయబంధాల ప్రేమసంబంధాల దిగజారుతున్నాడోయమ్మా' – డబ్బు లేదా అవసరాల చుట్టూ తిరిగే సంబంధాలు శాశ్వతం కావు. మనిషి భావోద్వేగాలను పక్కన పెట్టి, లాభనష్టాల లెక్కలతోనే బంధాలను కొలవడం యాంత్రికతను తెలియజేస్తుంది. ఆధునికజీవితంలోని అతిపెద్ద యాంత్రికకోణాన్ని ఆవిష్కరిస్తుంది. మనిషి డబ్బుకు దాసుడై, తాను సృష్టించిన వస్తువు చుట్టూ తిరిగే యంత్రంగా మారిపోయాడు. జీవనోపాధి కోసం కృషి చేయడం కాకుండా, అనంతమైన కోరికలు, డబ్బు సంపాదనే ఏకైక లక్ష్యంగా పెట్టుకోవడం, మనిషిని కేవలం పనిచేసే యంత్రంగా మారుస్తుంది. 'దైవాల పేరుతో చందాలకై దొంగభక్తి ముసుగు తొడిగి భలే పోజు పెడతాడు' అనేది మనిషిలోని కపటత్వాన్ని సూచిస్తుంది. మనిషి లోపల దైవత్వం లేకపోయినా, సమాజానికి మంచివాడిగా కనిపించడానికి వేసే వేషం, నిజాయితీ లేని యాంత్రిక ప్రవర్తనను తెలియజేస్తుంది. 'తోడపుట్టిన వాళ్ళ ఊరవతలకి నెట్టి కులమంటూ ఇలా మీద కలహాల గిరి గీసి' – మనిషి తన తోటి మానవులను

దూరం నెట్టి, నిస్సారమైన విభేదాలకు ప్రాధాన్యత ఇవ్వడం, ఆలోచించే శక్తిని కోల్పోయి, సాంప్రదాయ కట్టుబాట్ల ప్రకారం యాంత్రికంగా వ్యవహరించడాన్ని సూచిస్తుంది. 'ఉట్టికి స్వర్గానికి అందకుండా తుదకు అస్థిపంజరామయ్యి అగుపించనున్నాడు' – ఈ భయంకరమైన పోలిక, డబ్బు, స్వార్థం వెంట పరుగులు తీసిన మనిషి చివరకు ఏమి సాధించాడో తెలియక, గుర్తు తెలియని ఒక అస్థిపంజరంగా, శూన్యంగా మిగిలిపోతాడనే విషాదకరమైన యాంత్రిక ముగింపును ధ్వనిస్తుంది.ఈ పాటను 2008లో వచ్చిన 'ఎర్రసముద్రం' చలన చిత్రంలో పెట్టుకున్నారు. ఈ గేయం ఆధునిక మానవుడు మానవత్వాన్ని కోల్పోయి, కేవలం స్వార్థం, డబ్బు, కపటం అనే మూడు గేర్ల (Gears) ఆధారంగా పనిచేసే యంత్రంగా మారిపోతున్న స్థితినీ, దాని పర్యవసానంగా 'మనిషన్నవాడు మాయమైపోవడం' అని స్పష్టంగా చెబుతుంది. అలాంటి మనిషి మరలా సజీవమైన మనిషిగా, అంటే మానవసంబంధాలను పెంపొందించే మానవుడుగా మారాలనే తపన కనిపిస్తుంది. అదే ప్రజల్ని అత్యంత ఆత్మీయంగా హృదయాలకు హత్తుకుంది. ఆయన పాటలబాణీ ఎక్కువగా జానపదశైలిని పోలి ఉంటుంది, అందుకే అవి సామాన్యప్రజల మనసులకు త్వరగా చేరువవుతాయి. ఉపరితలంపై సరళంగా కనిపించినా, ఆయన పాటల్లో లోతైన సామాజిక, మానసిక, తాత్విక అంశాలు ఇమిడి ఉంటాయి. ఇవన్నీ అందెశ్రీ గారి పాటల్లో కనిపించే ప్రత్యేకతలుగా చెప్పుకోవచ్చు.

> ఆయన పాటల్లో లోతైన సామాజిక, మానసిక, తాత్విక అంశాలు ఇమిడి ఉంటాయి.

**ఇతర గేయాలు – సినిమా పాటలు:**

అందెశ్రీ ఈ రెండు గేయాలు రాయకముందు చాలా గేయాలు రాసినప్పటికీ, ప్రజలు ఆయనను పెద్దగా పట్టించుకున్నట్టుగా కనిపించదు. తర్వాత అస్తిత్వ ఉద్యమాలను అవగాహన చేసుకున్నాడు. దానితో తెలంగాణ ఉద్యమ మొదలైన తర్వాత తాను పాడే విధానం పాట రాసే శైలీ మారింది.ఆయన పాటల్లో తెలంగాణ భాష, నుడికారం, యాస బలంగా ప్రతిబింబింబించేలా చేసుకున్నాడు. సుద్దాల హన్మంతు, సుద్దాల అశోక్ తేజ, గూడా అంజయ్య, ప్రసాదరావు, గద్దర్ మొదలైన వారందరి పాటలశైలిని జాగ్రత్తగా అవగాహన చేసుకున్నాడు. వాటిని బాగా వినేవాడు. దానితో పాటలను ఎలా రాయాలో బాగా తెలుసుకోగలిగాడు. ఆయన

పాటలను సినిమాలలో ఉపయోగించుకున్నారు. దానితో ఆయన సినిమా రంగంలో కూడా ప్రవేశించినట్లయ్యింది. యలమంచిలి శేఖర్ తనని సినిమాల్లో పాటలు రాయించారు. తర్వాత ఆర్.నారాయణమూర్తి కొన్ని సినిమాల్లో కొన్ని పాటలు పెట్టుకున్నారు. అందెశ్రీ 'గంగ' అనే సినిమాకుగానూ 2006లో నంది పురస్కారాన్ని అందుకున్నాడు. 'జై బోలో తెలంగాణ' చలనచిత్రంలో, జై బోలో తెలంగాణ, గలగల గజ్జెలబండి, 'బతుకమ్మ' చలన చిత్రంలో రండి కదలిరండి, సినుకమ్మ, 'ఊరు మనదిరా' చలనచిత్రంలో 'చూడ చక్కని తల్లి' మొదలైన పాటలు తీసుకున్నారు. 'కొమ్మ చెక్కితే బొమ్మరా', 'జన జాతరలో మన గీతం', 'యెల్లిపోతున్నావా తల్లి' వంటి పాటలు ఆయనకు మంచి పేరుని తీసుకొచ్చాయి.

**అందెశ్రీ సినిమారంగంలో పాటల రచయితగా తక్కువ సమయంలోనే ఎంతో ఎక్కువగా కీర్తిని సంపాదించుకున్నారు.**

అందెశ్రీ సాహిత్య దృక్పథం ప్రధానంగా ప్రజాపక్షంగా చెప్పుకోవచ్చు. ఆయన కవిత్వం సాధారణ ప్రజల జీవనసత్యాల చుట్టూ తిరిగింది. ప్రజల కష్టాలు, రైతుల బాధలు, మహిళల వేదనలు, కార్మికుల పోరాటాలు – ఇవన్నీ ఆయన గేయాల్లో సజీవంగా కనిపించేవి. ఆయన పాటల్లో తెలంగాణ భాష, సంస్కృతి, యాస స్పష్టంగా కనిపిస్తాయి. మట్టివాసన, మనసు వేడి, ఆత్మగౌరవం దాగి ఉన్న పదాలతో తెలంగాణ భావజాలాన్ని బలంగా వినిపించాడు. ఆయన గేయాలు అన్యాయంపై తిరుగుబాటు స్ఫూర్తిని రగిలించాయి. లొంగిపోయేది, వంగిపోయేది జీవితం కాదు అనే నినాదంతో పోరాట చైతన్యాన్ని నింపాడు.

అందెశ్రీ సినిమారంగంలో పాటల రచయితగా తక్కువ సమయంలోనే ఎంతో ఎక్కువగా కీర్తిని సంపాదించుకున్నారు. తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించినందుకుగాను 2025 జూన్ 2న తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతులమీదుగా రూ.కోటి నగదు పురస్కారాన్ని అందుకున్నాడు. కాకతీయ విశ్వవిద్యాలయం ఈయనకు గౌరవ డాక్టరేట్ అందించింది. అకాడమి ఆఫ్ యూనివర్సల్ గ్లోబల్ పీస్, వాషింగ్ టన్ డి.సి వారి గౌరవ డాక్టరేట్ తోపాటు లోకకవి అన్న బిరుదునిచ్చి 2014 ఫిబ్రవరి 1లో సన్మానించారు. 2015 ఆగస్టు 14 వతేదీన వంశీ ఇంటర్నేషనల్ ఫౌండేషన్ వారిచే దాశరథి సాహితీ

పురస్కారం, 2015 జూలై 5వ తేదీన డాక్టర్ రావూరి భరద్వాజ, రావూరి కాంతమ్మ ట్రస్ట్ వారిచే జ్ఞానపీఠ్ పురస్కార గ్రహీత డాక్టర్ రావూరి భరద్వాజ సాహితీ పురస్కారం. 2022 అక్టోబరు 15వతేదీన సుద్దాల హనుమంతు–జానకమ్మ జాతీయ పురస్కారం అందుకున్నాడు.

**అందెశ్రీ హఠాన్మరణం:**

అందెశ్రీ ప్రభుత్వం ఇచ్చిన స్థలములో గృహనిర్మాణాన్ని ప్రారంభించాడు. సగం పూర్తయింది. ఆ పనులలో తలమునకలై ఆరోగ్యాన్ని పట్టించుకోలేదు. బీపీ మాత్రలు వాడలేదు. దానివలన అతను గుండెపోటుతో చనిపోయాడని డాక్టర్లు ప్రకటించారు. 2025 నవంబర్ 10వ తేదీన గుండెపోటుతో తుదిశ్వాస విడిచారు. ఆయన మరణం తెలంగాణ రాష్ట్ర ప్రజలందరినీ దుఃఖ సముద్రంలో ముంచివేసింది. తెలంగాణాలో ఏ కవికీ జరగనంత గొప్పగా ఆయనకు శ్రద్ధాంజలి ఘటించారు. పత్రికలు కూడా విశేషమైన ప్రాధాన్యాన్ని ఇచ్చాయి. పతాక శీర్షికలలో ఆయన వార్తలను ప్రచురించాయి. అందెశ్రీ శవాన్ని స్వయంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు మోసారు. అందెశ్రీ తనకు కులం, మతం లేదని చెప్పినప్పటికీ, ఆయనను దళితుడిగా, ఒక మాదిగ కులానికి చెందిన వ్యక్తిగా భావించటం వల్లనే తెలంగాణ తొలి రాష్ట్ర ముఖ్యమంత్రి ఆయన గేయాన్ని అధికారికంగా గుర్తించడానికి ఇష్టపడలేదని అనేకమంది విమర్శించారు. స్వయంగా అందెశ్రీ కూడా ఒక ఇంటర్వ్యూలో తాను దళితుడుగా పుట్టినా, పుట్టకపోయినా దళిత తల్లి చనుబాలు త్రాగాడు కనుక, తనను దళితుడుగానే పరిగణిస్తున్నారని చెప్పుకున్నాడు. అయితే, అమ్మతనం మాత్రమే తనకు ముఖ్యం అన్నాడు. అటువంటి పరిస్థితుల్లో అందెశ్రీ కి ప్రస్తుత ముఖ్యమంత్రి అత్యంత ప్రాధాన్యాన్ని ఇవ్వడం ఒక గొప్ప చర్చనీయాంశంగా మారింది. ప్రజల పక్షం వహించిన కవికి గొప్ప నీరాజనాలు అందుతాయని అందెశ్రీ మరణం నిరూపించిందని అనేకమంది వ్యాఖ్యానించారు. ఏది ఏమైనప్పటికీ ఆయన సహజమైన కవి, వాగ్గేయకారుడు. తనదైన ప్రత్యేక వ్యక్తిత్వంతో మెలిగినవాడు. అందెశ్రీ ప్రధానంగా ఆశు కవిత్వంలో దిట్ట. ఆయన గేయాలు, పాటలు తెలంగాణ ప్రజల ఆత్మను ప్రతిబింబించాయి. తెలంగాణ సాహిత్య చరిత్రలో ఒక చిరస్మరణీయమైన స్థానాన్ని సాధించుకున్న అందెశ్రీకి ఇవే మా ప్రకాశిక పత్రిక అందిస్తున్న నీరాజనాలు.

# నా పిన తల్లి

అనువాదం శ్రీ పి. అశోక్
98455 73103

నా తల్లిదండ్రులకు నేను ఏకైక సంతానం. నా వివాహానికి మునుపే నా తల్లిదండ్రులు ఇద్దరూ కాలం చేశారు. అప్పటినుంచి నేను మా పినతండ్రి గారి ఇంట్లో ఉండేవాడిని. మా పినతల్లిని చూసినప్పుడల్లా నా ఒళ్ళు మొత్తం రగిలిపోయేది. కానీ, కోపాన్ని అనివార్యంగా అణచుకోవడం మినహా మరో మార్గమే లేదు; ఎందుకంటే ఆమె మినహా నాకు భోజనం పెట్టేవారు మరెవరూ లేరు. ఇదంతా గతం. ఆ తరువాత రోజుల్లో నాకు వివాహమైంది. కాలచక్రం గిర్రున తిరిగింది. నేను నా మనవడిని చూసుకుంటున్నాను. ఈ ముసలిమూర్ఖుడు– ఇప్పుడు కోపంతో తిడితే మాత్రం ప్రయోజనం ఏముంటుంది? కావలసింది అంతా అయిపోయింది; కర్మఫలాన్ని అనుభవించాను. ఇప్పుడు ఎందుకు తిట్టాలి?

కొన్నేళ్ళక్రితం, హొసపేటె రాజణ్ణ నా జాతకాన్ని తీసుకువెళ్ళారు. అది అతని పెద్ద కుమార్తె జాతకానికి సరిపోతుందని చెప్పారు. వివాహసంబంధానికి సంబంధించిన మాటను కలిపి, మా వాళ్ళతో మాట్లాడారంట. అయితే ఈ పాడు ముసలిది చేసిన పనితో... తిట్టకూడదు! ఎంతైనా నాకు పినతల్లి. నాకు భోజనం పెట్టి సాకినావిడ; కొద్ది రోజుల్లో తన ఆస్తిని, బంగారాన్ని నాకు వదిలి వెళ్ళే ఆవిడాయె.

నా పినతల్లికి 60 ఏళ్ళ వయసు. ఆమె నుదుట కుంకుమ ఉంటుంది. వివాహమైన వెంటనే భర్త ఆమెను వదిలి దేశాలు పట్టి వెళ్ళడంతో ఎప్పటికీ ముత్తయిదువే అని చెప్పవచ్చు. తలపై శిరోజాలు చాలా ఒత్తుగా ఉన్నాయి. అక్కడక్కడా రెండు నల్ల వెంట్రుకలు కూడా ఉన్నాయి. సన్నని దేహం. ఇటీవల, ముక్తపురంనుంచి తిరిగి వస్తూ, పడవ దిగుతున్నప్పుడు ఏదో అనర్థం జరిగింది. ఆమె నిత్యం నా సోమరితనం గురించి గొణుక్కుంటూ ఉండేది. పగటి వేళల్లో

సోమరితనాన్ని తిట్టినా, రాత్రిళ్ళు నాకు పెట్టే భోజనం విషయంలో ఎటువంటి లోటుపాట్లు చేసేది కాదు. ఆమె రాత్రి అన్నం తినేది. ఆమె తింటే, అందులో నాకూ కొంత తినేందుకు మిగిల్చేది.

ఆమెకు ఏనుగు వెంట్రుకతో చుట్టిన గొలుసును చాలా విలువైనదిగా భావించేది.

“అయ్యా! నువ్వు నాతో ఒకసారి గుడికి వస్తావా?” అని అడిగి ప్రతి శుక్రవారం రాత్రి నా చేతిలో చింతపండులో జీలకర్ర వేసి దంచిన ఒక చిన్న ముద్దను పెట్టేది. రహదారి వెంట నడుస్తున్నప్పుడు, తానింకా ఎక్కువ రోజులు బతకనని, తన వద్ద డబ్బును, బంగారాన్ని నీ పేరిటే పెడతానని పెద్ద జ్ఞానిలాగా వేదాంతం మాట్లాడేది.

నా పినతల్లి చెబుతున్నట్లుగా ఆమె వద్ద రెండు బంగారు వస్తువులు ఉన్నాయి. పెద్ద పోగుల జత ఆమె పెద్ద చెవులకు చిన్నగా కనిపించేవి; చేతులకు రెండు కడియాలు ఉన్నాయి. మిగిలినవి ప్రత్యేకంగా చెప్పుకునేంత విలువైనవి కాదు. అయితే, ఆమెకు ఏనుగు వెంట్రుకతో చుట్టిన గొలుసును చాలా విలువైనదిగా భావించేది. బంగారంతో చుట్టిన ఏనుగు వెంట్రుకలు సంతానం లేని మహిళలు ధరించడం చాలా అరుదైన విషయం. దీన్ని ఎవరో గొప్ప పెద్ద స్వామీజీ తనకు ఇచ్చారని మా పినతల్లి ప్రతిసారీ చెప్పేది. దాన్ని చేతిలో పట్టుకుని జపిస్తే, దేశాలు పట్టి వెళ్లిన తన భర్త తిరిగి వస్తాడని ఆమె నమ్మింది. అందుకే దాని పట్ల ఆమె చాలా శ్రద్ధ వహించేది. తన నగలన్నింటినీ చీర కొంగుకు ముడి వేసి, అది ఎవరికీ కనిపించకుండా, కుచ్చిళ్ళలోపల ఎవరికీ కనిపించకుండా దాచుకునేది. పగళ్ళు వాటి గురించి ఆలోచిస్తుంది; రాత్రుళ్ళు వాటి గురించి కలలు కంటుంది.

కొందరు స్వామీజీలు రెండు నెలల క్రితం ముక్తపురానికి వచ్చారు. వారి జపతపాలను, స్నానాదులు, పూజలు, ధ్యానాలను చూసేందుకు చుట్టుపక్కల ఊళ్ళనుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు వచ్చారు. నా పినతల్లి పరుగు పెట్టేందుకు ఆమె శరీరం సహకరించదు. తనకోసం ఒక బండి ఏర్పాటు చేయమని కోరింది. ఆవిడను తీసుకువెళ్లేందుకు బండి కట్టేవారిలో ఏ ఒక్కరూ తక్కువ బాడుగకు వచ్చేందుకు అంగీకరించలేదు. చివరికి, నేను ఆమెను ఏదోవిధంగా ఒక చిన్నపడవలో కూర్చోబెట్టాను. అనంతరం దానికి చిన్న తెరచాప కట్టి

ముక్తపురానికి పంపాను. ఒక వారం తర్వాత, ఆమె ఇంటికి తిరిగి వచ్చింది. ప్రయాణపు బడలిక, అలసట ఆమెలో కనిపించలేదు. ఎందుకంటే, ఇంటికి చేరుకోగానే, ఆమె ముడివేసిన వస్త్రపు మూటల్ని పరిశీలించేందుకు కూర్చుంది. ఆమె ముడిని విప్పింది; అనంతరం మరోదాన్ని తీసింది; తరువాత ఇంకో దాన్ని తీసింది. మళ్ళీ మరొకటి, మరొకటి, మరొకటి– ఆమె చేస్తున్న పని నాకు ద్రౌపది వస్త్రాపహరణ సన్నివేశాన్ని జ్ఞాపకం చేసింది.

ఆమె ముడివేసి కట్టిన వస్త్రాలు వేటిలోనూ నగలు లేవు. ఆ ముసలిదానికి తగిన శిక్ష పడిందని నేను ఒక నిమిషం సంతోషించాను.

అలా అన్ని ముడులను విప్పదీసిన తర్వాత, కొద్దిసేపటికి, "పోయాయి! అయ్యో! నా సర్వస్వం పోయింది" అనే కేకతో కూడిన ఏడుపు వినిపించింది.

ఏమయిందో అనుకుంటూ అరుగు మీదున్న నేను ఒక్క ఉదుటున లోపలికి పరుగెత్తాను. ఆమె ముఖం పిడుగు పడినట్లు పాలిపోయి ఉంది. మూటల్ని విప్పిన వస్త్రాలతో నుదురు కొట్టుకుంటూ, దుఃఖపడడం చూసి ఆమె విచారానికి కారణాన్ని ఊహించాను. ఆమె ముడివేసి కట్టిన వస్త్రాలు వేటిలోనూ నగలు లేవు. ఆ ముసలిదానికి తగిన శిక్ష పడిందని నేను ఒక నిమిషం సంతోషించాను. కానీ ఆ వృద్ధురాలి ఏడుపుకు నా హృదయం కరిగిపోయింది. ఆమె బాధాకర స్వరంలో, కన్నీళ్ళలో ఆమె హృదయ వేదన, మూర్ఖత్వం, ఆప్యాయత స్పష్టంగా కనిపించాయి.

"అయ్యో!" ఆమె తలను కొట్టుకుంటూ, "అయ్యో! నా సర్వస్వాన్ని ఎవరో దోచుకున్నారు. నేను దాచుకున్న నాలుగు పైసల్ని నీకు ఇవ్వాలనుకున్నాను. ఒక్క పైసా కూడా మిగల్లేదు. నగల పోయాయని నేను బాధ పడడం లేదు. ఏనుగు వెంట్రుక చుట్టిన జపమాల పోయిందే! ఇకపై మీ బాబాయిని చూడాలన్న ఆశపై ఇకపై నీళ్ళు చల్లుకునేలా అయ్యిందే. అన్నీ పోయి ఉండవచ్చు. కానీ, అదొక్కటన్నా ఉండి ఉంటే బాగుండేది. ఈ ఉదయం నేను ఎవరి ముఖాన్ని చూశాను?" అంటూ ఆమె చిన్నపిల్లలా వెక్కివెక్కి ఏడ్చింది.

ఆమె ఏడుపు చూసి, నా కళ్ళనుంచి కొన్ని కన్నీటి చుక్కలు వచ్చాయి.

భవిష్యత్తులో నాకు దక్కవలసిన నగలమూటను ఎవరో దొంగిలించారని అర్థం చేసుకున్న ఒక్క నిమిషం అనంతరం ఆమె మళ్ళీ విలపించింది.

"నా నగల్ని ఎవరు తీసి ఉంటారు? దోణి నడిపిన సరంగు తీసుకుని ఉండడు; అతను నాకు దగ్గరలోనే నిద్రపోయాడు. అయ్యో! నేను జపం చేసుకునే గొలుసు పోయిందే! మా వారి ముఖాన్ని ఈ జన్మలో మళ్ళీ చూడాలన్న నా కోరిక తీరదే!" అని కొంత సమయం విలపించి ఆ విషయాన్ని మళ్ళీ గుర్తు చేసుకుంది.

**నాకు ఎవరిపైనా అనుమానాలు లేవు; ఒక వేళ అనుమానపడినా, నా అనుమానం నిజం కాకపోతే వారితో విరోధం మొదలవుతుంది;**

తనను తాను సమాధానపరుచుకుని, కొంత సమయం మౌనంగా ఉండి మళ్ళీ, "అయ్యా! నువ్వయినా ప్రయత్నించు; నీ నడుముకు ఆ నగలమూట కట్టి ఉంటే అవన్నీ పోకుండా ఉండేవి. అవి దొరికితే నా నుదుట కుంకుమ కాపాడిన పుణ్యం నీకు వస్తుంది" అని చెప్పింది. దొంగతనం గురించి పోలీసులకు సమాచారం అందించాము.

నాకు ఎవరిపైనా అనుమానాలు లేవు; ఒక వేళ అనుమానపడినా, నా అనుమానం నిజం కాకపోతే వారితో విరోధం మొదలవుతుంది; నేను ఆమెను ఇష్టపడకపోయినా, ఆమె నన్ను ఇంకా ఎక్కువగా ప్రేమించింది. కానీ దొంగను ఎలా గుర్తించి పట్టుకోవాలి? అయితే, చాలామంది పాతాళంలో దాగి ఉన్న దొంగను వాసన, పాదముద్రలు, దగ్గు శబ్దం లేదా మిగిలిపోయిన నీటి రుచి ద్వారా గుర్తించేవారట. నా ఐదు ఇంద్రియాలకు ప్రత్యేక లక్షణాలు లేవు. అయినా, నేను దానిని సాధించాలని దృఢంగా నిశ్చయించుకున్నాను.

మొదట, నేను పాదముద్రల కోసం వెతికాను. వరండా అరుగుపై కొన్ని అడుగుజాడలు కనిపించాయి; అక్కడకు నేను వెళ్లేలోగా ఆ పాదముద్రలు ఒక్కొక్కటిగా కనిపించకుండా పోయాయి. ఇంటి పైకప్పు నుంచి వెనుక పెరటి వరకు ప్రతి చోటా వెతికాను. తిరిగి వస్తుండగా, దారిలో నస్యం డబ్బా కనిపించింది. దొంగ దొరికాడనే నేను అనుకున్నాను. నా మనసులో ఉత్సాహం రెట్టింపైంది. ఈ విషయం పినతల్లికి చెప్పేందుకు నేను వేగంగా పరుగెత్తాను. నేను పరుగెడుతుండగా, నా చొక్కా బొత్తం ఊడి పడిపోవడం,

అదే సమయంలో చేయి పట్టుతప్పి నస్యం డబ్బా కూడా పడిపోయింది.

ఆమె ప్రాణం మొత్తం పోయిన నగలపైనే ఉంది. నేను రాగానే, ఆమె నగల మూట గురించి అడిగింది.

నేను ఒక క్షణం అక్కడే ఆగిపోయాను. పడిపోయిన డబ్బాను నా చేతిలో పట్టుకుని చూశాను. అది లోపల ఖాళీగా ఉంది. మూత ఊడిపోవడంతో నస్యం మొత్తం బయటకు వచ్చి ఖాళీ డబ్బా మాత్రం మిగిలింది. నా చేతిలో ఉన్న మూతను దానికి తిరిగి పెట్టాను; దానికి అది సరిపోయింది. ఒక్కసారిగా నా ఉత్సాహంపై చన్నీళ్ళు చల్లినట్లయింది. మరో క్షణంలో దొంగ దొరుకుతాడన్న నమ్మకం మనసునుంచి దూరమైంది.

ఉదయం, నేను ఇంటినుంచి బయలుదేరాను. నేను చాలా చోట్ల కూర్చుని మాట్లాడాను; నేను ఒకటిరెండు ఇళ్ళలో 'కాఫీ' తాగాను. మధ్యాహ్నానికి ఇంటికి తిరిగి వచ్చాను. దారిలో ఒక స్త్రీని చూశాను; నేను చూస్తుండగా, పోయిన నగల మూట గుర్తుకు వచ్చింది. ఆ నగల మూటలోనే ఏనుగు వెంట్రుక పొదిగిన బంగారపు గొలుసు ఉంది; ఆ స్త్రీ తల కూడా అంతే చిక్కులు పడిన జుట్టుతో అల్లినట్లు ఉంది. నా చూపులు ఆమె జుట్టుపైకి మరలిన వెంటనే, ఎడమ చేతితో ఆమె తన జుట్టును సుతారంగా సర్దుకుంది. నేను సిగ్గుపడి ముందుకు అడుగులు వేశాను. కొంత దూరం వెళ్లిన తర్వాత, నేను వెనక్కు తిరిగి చూశాను. కానీ ఆమె జుట్టు చక్కగా కనిపించలేదు. ఆమె కూడా నాలాగే వెనక్కు తిరిగి దేన్నో చూస్తోంది.

నేను ఇంటికి చేరుకున్నాను. కానీ పిన తల్లి ముందుకు వెళ్ళి ముఖం చూపించేందుకు నాకు మనసు రాలేదు. ఆమె అయినా, నేను దొంగను నా చేత్తో పట్టుకుని వస్తానని నమ్మిందా? దొంగకు పడే శిక్షపై ఆమె మనస్సు నిలవలేదు; ఆమె ప్రాణం మొత్తం పోయిన నగలపైనే ఉంది. నేను రాగానే, ఆమె నగల మూట గురించి అడిగింది. నేను లేనప్పుడు ఒక పోలీసు వచ్చి ఒక రూపాయిని తీసుకెళ్ళాడని చెప్పింది. నేను రాత్రింబవళ్ళు మూటను వెతుకుతూనే ఉన్నానని చెప్పాను. ఇలా మూడు రోజులు నేను అబద్ధం చెబుతూ వచ్చాను. అప్పటి నుంచి అబద్ధానికి, నిజానికి మధ్య తేడా ఏమిటో నా మనసుకు అంతుబట్టలేదు.

అనివార్యమయ్యే ప్రమాదాలను పరిష్కరించే ఉపాయాలు ఎప్పుడూ మూర్ఖుల మనస్సుల్లో ఉంటాయి. ఈ మాట నా విషయంలో సిద్ధంగా ఉందనేందుకు ఒక ఉదాహరణ ఉంది. ఏనుగు వెంట్రుకకు చుట్టిన గొలుసును వెతక్కపోతే, పినతల్లి మనసు ఎప్పటికీ స్థిరంగా మారదు; ఆమె తన ఇంటిని, ఆస్తిపాస్తులను నా పేరిట మార్చుతుందన్న ఆశ కూడా ఇక ఉండదు. నా పినతల్లికి దేవుని పట్ల గొప్ప భక్తి, పురాణాల పట్ల ఆసక్తి ఉంది. పినతల్లి పేరిట ఉన్న ఆస్తులన్నీ ఆమె మరణానంతరం ఏదో మఠానికో, స్వామీజీల చేతుల్లోకి వెళ్ళడమే కాకుండా, దానిలో ఒక పైసా కూడా నా వాటాకు రాదన్న అనుమానం కూడా ఉంది. అయితే, ఆ నగను నేను వెతికి తీసుకువస్తే, ఆమె వాత్సల్యాన్ని నా వైపు మళ్లించుకుని, నేను ఆమెకు వారసునికిగా మారగలిగితే, భవిష్యత్తులో నా అదృష్టంలో ఏమాత్రం తేడా రాదు.

ఆ ఆభరణాలు కంసాలి కొలిమికి చేరాయి; అవి ఇకపై పినతల్లి కంటపడే అవకాశం లేదు!

ఈ కారణంతోనే, నేను ఏదో ఒక విధంగా పోయిన ఆభరణాలను కనుగొనాలని నిర్ణయించుకున్నాను. కానీ, ఆ ఆభరణాలు కంసాలి కొలిమికి చేరాయి; అవి ఇకపై పినతల్లి కంటపడే అవకాశం లేదు! అవి దొరక్కపోతే వాటిలాంటివే మరొకవాటిని చేయించి ఇవ్వడం కష్టమైన పనా? అలా చేయించి ఇచ్చే నగతో ఆ ముసలామెను మోసం చేయడం పెద్ద విషయమా? ఈ దురాలోచనలు నా మనస్సులో పదేపదే తిరుగుతున్నాయి.

మరుసటి రోజు ఉదయం నేను నిద్ర లేచి, "ఓహ్! నేను తొందరపడితే, పని చెడిపోతుంది. మరో వారం రోజుల్లో నేను దొంగను పట్టుకోకుండా విడిచిపెట్టను. నిన్న రాత్రి నాకు కొన్ని ఉపాయాలు తోచాయి. ఈ రోజు నేను దొంగ అడుగుజాడల్లో నడుస్తున్నాను. నేను నగను తీసుకురాకపోతే, నా పేరు రా…" కాదు. ఇలా అనుకుంటూ, నా ఉపాయాలను ఆచరణలోకి తీసుకువచ్చేందుకు బయలుదేరాను.

బంగారంతో చుట్టిన ఏనుగు వెంట్రుక గొలుసును చేయించి ఇవ్వడం కష్టం అవుతుందని నేను భావించలేదు. రెండు రోజుల క్రితం, నేను సాయంత్రం

ఇంటికి తిరిగి వస్తున్నప్పుడు, ఒక మహిళ తలపై అలాంటి వెంట్రుకలు చూసినట్లు నాకు గుర్తుకు వచ్చింది. వాటిలో ఒకటి రెండు వెంట్రుకలు డబ్బుకు పొందగలినా నా పని పూర్తవుతుంది. కొందరు మహిళలు తమ పురుషుల జుట్టును పట్టుకుని తమకు విధేయులుగా ఉండేలా చేసుకుంటారట; నేనూ అలాగే వారిని ప్రేమిస్తున్నట్లు నటిస్తే, నేను ఒక్క మహిళ వెంట్రుకను కూడా దక్కించుకోలేనా? అంతేకాకుండా, నాకు కావలసిన జుట్టు ఉన్నావిడ సాధారణ మహిళ; రాజన్న పొరుగు ఇంట్లో పని చేస్తూ కాలక్షేపం చేసిన మహిళకు డబ్బు ఇస్తే తన జుట్టును నాకు ఇవ్వదా? ఇలా ఆలోచిస్తూ, నడవడంతో అలసట లేకుండా గోవిందరావు ఇల్లు చాలా దూరం అనే విషయాన్ని మర్చిపోయి మరీ నడిచాను.

**నేను ఎంత నియంత్రించుకోవాలని అనుకున్నా, నా గుండె దడదడలాడుతోంది. నోటి నుంచి ఒక్క మాట కూడా పెగలడం లేదు.**

కొన్ని అడుగులు నడిచాక ఇల్లు దగ్గరకు వచ్చింది; ఆమె ఇంటి ఆవరణలో ఏదో పనిచేస్తున్నట్లు నేను దారిలో నిలబడి చూశాను. ఇంటి యజమానిని చూసేందుకు వస్తున్నానని చెప్పాలని అనుకుంటూనే నేను ఇంటి ఆవరణలోకి వచ్చేశాను. ఆ ఆవరణలో ఆమెను చూసినప్పుడు నా మనసు కొంచెం సంకోచానికి గురైంది. ఆ సౌందర్యానికి ఏళ్ళ కన్నా ఎక్కువ లేదు. ఆమె శరీరం నల్లరంగుతో మిలమిలా మెరుస్తూ, ప్రకాశవంతంగా ఉంది; ఆమె చురుకైన కళ్ళను కప్పిన కనుబొమ్మలు నుదుటి ప్రాంతంలో వెంట్రుకల ముడిలాగా ఉన్న ఆమె శిరోజాలను నెమ్మదిగా ముద్దాడుతున్నాయి. తాంబూలం వేసుకునే అలవాటు ఉందేమో, దంతాలు రక్తంతో తడిసినట్లు, పెదవుల అడ్డంకిని దాటి, ఆమె ముఖంపై ఎర్రటి చుక్కలు అలంకరించినట్లు కనిపిస్తున్నాయి. చేతికి కడియం పెద్దగా కనిపిస్తోంది. మిగిలిన చేతికి మట్టిగాజులు మినహా వేరే అలంకరణ లేదు. వరండాలో ఎవరూ లేకపోవడం చూసి, ఆమెతో ఎలా మాట్లాడాలో ఆలోచిస్తూ ఒక నిమిషం అక్కడే ఆగిపోయాను. నేను ఎంత నియంత్రించుకోవాలని అనుకున్నా, నా గుండె దడదడలాడుతోంది. నోటి నుంచి ఒక్క మాట కూడా పెగలడం లేదు.

చివరికి, "ఇఇఇ... ఇక్కడ ఇంటి యజమాని ఉన్నారా?" అని సిగ్గుపడుతూ

అడిగాను. ఆ రోజు నేనామెతో ఏం మాట్లాడానో నాకు పూర్తిగా గుర్తులేదు. కానీ ఆమె నాకు బదులే ఇవ్వలేదు. నేను మళ్ళీ అడిగాను. చెత్తను ఊడ్చుకునే హడావిడిలో ఆమె నా మాట వినపడలేదని అనుకున్నాను. నేను ధైర్యం తెచ్చుకుని, ఆమెకు మరింత దగ్గరగా వెళ్ళాను. సమీపానికి వెళుతుండగానే నా ముక్కుపుటాలకు కొత్త సువాసనతో కూడిన గాలి తాకినట్లయింది.

**అదే సమయంలో ఒక మహిళ ఇంటి ఆవరణలో నుంచి అరుగు ఎక్కడాన్ని చూశాను.**

"ఇంట్లో యజమాని గారు ఉన్నారా?" అని మళ్ళీ అడిగాను. "లేదు; ఆయన పొద్దున్నే లేచి బయటకు వెళ్ళారు" అని బదులిచ్చింది.

ఆ తర్వాత ఆమె మౌనంగా ఉండడం చూసి, నేను మనసులోనే ఏదో గొణుక్కుని వెనక్కు తిరిగివచ్చాను. అదే సమయంలో ఒక మహిళ ఇంటి ఆవరణలో నుంచి అరుగు ఎక్కడాన్ని చూశాను. ఆమె ఎవరో తెలుసుకోవాలన్న ఆసక్తి చూపించకుండా, నేను చేసిన పనికి నేనే భయపడుతూ, వీధిలోకి వచ్చేశాను. మంచి పని చేయాలన్న నా ఆలోచన అక్కడితో ముగిసిపోయింది.

సాధనలో అడ్డంకులు ఎదురైనా, జ్ఞానులు వాటిని అధిగమించేందుకు నిరంతర ప్రయత్నాలు చేస్తారనే అనే పాత సామెత ఉంది. దానికి అనుగుణంగా వ్యవహరించాలని నేను నిర్ణయించుకున్నాను. పినతల్లిని మోసం చేసేందుకు ఈ మహిళతో పరిచయం సరిపోకపోతే, ఆమెతో ప్రతిఫలం లేని ప్రేమ వ్యవహారం అవసరమని నేను అనుకున్నాను. ఆమె జుట్టు తప్ప మరే ఇతర వస్తువు దొంగతనమైన సంపదను తిరిగి అందించలేదని నా మనస్సుకు బలంగా అనిపించింది. కానీ ఈ మహిళ తన తలని నా చేతులకు అందిస్తుందా లేదా అనే పెద్ద సందేహం నాకు వచ్చింది. ఎందుకంటే, ఆమె తల మాత్రమే కాదు, ఆమె మొత్తం శరీరం కూడా వేరొకరి ఆధీనంలో ఉంది. అలాంటప్పుడు జుట్టు కత్తిరింపు ప్రయత్నంలో నా జుట్టు మాత్రమే కాదు, నా తల కూడా పోతుందని నేను భయపడ్డాను. అంతేకాకుండా, ఆమె కోడికి తన తలపై ఉంటే సేవారం (హెన్ కోంబ్) ఎంత ప్రేమ ఉంటుందో, దానికి పదిరెట్లు ఆమెకు తన శిరోజాలపై ప్రేమ ఉంది.

ఆమె తన చేతిలోకి తపేళా తీసుకోవడానికి బదులుగా, తన జాకెట్టు లోపలినుంచి వెండి మూత ఉన్న నస్యం డబ్బాను తీసింది.

కానీ న్యాయమూర్తి నిజాయితీని, మహిళల పవిత్రతను దొంగిలించగల డబ్బు పేదమహిళ నుంచి కొన్ని వెంట్రుకలను కొనలేదా? ఒక పిడికెడు బియ్యం, చిక్కుళ్ళ కోసం రోజంతా కష్టపడి పనిచేసే మహిళ రెండు రూపాయలకు కొన్ని వెంట్రుకలను ఇవ్వలేదా? ఈ రకమైన ఆలోచనలతో నేను ఇంటికి తిరిగి వచ్చాను. చూస్తుండగానే, మూడురోజులు గడిచాయి. నాల్గవ రోజు, నేను రావుగారి ఇంటికి వెళ్ళాను. వెళ్లిన వెంటనే కాళ్ళు కడుక్కునేందుకు నేరుగా స్నానాల గదిలోకి వెళ్ళాను. నేను జుట్టను పొందాలని అనుకున్న మహిళ పొయ్యిలో కట్టెలు పెట్టి మంటలు రాజేసేందుకు ప్రయత్నిస్తోంది.

నా వైపు ఓరకంటితో చూస్తూనే– "పాడు కట్టెలు! ఊది... ఊది కళ్ళే పోతున్నాయి. అయినా ఇంకా మంట రగులుకోలేదు" అంటూ తనలో తాను గొణుక్కుంది.

"కాళ్ళు కడుక్కునేందుకు ఒక తపేళా నీరు కావాలి..." అని సంకోచించకుండానే కొంచె గట్టిగానే అడిగాను. ఆమె లేచి నిలబడింది. కానీ, ఆమె తన చేతిలోకి తపేళా తీసుకోవడానికి బదులుగా, తన జాకెట్టు లోపలినుంచి వెండి మూత ఉన్న నస్యం డబ్బాను తీసింది. నస్యం ఉందో లేదో చూసేందుకు డబ్బాను తన కళ్ళకు దగ్గరగా (అందుకే నా కళ్ళ ఎదురుగా) పెట్టుకుని చూస్తూ, నన్ను అక్కడే అడ్డుకుంది.

నేను కాళ్ళు కడుక్కోవడం మరచి, ధైర్యం చేసుకుని– "నస్యం డబ్బా బాగుంది కదా! నస్యం లేదా?" అని చేయి చాస్తూ అడిగాను.

ఆమె ఆ నస్యం డబ్బాను నా చేతికి ఇవ్వడానికి సిగ్గుపడి, నా కళ్ళ దగ్గరకు తీసుకువచ్చి చూపిస్తూనే, తపేళా తీసుకుని నీటికుండలో ముంచింది. ఎందుకో, ఆ సమయంలో నాకు నవ్వు వచ్చింది; నా నవ్వును ఆమె ఓరకంటితో చూడకుండా ఉండలేకపోయింది. తపేళాలో నీరు నింపి నా చేతికి ఇస్తున్న సమయంలో ఆమె కూడా నవ్వు ఆపుకోలేకపోయింది.

ఆ సమయంలో ఎవరో వస్తున్న శబ్దం నాకు వినిపించడంతో స్నానాల గది నుంచి నేను బయటకు వచ్చేశాను. అక్కడకు వచ్చినామె మా ఇద్దరినీ చూసుకుంటూ ఇంట్లోకి వెళ్లిపోయింది. నేను దురదృష్టవంతుడ్ని అనుకుంటూ అక్కడి నుంచి వచ్చేసాను.

**నా వెనుక ఎవరో పరిగెత్తుకుని వస్తున్నట్లు నాకు అనిపించింది. ఇంటికి చేరుకునేందుకు నేను రెండు అడుగుల దూరంలో ఉన్నాను.**

ఇదేపనిలో నేను తినడం, నిద్రపోవడం, తిరగడం మానేసాను. నేను ఎదుర్కొన్న కష్టాలన్నీ విని ఉంటే, నా భార్య (నేను వివాహం చేసుకుని ఉంటే) బతికేది కాదు. పగలనకా, రాత్రనకా, ఒక వీధినుంచి మరోవీధికి తిరుగుతూ, నిర్జన ప్రదేశాలకు వెళుతే, అనేక గుహల్లో దాక్కుంటూ, వచ్చిన కష్టాలను ఎదుర్కొంటూ, నేను చేపట్టిన పనిని మాత్రం మానలేదు. వెంట్రుకలు దొరికాయి; వాటిని బంగారంతో చుట్టించి గొలుసులాగా చేయించాను. పినతల్లి పోగొట్టుకున్న జపమాలకు దీనికి తేడా ఉందని నాకేమీ అనిపించలేదు.

నేనే గుర్తు పట్టలేకపోతే ఆ ముసలిదాని కళ్ళకు కనిపించి, గుర్తుపట్టడం సాధ్యమేనా? పినతల్లి సర్వస్వం నా చేతికే చిక్కింది. ఇకపై నా సౌభాగ్యానికి అడ్డంకులే లేవు; రాజణ్ణకు అల్లుడ్ని అయ్యే విషయంలో నాకేమీ అనుమానం లేదు. నేను ఆయనకు అల్లుడ్ని అయితే, భవిష్యత్తులో ఆయన ఆస్తి మొత్తం నాకే వస్తుంది (అతనికి కూతురు తప్ప పిల్లలు ఎవరూ లేరు.). ఇలా నాలో లేను లెక్కలు వేసుకుంటూ, ఆశల మేడలు కట్టుకుంటూ వచ్చాను.

ఒకరోజు సాయంత్రం నేను ఇంటికి తిరిగివస్తున్నాను. నా కుడి, ఎడమలకు వెళుతున్న వారిని నేను పట్టించుకోలేదు. నా వెనుక ఎవరో పరిగెత్తుకుని వస్తున్నట్లు నాకు అనిపించింది. ఇంటికి చేరుకునేందుకు నేను రెండు అడుగుల దూరంలో ఉన్నాను. నా వెనుక పరిగెత్తుతున్న శబ్దం వినిపించింది. అకస్మాత్తుగా, ఎవరో నా భుజంపై చేయి వేశారు. చీకటిగా ఉండడంతో చేయి వేసింది ఎవరో నాకు అర్థం కాలేదు.

ఆ వ్యక్తి “రావు గారూ! మిమ్మల్ని తీసుకురమ్మని నన్ను పంపించారు; ఒకసారి పోలీసు స్టేషన్‌కి విచ్చేయాలని ఆదేశాలు వచ్చాయి” అని చెప్పాడు.

"ఇదేంటి, ఎవరు ఆదేశించారు?" అని మెల్లగా గొణుక్కున్నాను.

అదే సమయంలో ప్రజలంతా గుంపులుగా రావడం ప్రారంభించారు; ఒకరిద్దరు "దేనికి బంధించారు? ఎందుకు బంధించారు?" అని అడుగుతున్నారు.

ఆ మాటలు వినగానే, నా తలపైన ఆకాశం పడినట్లు అనిపించింది. నా కళ్ళలో నక్షత్రాలు మెరిశాయి; ప్రతి వస్తువూ, నా చుట్టూ తిరుగుతున్నట్లు అనిపించింది; దూరం నుంచి ప్రజల గొంతులు వినిపించాయి.

నా పినతల్లిని ఒకసారి కలిసి చూడకుండా నేను రాలేనని చెప్పాను. చివరికి, ఆ పోలీసు అంగీకరించి, నా చేయి పట్టుకుని నాతో ఇంటికి వచ్చాడు.

"అతని పిన్నిగారి నగలు కొన్ని దొంగతనమయ్యాయి. ఆ విషయాన్ని విచారణ చేసేందుకే ఇతన్ని స్టేషన్‌కు తీసుకురావాలని ఠాణా అధికారి ఆదేశించారు. ఇతని కోసం మూడు రోజులు వెతికినా కనిపించలేదు. ఇప్పుడు కూడా వీరికి ఏమీ జరగదు" అని ఆ వ్యక్తి చెప్పాడు.

"అదేంటీ, నే... నేను దొంగతనం చేశానా?" అని నోరు పెగల్చుకుని అడిగాను

"మీ పిన్ని గారికి అన్నీ తెలుసు. వాటన్నింటి గురించి మళ్ళీ మాట్లాడుకుందాం. ఇప్పుడు స్టేషన్‌కు వెళదాం పద!" అని ఆ వ్యక్తి అన్నాడు.

నా పినతల్లిని ఒకసారి కలిసి చూడకుండా నేను రాలేనని చెప్పాను. చివరికి, ఆ పోలీసు అంగీకరించి, నా చేయి పట్టుకుని నాతో ఇంటికి వచ్చాడు. నేను రోడ్డు వెంట వస్తుండగా, అన్ని విషయాలు నా మనస్సులో ఒకదాని అనంతరం మరొకటి స్పష్టంగా కనిపించాయి. పోలీసులు మొదటి నుంచి నన్ను లక్ష్యంగా చేసుకుని దర్యాప్తు చేస్తున్నారని, నేను వారి దృష్టిలో లేరని భావించేలా వ్యవహరిస్తూనే, తరచుగా నేను వేసే దొంగ అడుగులు చాలా దగ్గరగా గమనిస్తున్నారని నాకు అర్థమైంది.

అంతేకాకుండా, నేను చాలా ఆభరణాలు తయారుచేసే కంసాలి వాళ్ళ దుకాణాల్లో కూర్చుని, నిర్జన ప్రదేశాల్లో ఒంటరిగా తిరుగుతూ, తరచూ ఒక

క్షుద్రమహిళ ఇంట్లోకి అప్పుడప్పుడూ వెళడానిన వీళ్ళు చూసి ఉండవచ్చు.

ఈ విషయాలన్నీ ఒకాదాని అనంతరం మరొకటి నా మనసులోకి రావడంతో, నా ఆందోళన మరింత పెరిగిపోయింది. నా అంత్యక్రియలకు చితిని నేనే సిద్ధం చేసుకున్నట్లుగా అనిపించింది; నేను తీసుకున్న గోతిలో నేనే పడబోతున్నానని భయం ఒళ్ళంతా ఆవరించింది!

**పోలీసులు నన్ను అరెస్టు చేశారని నా పినతల్లికి కొద్ది నిమిషాల క్రితమే తెలిసింది.**

ఒకవైపు, అరెస్టు చేసి కారాగారానికి పంపిస్తారని, ఇంకోవైపు విచారకరమైన కృతజ్ఞత లేని రోషం. దీని నుంచి బయటపడే మార్గం ఏమిటి? నిజాన్ని దాచి ఉంచితే శిక్ష ఎన్నేళ్ళు ఉంటుందనే ప్రశ్న మినహా మరో అంశం నా ఆలోచనల్లోకి రాలేదు. నిజం ఒప్పుకుంటే, ఈ జీవితంలో నేను నా పినతల్లిని ఇక చూసే అవకాశం ఉండదు. కాబట్టి అబద్ధాన్ని అబద్ధంతో ధ్రువీకరించాలని నేను మనస్సులో గట్టి నిర్ణయాన్ని తీసుకున్నాను.

పోలీసులు నన్ను అరెస్టు చేశారని నా పినతల్లికి కొద్ది నిమిషాల క్రితమే తెలిసింది. మేమిద్దరం లోపలికి వెళ్లిన వెంటనే, ఆమె నా దగ్గర మెల్లగా ఏడుస్తూ, పోలీసులను మర్యాదపూర్వకమైన భాషలో శపించడాన్ని విన్నాను. నేను వెంటనే ఆమె దగ్గరకు వెళ్ళి పోలీసు కూడా నాతో వచ్చాడని చెప్పాను; ఆలస్యం చేయకుండా, నేను ఒక నగను తీసుకువచ్చానని చెప్పి, నా దగ్గర ఉన్న ఏనుగు వెంట్రుకతో చుట్టిన గొలుసును ఆమెకు ఇచ్చాను.

ఆమె దాన్ని పరికించి చూసింది! నన్ను చాలా మెచ్చుకుంది! పోలీసును చాలా తిట్టింది! చివరకు పోలీసతను "అమ్మా! ఆ నగ నీదేనని చెప్పగలరా?" అని అడిగాడు.

"నా నగను నేను గుర్తు పట్టలేనా? అది వెయ్యి ఆభరణాల మధ్యలో ఉన్నా నేను దీన్నే గుర్తిస్తాను" అని పినతల్లి అంది.

"ఇది మీదేనని మీరు అంగీకరిస్తారా?" అని అతను మళ్ళీ అడిగాడు.

ఈ మాటలు విని, నా మనసు సందేహంతో, భయంతో నిండిపోయింది; ఎందుకంటే, నా పినతల్లి ఈ మాటలకు అంగీకరిస్తే, నేను దొంగనని

నిరూపించడంలో పోలీసులకు ఎటువంటి ఇబ్బంది ఉండదు. ఆ మాటల ప్రభావాన్ని తగ్గించేందుకు ప్రయత్నిస్తూ, నేను ఏదో చెప్పడానికి నోరు తెరిచాను. కానీ అప్పుడే ఎవరో లోపలికి వచ్చారు.

**ఇంటికన్నా కారాగారమే నాకు బాగా అనిపించింది. నేను ఇంకా ఏమి చేయగలను?**

వచ్చిన వ్యక్తి పోలీసుకు ఒక కాగితం ఇచ్చాడు. ఆ కాగితం నా పినతల్లి పేరిట ఆమె చిరునామాకు రాసారు. వెంటనే పినతల్లి దాన్ని చదవమని చెప్పింది. అందులో రాసిన దానికి పోలీసు ఇలా చదివాడు:

"రెండునెలల క్రితం శ్రావణమాసం సందర్భంగా ఆలయంలో జరిగిన పురాణకాలక్షేపానికి నువ్వు ఇక్కడికి వచ్చినప్పుడు, నీ గొలుసును ఇక్కడ మర్చిపోయావు. నువ్వు జపం చేసుకునేందుకు నీకు అది ప్రతిసారీ అవసరం అని నాకు తెలుసు. అందుకే ఈ లేఖను తీసుకువచ్చిన వ్యక్తితో నీకు దాన్ని పంపిస్తున్నాను. మిగిలిన నీ నగలను దేవుని విగ్రహాన్ని అలంకరించేందుకు ఇక్కడే ఉంచాను. కృష్ణాష్టమి ఉత్సవం, భజన ఈ ఏడాది ప్రత్యేకంగా నిర్వహిస్తున్నందున, మీరు తప్పనిసరిగా రావాలని స్వామీజీ సూచించారు" అని ఆ లేఖలోని విషయాన్ని పోలీసు చదివాడు.

నేను లేఖను చదువుతున్నప్పుడు, నా శరీరం మొత్తం చల్లబడింది; ఎవరో కర్రతో నన్ను కొట్టినట్లు నా కళ్ళకు కనిపించింది. నేను ఏమి చెప్పానో లేదా ఏమి చేసానో నాకు ఇప్పుడు గుర్తులేదు. చెప్పవలసిన అవసరం కూడా లేదు.

ఇంటికన్నా కారాగారమే నాకు బాగా అనిపించింది. నేను ఇంకా ఏమి చేయగలను? కానీ జరిగిన విషయాన్ని మొత్తం చెప్పడం మంచిది. మరుసటి రోజు, హొసపేట రాజణ్ణ గారి భార్య మా పినతల్లితో ఇలా మాట్లాడుతూ ఉండడం విన్నాను –

"మీ కొడుకు జాతకం మా సకలావతి జాతకంతో సరిపోయింది; సంబంధం బాగానే ఉంది. కానీ మీ అబ్బాయి కొద్ది రోజుల నుంచి వీధులవెంట తిరగడం, ఒకటి రెండుసార్లు కొన్ని ఇళ్ళలోకి వెళ్ళిరావడాన్ని మా వారు చూశారంట. నేను పిల్లవాడే కదా అని ఊరికే ఉన్నాను. గోవిందరావు గారి ఇంటికి వచ్చి వెళ్ళే సమయంలో, అతను తరచుగా మా పొరుగింటి పనిమనిషితో ఒంటరిగా మాట్లాడుతుండటం, ఆమె చేతిలో రూపాయి పెట్టడం కూడా నేను చూశాను.

అందుకే ఈ సంబంధాన్ని కుదుర్చుకునేందుకు మా వారికి సుతారమూ ఇష్టం లేదు'' అని ఆమె చెప్పింది.

ఇది విన్నాక నా జీవిత కోరికలన్నీ అడుగంటిపోయాయి. నేనేం చేయాలి? ఇప్పుడు నేనేం చేయాలి? ఈ జనసాగరంలో నా జీవితనౌకను ఎలా నడపాలి? నా కథ చదివిన జ్ఞానవంతులైన పాఠకులెవరైనా, తెలివితక్కువ వాడైన నేను భవిష్యత్తులో ఏం చేయాలో చెబుతారా!

కన్నడలో మొదటి చిన్న కథగా పంజె మంగేశ రాయరు రాసిన 'నా పిన తల్లి'కి గుర్తింపు ఉంది. ఇది జులై 1900లో మంగళూరు నుంచి వెలువడిన 'సువాసిని' మాసపత్రికలో ప్రచురితమైంది.


THE CONSTITUTION OF INDIA

WE, THE PEOPLE OF INDIA, having solemnly resolved to constitute India into a SOVEREIGN DEMOCRATIC REPUBLIC and to secure to all its citizens:

JUSTICE, social, economic and political;

LIBERTY of thought, expression, belief, faith and worship;

EQUALITY of status and of opportunity;

and to promote among them all

FRATERNITY assuring the dignity of the individual and the unity of the Nation;

IN OUR CONSTITUENT ASSEMBLY this twenty-sixth day of November, 1949, do HEREBY ADOPT, ENACT AND GIVE TO OURSELVES THIS CONSTITUTION.

# తెలుగు మరాఠీ అనుబంధాలు

శ్రీ అంబల్ల జనార్ధన్
8850349858

ఇరుగుపొరుగు రాష్ట్రాలైన మహారాష్ట్ర తెలుగురాష్ట్రాల్లో సాహిత్యపరంగా, సాంస్కృతిక పరంగా మరియు సామాజికంగా ఎన్నో సామ్యాలున్నాయి. అందువల్లే తెలుగు, మరాఠీ ప్రజలు కొన్ని శతాబ్దాలుగా, ఒకరితో మరొకరు మమేకమయ్యారు.

మహారాష్ట్రలో పుట్టిన గోదావరి నది, తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్ గుండా ప్రవహించి, బంగాళాఖాతంలో కలుస్తుంది. ఆ నది పొడవునా తెలుగు మరాఠీ రాష్ట్రాల సాహిత్యం, సంస్కృతి ఏరులై పారుతోంది. క్రీస్తు పూర్వం రెండు వందల ఇరవై సంవత్సరంలో వెలువడ్డ 'గాథా సప్తశతి' అనే మరాఠీ ప్రాకృత గ్రంథం, తెలుగు భాషకు మాతృక అని డా. తూమాటి దోణప్ప, శ్రీ తిరుమల రామచంద్ర మొదలైన తెలుగు భాషాపండితులు సప్రమాణంగా నిరూపించారు. అంటే భాషాపరంగా ఈ రెండు భాషల అనుబంధానికి రెండు వేల ఏళ్ళకు పైగా చరిత్ర ఉంది.

దాదాపు వేయి సంవత్సరాల క్రితం, పాల్కురికి సోమనాథుడు, ఒక పద్యంలో రెండు చరణాలు మరాఠీలో తర్వాతి రెండు చరణాలు తెలుగులో రాసిన ఉదాహరణ ఉంది. కేవలం మరాఠీలో రాసిన ఆయన రచనలు కూడా ఉన్నాయి. అలా తెలుగు, మరాఠీ అనుబంధం సాహిత్యపరంగా దాదాపు వేయి సంవత్సరాల క్రితం మొదలైంది. మరాఠీభాషకు మోడీ లిపి కూర్చింది హేమాద్రి అనే తెలుగాయనే.

**శ్రీ ఛత్రపతి శివాజీ మహారాజు గారికి తెలుగువారి ఆశ్రయం –**

జనవరి, 1677 సంవత్సరంలో శ్రీ ఛత్రపతి శివాజీ మహారాజు గారు హైద్రాబాద్ వెళ్ళినప్పుడు వారికి అప్పటి గోల్కొండ తెలుగు ప్రధాన మంత్రి శ్రీ

మాదన్న, సైన్యాధ్యక్షుడు శ్రీ అక్కన్న ఓ నెలరోజులపాటు ఆశ్రయం ఇచ్చారని చరిత్ర చెబుతోంది. మూడవ పానిపట్ యుద్ధంలో ఒక మరాఠీ సైన్య పటాలానికి నాయకుడు 'శ్రీ రాములు' అనే తెలుగాయనే.

**మరాఠీ – తెలుగు భక్త సంబంధాలుః –**

దత్తాత్రేయ సంప్రదాయ ఆద్యులు శ్రీపాద స్వామివారి అర్థాంగి 'హంసబా' తెలుగింటి ఆడపడుచే. అదే సంప్రదాయంలోని పిఠాపురానికి చెందిన తెలుగువారు శ్రీపాద వల్లభుడు, మహారాష్ట్రంతటా పర్యటించి దత్తాత్రేయ సంప్రదాయాన్ని ప్రచారం చేస్తూ, గాణ్ గాపూర్ లో దత్తాత్రేయ మఠం ఏర్పాటు చేశారు.

మరాఠీ సంత్ ఏక్ నాథ్ గారి గురువు శ్రీ జనార్దన స్వామిగారు తెలుగువారే. ఆయన తెలుగులో 'జీవ ప్రబోధం' అనే కావ్యం రాసారు. తెలంగాణలోని నిజమాబాద్ దగ్గరి ఓ పల్లెలో స్వామి సమర్థ రాందాసులవారి మఠం ఉంది. ఆ మఠంలో రాందాస్, ఉద్ధవ్, వామన్ బువా మొదలగు మఠాధీశుల పరంపరకు సంబంధించిన పత్రాలున్నాయి.

**తెలుగు సాహిత్య సేవ చేసిన తంజావూర్ పాలించిన మరాఠీ రాజులు, ఇతరులుః –**

సం.1684 నుండి సం.1853 వరకు తంజవూర్‌ను పరిపాలించిన శ్రీ ఛత్రపతి శివాజీ మహారాజ్ వంశజులు శహాజీరావ్ భోస్లే, సర్ఫోజీరాజే భోస్లే, తుకోజీ రాజే భోస్లే, రెండవ ఏకోజీ, రెండవ సర్ఫోజీ మొదలైన మరాఠీ రాజులు, తెలుగుపట్ల మమకారంతో ఆ భాష నేర్చుకొని తెలుగులో కావ్యాలు, యక్షగానాలు రాసి తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేశారు. సంత్ ఏక్ నాథ్ గారి తాత శ్రీ భానుదాస్ గారు విజయనగరంలో నివసించేవారట. ఆ ప్రభావం వల్లనేమో సంత్ ఏక్ నాథ్ గారు వరంగల్ లోని ఏకవీరదేవిపై తెలుగులో భక్తి కావ్యం రాసారు. అలాగే భూదాన్ ఉద్యమకారులు ఆచార్య వినోబా భావే తెలుగు రాష్ట్రమంతటా తిరిగి ఎంతో భూమి దానంగా స్వీకరించి పేదలకు పంచడమే కాకుండా, తెలుగుభాష నేర్చుకుని, 'గీతా ప్రవచనము' అనే కావ్యం రాసారు. ఐతే దాని భాష తెలుగైనా లిపి మాత్రం మరాఠీలో ఉండింది!

**తెలుగువారి మరాఠీ సేవః –**

స్వాతంత్ర్యపోరాటంలో, "స్వాతంత్ర్యం నా జన్మసిద్ధ హక్కు, దాన్ని

నేను సాధించి తీరుతాను" అనే నినాదంతో విజృంభించిన లోకమాన్య బాల గంగాధర్ తిలక్ గారితో ఉత్తేజితులైన కొంతమంది, తమ పిల్లలకు ఆయన పేరు పెట్టుకున్నారు. అలా పేరు పెట్టబడిన శ్రీ దేవరకొండ బాల గంగాధర తిలక్ మనల్ని, "అమృతం కురిసిన రాత్రి"లో ముంచెత్తారు. 'ఆంధ్ర తిలక్' గా పేరుగాంచిన శ్రీ గాడిచెర్ల హరిసర్వోత్తమరావు, లోకమాన్యుని ప్రేరణతో 'స్వరాజ్యం' "మాతృభూమి" మొదలగు పత్రికలు వెలువరించి, స్వాతంత్ర్యపోరాట సందేశాన్ని తెలుగు ప్రజలకందిస్తూ, వారి లోని పోరాట పటిమను మేల్కొలిపారు. ఆ పోరాటంలో తనుకూడా పలుమార్లు జైలుకెళ్ళారు. అలాగే శ్రీ కొమర్రాజు లక్ష్మణరావు గారు మరాఠీ భాషపై పట్టు సాధించి, తిలక్ గారి 'కేసరి' పత్రికలో ఎన్నో విశ్లేషణాత్మకమైన వ్యాసాలు రాశారు. నాగ్ పూర్‌లో కూడా విద్యనభ్యసించిన మన మాజీ ప్రధాని శ్రీ పీ.వీ. నర్సింహారావు గారు, జ్ఞానపీఠ పురస్కార గ్రహీత శ్రీ విశ్వనాథ సత్యనారాయణగారి "వేయి పడగలు" నవలను మరాఠీలోకి అనువదించారు. అలాగే "పణ్ లక్షాంత్ ఘేతో కోణ్" అనే మరాఠీ నవలను తెలుగులోకి అనువదించారు. సుప్రసిద్ధ నిర్మాత, దర్శకుడు వీ. శాంతారామ్ గారి పూర్వీకులు తెలుగువారే. మరోవైపు వందకుపైగా పుస్తకాలు రాసిన సుప్రసిద్ధ మరాఠీ రచయిత్రి శ్రీమతి గిరిజాకీర్ గారి పుట్టింటి వారి మూలాలు ఆంధ్రప్రదేశ్ లో ఉన్నాయని, శ్రీ అంబల్ల జనార్దన్ గారి 26 తెలుగు కథల మరాఠీ అనువాద సంపుటి "చిత్ ఆణి పట్" పుస్తకావిష్కరణ సభలో ఆమె స్వయంగా చెప్పారు.

**మరాఠీ వారి తెలుగు సేవ:**

తెలంగాణ ప్రజల గొడవను తన 'గొడవ' గా మార్చుకొని వారి తరఫున వకాల్తా పుచ్చుకొన్న కవి, సామాజిక సైనికుడు, పద్మవిభూషణ్ కాళోజీ నారాయణరావు గారు మరాఠీవారైనా, తెలంగాణలో స్థిరపడ్డారు. అక్కడి ప్రజల హక్కులసాధనకై జీవితాంతం పోరాడారు. తన సాహిత్యంతో తెలుగువారిని అలరించిన శ్రీ కొడవటిగంటి కుటుంబరావు గారి పూర్వీకుల మూలాలు మహారాష్ట్రలో ఉన్నాయని వారి అబ్బాయి కొడవటిగంటి రోహిణీప్రసాద్, ఒక సందర్భంలో చెప్పారు. సుప్రసిద్ధ మరాఠీ నటుడు శ్రీ సయాజీ శిండే తెలుగు నేర్చుకొని, ఎన్నో తెలుగు, మరాఠీ చిత్రాల్లో నటిస్తూ ప్రేక్షకుల మన్ననలను చూరగొంటున్నాడు.

**తెలుగు – మరాఠీ సత్పురుషుల్లోని సామ్యం –**

తెలుగు పోతన, మరాఠీ జ్ఞానదేవ్ రచనల్లో సామ్యం ఉంది. భాగవతం రాసిన పోతనామాత్యులు దయ, క్షమ, శాంతి, సత్యం మొదలగు గుణాలను తన రచనల ద్వారా ప్రసారం చేస్తే, మరాఠీ వాగ్గేయకారుడు జ్ఞానదేవ్ కూడా తన భక్త రచనల ద్వారా అవే గుణాలకు ప్రాచుర్యం కల్పించారు. అలాగే తెలుగు వేమన పద్యాల్లో, భక్త తుకారాం అభంగాల్లో మనకు ఎంతో సామ్యం కనిపిస్తుంది. జనాబాయి అనే మరాఠీ భక్తురాలి రచనల్లోని పోలికలు, తెలుగులో "భావలింగ శతకం" రాసిన దార్ల సుందరమ్మలో చూడొచ్చు. ఇంకోవైపు తెలుగు భక్త రామదాసు (కంచర్ల గోపన్న), మరాఠీ సంత్ దామాజీ వీరి జీవితాలోని ఘట్టాల్లో ఎన్నో పోలికలున్నాయి. రాందాస్ రామభక్తుడైతే, దామాజీ విఠల్ భక్తుడు. అంతే తేడా!

**తెలుగు – మరాఠీ వారిమధ్య వివాహబంధాలుః –**

తెలుగు మరాఠీ భాషీయులమధ్య కొన్ని వివాహసంబంధాలు మనం ఇదివరకు చూశాం. తెలుగింటి ఆడపడుచు, ప్రముఖ సామాజసేవిక పద్మవిభూషణ్ శ్రీమతి దుర్గాబాయి, మరాఠీ ఆర్థికవేత్త పద్మవిభూషణ్ చింతామణ్ దేశ్ ముఖ్ గారిని పెళ్ళి చేసుకొని శ్రీమతి దుర్గాబాయి దేశ్ ముఖ్ అయ్యారు. అలాగే ప్రసిద్ధ తెలుగు, ఉర్దూ, మరాఠీ పండితులు, కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత సామల సదాశివ గారి ధర్మపత్ని సులోచన మరాఠీవారు.

**మహారాష్ట్రకు తెలుగు వారి వలసః–**

1665 లో ముంబయి సందర్శించిన జాన్ ఫ్రైయర్ రాసిన " ట్రావెల్స్ ఇన్ ఈస్ట్ ఇండియా అండ్ పర్షియా" అనే పుస్తకంలో మహారాష్ట్రలోని తెలుగువారి గురించిన సమాచారం ఉంది. అలాగే పదిహేడవ శతాబ్దంలో శ్రీ ఛత్రపతి శివాజీ మహారాజ్ గారు గోల్కొండపై దండెత్తినప్పుడు, ఆయన సైన్యంలో తెలుగువారు చేరారనీ, వారి తిరుగుప్రయాణంలో మహారాష్ట్ర వచ్చి పుణే, అహమ్మ ద్ నగర్, సంగంనేర్ మొదలైన ప్రాంతాల్లో స్థిరపడ్డారని చరిత్ర చెబుతోంది. ఈ వివరాలను బట్టి పదిహేడవ శతాబ్దంనుంచి తెలుగువారు మహారాష్ట్రలో ఉన్నారని స్పష్టమౌతోంది.

**ముంబయి అభివృద్ధికై తెలుగువారి చేయూతః**

1672 సంవత్సరంలో ఈస్ట్ ఇండియా కంపెనీ ముంబయిలో పరిశ్రమలు స్థాపించ నిర్ణయించడంతో, భవనాల నిర్మాణానికి అవసరమైన కార్మికులు అంటే ఉప్పరి, కమ్మరి, వడ్రంగి మొదలగువారూ, ఇతర పనివారైన వంటవారు, మంగలివారు, దర్జీలు, చెప్పులుకుట్టేవారు మొదలైన వారు కూడా కావాల్సి వచ్చింది. అలాంటివారిని ఇతర చోట్లనుంచి రప్పించే ప్రయత్నం బ్రిటీషువారు చేయగా, అప్పటి నిజాం రాజు పాలనలో రజాకార్ల వల్ల అష్టకష్టాలు పడుతున్న తెలంగాణ వాసులు, ఆ అవకాశాన్ని నాలుగు చేతులా అందిపుచ్చుకున్నారు. ఎన్నో కట్టడాలు, కార్యాలయ భవనాలు, మిల్లులు, నివాసస్థానాలు నిర్మించే క్రమంలో తెలుగువారు ముంబయి అభివృద్ధిని వేగవంతంచేశారు. తమ నిజాయితీ, నైపుణ్యతతో తమకు ఉపాధి కల్పించిన వారిని ఆకట్టుకున్నారు.

తెలుగువారు, అక్షరాలా ముంబయి నిర్మాతలుః

పందొమ్మిదవ శతకంలో ముంబయిలో ఎన్నో చారిత్రక కట్టడాల నిర్మాణం జరిగింది. ఆ నిర్మాణాలకు రాళ్ళెత్తిన కూలీలే కాదు, వాటి నిర్మాణసారథులు కూడా తెలుగువారు కావడం గమనించ దగ్గది.

**తెలుగు గుత్తేదారు శ్రీ వెంకూ బాలూ గారు కట్టిన ముంబయి మునిసిపల్ కార్పొరేషన్ భవనం.**



శ్రీ నాగూ సాయాజీ గారు కట్టిన ముంబయి హైకోర్ట్ భవనం



శ్రీ నాగూ సాయాజీ గారు కట్టిన ముంబయి విశ్వవిద్యాలయం భవనం



శ్రీ విఠ్ఠల్ సాయన్న గారు కట్టిన ముంబయి జనరల్ పోస్ట్ ఆఫీస్ భవనం



శ్రీ రాజూ బాబాజీ లామ్ గే మరియు శ్రీ నానా రాజూ బాబాజీ నిర్మించిన టైమ్స్ ఆఫ్ ఇండియా భవనం – ముంబయి.



శ్రీ విఠ్ఠల్ సాయన్న గారు కట్టిన ముంబయి మ్యూజియం భవనం



శ్రీ విఠ్ఠల్ సాయన్న గారు కట్టిన కావస్ జీ జహాంగీర్ హాల్ – ముంబయి



శ్రీ జాయా కారాడీ లింగూ గారు కట్టిన డేవిడ్ ససూన్ భవనం-ముంబయి



శ్రీ జాయా కారాడీ లింగూ గారు కట్టిన వాట్సన్ హోటెల్ భవనం-ముంబయి



శ్రీ జాయా కారాడీ లింగూ గారు కట్టిన టాటా మాన్షన్ భవనం-ముంబయి



**శ్రీ మానాజీ రాజూజీ కాలేవార్ గారు కట్టిన స్టాండర్డ్ ఛార్టర్డ్ బ్యాంక్ భవనం – ముంబయి**



ఈ భవనాలే కాదు, సెక్రెటేరియట్ భవనం, కొలాబా రైల్వేస్టేషన్, మొదలగు కట్టడాల్లో కూడా తెలుగువారి చెమటచుక్కలు ఇంకాయి. అంతే కాదు, ముంబయిలో ఎన్నో మిల్లులు, కర్మాగారాలు, కార్యాలయాలు, నివాస భవనాలు, రోడ్లు, వంతెనలు నిర్మించడంలో తెలుగువారు క్రియాశీలక పాత్ర పోషించారు.

**ముంబయిలో బట్టల మిల్లుల అభివృద్ధిః–**

1854 సంవత్సరంలో ముంబయిలో మొదటి బట్టల మిల్లు, 'బోంబే స్పిన్నింగ్ అండ్ వీవింగ్ కంపెనీ' ప్రారంభమైంది. దాని తర్వాత ఎన్నో మిల్లులు తెరువబడ్డాయి. బట్టలు నేయడంలో నిపుణులైన పద్మశాలీయులకు సహజంగానే ఆ మిల్లుల్లో ఉపాధి లభించింది. ముంబయిలో గూళ్ళు నిర్మించేందుకు చేయూతనిచ్చిన తెలుగువారు, మహారాష్ట్రవాసులకు గుడ్డలు సమకూర్చడానికి కూడా తమవంతు సహకారం అందించారు. దాని అర్థం ఏమంటే మహారాష్ట్ర తమకు కూడునిచ్చినందుకు బదులుగా తెలుగువారు మహారాష్ట్రకు గూడు, గుడ్డ ఇచ్చారు!

**తెలుగువారి సమాజ సేవః–**

తెలుగురాష్టం నుంచి మహారాష్ట్రకు వలస వచ్చిన తెలుగువారు, ఇక్కడి సమాజంతో మమేకమయ్యారు. వారి కష్టనష్టాల్లో పాలుపంచుకున్నారు. బీదవారిపట్ల ఉన్నత కులాలవారి వివక్షను ఎదిరించడానికి, మహాత్మ జ్యోతీరావ్

పులే గారు 24 సెప్టెంబర్, 1873 న "సత్య శోధక్ సమాజ్" సంస్థను స్థాపించారు. ఆ సంస్థకు సర్వశ్రీ రామయ్య వెంకయ్య అయ్యవారు, వెంకూ బాలాజీ కాలేవార్, నర్సింగ్ రావ్ వడ్నాల, జాయా ఎల్లప్ప లింగూ, మానాజీ రాజూజీ కాలేవార్, మొదలగు తెలుగు గుత్తేదార్లు, ఆ సంస్థలో సభ్యులవడమే గాకుండా, సంస్థ కార్యకలపాల నిర్వహణకై ఆర్థికంగా కూడా సహాయ పడ్డారు. వారి వార్తాపత్రికకు ముద్రాణలయాన్నిచ్చారు. ఎంతో ఖర్చు భరించి శ్రీ పులే గారిని ముంబయి రప్పించి, "సత్య శోధక్ సమాజ్" సంస్థ ఆశయాలపై, వాటిసాధనకైఎన్నో ఉపన్యాసాలిప్పించారు.

బడుగు వర్గాల ఉద్ధరణకై, రాజర్షి శాహూ మహారాజ్ గారి అధ్యక్షతన తేది 10-11-1918 న లోయర్ పరేల్, ముంబయిలో జరిగిన సభలో శ్రీ మానాజీ రాజూజీ కాలేవార్ గారు పాల్గొని "పీపుల్స్ యూనియన్" స్థాపనకు నాయకత్వం వహించారు. దాని ద్వారా బీదవారి అభ్యున్నతికై తోడ్పడ్డారు.

**డా. బాబాసాహేబ్ అంబేద్కర్ గారికి తెలుగువారి సహాయం –**

1921 సంవత్సరంలో రావ్ బహద్దూర్ సీ.కే. బోలే గారు డా. బాబాసాహేబ్ అంబేద్కర్ గారిని,శ్రీ శంకర్ రావ్ పర్షా గారికి పరిచయం చేశారు. అప్పుడు ఒక సొలిసిటర్ కంపెనీలో మానేజర్ గా ఉన్న పర్షా గారు తన పరపతితో, డా. అంబేద్కర్ గారికి ఎన్నో వ్యాజ్యాలు ఇప్పించారు. అలాగే డా. అంబేద్కర్ గారికి 1928 లో, కామాఠీపురంలోని తన సొంత స్థలాన్ని 'భారత్ భూషణ్ ప్రింటింగ్ ప్రెస్' ద్వారా 'జనతా పత్ర' అనే పత్రిక నడపడానికి ఇచ్చారు. బోర్డింగ్ హౌస్ స్థాపనకు కూడా డా. అంబేద్కర్ గారికి, శ్రీ శంకర్ రావ్ పర్షా గారితోపాటు, తెలుగు ప్రముఖులు సర్వశ్రీ నాగ్ నాథ్ సాయాజీ నాగూజీ, లక్ష్మణ్ రావ్ కారాడీ జాయా, వీ.ఎస్. అలకొండ ప్రభృతులు ఆర్థిక సహాయం చేశారు. డా. అంబేద్కర్ గారు స్వయంగా, తేది 02-10-1930 న దామోదర్ హాల్లో జరిగిన ఒక సభలో శ్రీ శంకర్ రావ్ పర్షా గారికి కృతజ్ఞతలు తెలిపారు. డా. అంబేద్కర్ గారు ధర్మాంతరం చేసిన సందర్భంలో, వారిని శ్రీ శంకర్ రావ్ పర్షాగారు, మహాత్మా గాంధీ గారి దగ్గరకు తీసుకువెళ్ళారు.

**మహారాష్ట్ర రాజకీయాల్లో తెలుగువారు – ముంబయి మునిసిపల్ కార్పొరేషన్;–**

ఉదరపోషణకై మహారాష్ట్ర వచ్చిన తెలుగువారు కాలక్రమంగా ఇక్కడే

స్థిరపడి, స్థానికుల కష్టనష్టాల్లో పలుపంచుకున్నారు. సర్వశ్రీ జాయా కారాడీ లింగూ, రావ్ బహద్దూర్ ఎల్లప్ప బాళారాం, మానాజీ రాజూజీ, శంకర్ రావ్ సంభాజీ గాంగ్లా, సయాజీరావ్ శీలం(మహారాష్ట్ర శాసనసభ మొట్టమొదటి సభాపతి), శంకర్ రావ్ పుప్పాల, నర్సింగ్ రావ్ పుప్పాల(మేయర్), పరశురాం పుప్పాల, డా. బాళకృష్ణ నయన్, యెల్లప్ప లింగయ్య బిజ్జ, నారాయణ్ రావ్ బుచ్చన్న, నారాయణ్ రావ్ గంజి, బాలకృష్ణ ఖంద్రే, లింగన్న పూజారి, నారాయణ పూజారి, మద్దికుంట దశరథ్, ఇంజమూరి భూమన్న, మొదలగు తెలుగు ప్రముఖులు ముంబయి మునిసిపల్ కార్పొరేషన్‌లో కార్పొరేటర్లుగా ఎన్నికై తెలుగువారికే కాకుండా, తమ నియోజకవర్గ ప్రజలందరికీ సేవలందించారు. ఇటీవలి కాలంలో అనూష రమేశ్ వల్పదాసి గారు, శ్రీమతి కృష్ణవేణి రెడ్డి గారు మునిసిపల్ కార్పొరేషన్ ఆఫ్ గ్రేటర్ ముంబయిలో కార్పొరేటర్లుగా సేవలందించారు.

**మహారాష్ట్ర రాజకీయాల్లో తెలుగువారు – ఇతర మునిసిపల్ కార్పొరేషన్లుః–**

భివండీ, సోలాపూర్, పుణే, అహమద్ నగర్, సంగంనేర్, నాందేడ్, జాల్నా, చంద్రపూర్ మొదలైన మునిసిపల్ కార్పొరేషన్లలో ఎందరో తెలుగువారు కార్పొరేటర్లుగా ఎన్నికవుతూ స్థానిక ప్రజలకు సేవలందించారు, అందిస్తున్నారు. సోలాపూర్ మునిసిపల్ కార్పొరేషన్ మొట్టమొదటి మేయర్, తెలుగువారైన శ్రీ ఈరప్ప బొల్లి గారు సోలాపూర్ పట్టణాభివృద్ధికి ఎంతో కృషి చేశారు.

**మహారాష్ట్ర రాజకీయాల్లో తెలుగువారు – మహారాష్ట్ర శాసనసభ**

తేది 01.05.1960 న మహారాష్ట్ర రాష్ట్రంగా ఏర్పడ్డ తర్వాత, ప్రప్రథమ సభాపతిగా శ్రీ సయాజీరావ్ శీలం గారు ఎన్నుకోబడ్డారు. ఆయన చొరవతో శాసనసభా వ్యవహారాల్లో మరాఠీ భాషను వాడడానికి, 'పదనామకోశం' మరియు 'ప్రశాసన్ వాక్య ప్రయోగ్' గ్రంథాల నిర్మాణం జరిగింది. దానివల్ల మహారాష్ట్ర ప్రభుత్వ వ్యవహారాలు మరాఠీలోనే సాగడానికి మార్గం సుగమమైంది. అలా ఓ తెలుగు వ్యక్తి, మహారాష్ట్ర పరిపాలన మరాఠీలో జరగడానికి పూనుకున్నారు. శ్రీ శీలంగారు తర్వాత పాండిచెరి గవర్నర్ గా కూడా చేశారు. ఆ తర్వాత శ్రీ రామకృష్ణ బేత్ గారు మహారాష్ట్ర శాసనసభ ఉపసభాపతిగా సేవలందించారు. సర్వశ్రీ నర్సయ్య ఆడం, కైలాస్ గోరంట్యాల్, సుధీర్ మునగంటివార్, ప్రభృతులు యం.యల్.ఏ. లుగా సేవలందించారు. శ్రీ సుధీర్ మునగంటివార్ ప్రస్తుతం మహారాష్ట్ర రాష్ట్ర ప్రభుత్వంలో కాబినెట్ మంత్రిగా ఉన్నారు.

**మహారాష్ట్ర రాజకీయాల్లో తెలుగువారు – పార్లమెంట్**

సర్వశ్రీ విలాస్ ముత్తెంవార్, గంగాధర్ కూచన్, ధర్మన్న సాదుల్, చింతామణ్ వంగ మున్నగువారు పార్లమెంటుకు ఎన్నికై, కొందరు కేంద్ర మంత్రులుగా కూడా సేవలందించారు. మన మాజీ ప్రధాని శ్రీ పీ.వీ. నర్సింహారావు గారు కొన్నిసార్లు మహారాష్ట్రలోని రాంటెక్ స్థానం నుండి పార్లమెంటుకు ఎన్నికయ్యారు. వివిధ ఎన్నికల్లో తెలుగువారు గెలిచి పదవులు చేపట్టడాన్ని బట్టి చూస్తే, తెలుగువారు స్థానిక ప్రజలతో ఎంత మమేకమయ్యారో తెలుస్తోంది.

**సంయుక్త మహారాష్ట్ర ఉద్యమం – తెలుగువారు:–**

దేశ స్వాతంత్ర్య పోరాటంలోని, 'క్విట్ ఇండియా' ఉద్యమంలో శ్రీ దశరథ్ రాయిపెల్లి లాంటి తెలుగువారు చురుకుగా పాల్గొంటే, 'ముంబయితోసహా మహారాష్ట్ర రాష్ట్రం ఏర్పాటు చేయాలనే' డిమాండ్‌తో జరిగిన సంయుక్త మహారాష్ట్ర ఉద్యమంలో మేయర్ శ్రీ నర్సింగ్ రావ్ పుప్పాల, కార్పొరేటర్ శ్రీ పరశురాం పుప్పాల గార్లు క్రియాశీలక పాత్ర పోషించారు. అప్పుడు కాంగ్రెస్ ఆధిక్యంగా ఉన్న ముంబయి మునిసిపల్ కార్పొరేషన్లో, మరాఠీ – గుజరాతీ ద్విభాషిక రాజ్యాల ఏర్పాటుకు సుముఖంగా తీర్మాణం చేయాలనే కాంగ్రెస్ అధిష్ఠానం ఆదేశం, కొందరు కాంగ్రెస్ కార్పొరేటర్లకు నచ్చలేదు. అప్పుడు మేయర్‌గా ఉన్న తెలుగువారైన శ్రీ నర్సింగ్ రావ్ పుప్పాల గారి నిష్పక్షపాత వైఖరి, కార్పొరేటర్ శ్రీ పరశురాం పుప్పాల గార్ల చొరవతో, 'ముంబయితోసహా మహారాష్ట్ర రాష్ట్రం ఏర్పాటు చేయాలనే' తీర్మానం, తేది 22.12.1955 న జరిగిన ముంబయి మునిసిపల్ కార్పొరేషన్ సభలో ఏకగ్రీవంగా ఆమోదించబడింది. ఇరవైముగ్గురు కాంగ్రెస్ కార్పొరేటర్లు, వారి పార్టీ ఆదేశాలను ధిక్కరించి, స్థానికప్రజల ఆకాంక్షలననుసరించి, తీర్మాణానికి అనుకూలంగా ఓటు వేశారు. అలా కాంగ్రెస్ ఆధిక్యంగాఉన్న ముంబయి మునిసిపల్ కార్పొరేషన్లో, కాంగ్రెస్ పెద్దల అభీష్టానికి విరుద్ధంగా, తీర్మాణం ఏకగ్రీవంగా ఆమోదింపబడడం ఇద్దరు తెలుగువాళ్ళ వల్లనే సాధ్యపడిందని, దానివల్ల మహారాష్ట్ర రాష్ట్ర ఏర్పాటుకు తోడ్పడ్డారని, ప్రజలు వారిని కొనియాడారు. తేది 04.06.1969 న శ్రీ పరశురాం పుప్పాల గారు పరమపదించినప్పుడు, మహారాష్ట్ర మంత్రిగా చేసిన డా. టీ.ఆర్.నరవణే అన్నారు, 'ముంబయితోసహా మహారాష్ట్ర రాష్ట్రం' ఏర్పాటులో, ముంబయి

మునిసిపల్ కార్పొరేషన్ సభలో ఆమోదించబడ్డ తీర్మానం కీలకమైనదని భావిస్తే, దానికి కృషిచేసిన ఇతరులను గౌరవిస్తూనే, ఆ తీర్మానం ఆమోదంలో ప్రముఖపాత్ర శ్రీ పరశురాం పుప్పాల గారిదేనని చెప్పవలసి ఉంది. దాన్ని మహారాష్ట్ర ప్రజలే కాదు, మహారాష్ట్ర ప్రభుత్వం కూడా ఎప్పుడూ మరువవద్దు."

**తెలుగువారి మరాఠీ సాహిత్య సేవః–**

సర్వశ్రీ పాల్కురికి సోమనాథుడు, కొమర్రాజు లక్ష్మణరావు, సయాజీరావ్ శీలం, ఆశన్న ఈరబత్తి, వసంత్ పోరెడి, శాంతారాం పార్పిల్లేవార్, డా. లక్ష్మీపతి, డా.వీ.ఆర్.భూసరథ్, డా. అరవింద్ కొర్బా, డా. నాగ్ నాథ్ కొత్తపల్లి, డా. సుమిత కొండబత్తున్ వార్ –తుమ్మే, మొదలైన తెలుగువారు, మరాఠీలో ఎన్నో పుస్తకాలు రాశారు. సోలపూర్ వాస్తవ్యులు డా. లక్ష్మీనారాయణ బొల్లి గారు, 'తెలుగు ఫులాంచా మరాఠీ సుగంధ్' అనే గ్రంథంలో తెలుగు మరాఠీ సంబధాలపై విపులంగా చర్చించారు. శ్రీ కృష్ణదేవరాయలపై వారు రాసిన మరాఠీ పుస్తకం, చాలా జనాదరణ పొందింది. వీరు మరాఠీ నుంచి తెలుగులోకీ, తెలుగునుంచి మరాఠీలోకి ఎన్నో పుస్తకాలను అనువదించారు. శ్రీ భైరి శ్రీనివాస్ గారు మరాఠీలో కథలు, కవితలు, నాటకాలు రాయడమేగాక, శ్రీ అంబల్ల జనార్దన్ గారి 'బొంబాయి కథలు' తెలుగుకథల సంపుటిని, 'చిత్ ఆణి పట్' అనే మరాఠీ అనువాద సంపుటిగా వెలువరించారు.

ఇరవైయవ శతాబ్ద ప్రథమార్ధంలో వెలువడ్డ, 'తెలుగు సమాచార్', 'తెలుగు మిత్ర', 'ఆంధ్ర సేవక్', 'ఆంధ్ర వీర్', 'వంజారా' మొదలగు తెలుగు పత్రికలు మరాఠీ లిపిలో ఉండేవి.

శ్రీ ఈరబత్తి లక్ష్మణరావ్ అనే కళాకారుడు ఎన్నో మరాఠీ నాటకాల్లో నటించి, ప్రేక్షకుల మన్ననలందుకున్నాడు.

**తెలుగు పారిశ్రామికవేత్తలు, ఇతరులుః**

భారతదేశ కుక్కుటపాలన పితామహులు డా. బందా వాసుదేవరావుగారు, పుణేను తన కర్మభూమిగా చేసుకొని,

శ్రీ వేంకటేశ్వర హేచరీస్, వెంకీ ఫుడ్స్ సంస్థల ద్వారా అంతర్జాతీయ ఖ్యాతినార్జించారు. కొన్నివేల స్థానికులకు ఉపాధి కల్పించారు. అలాగే వీ.ఐ.పీ. లోదుస్తుల నిర్మాణసారథి శ్రీ జైపాల్ రెడ్డి గారూ, ఓడరేవుల నిర్మాణ నిపుణులు శ్రీ మేకా పాపారావుగారు, ముంబయిలో స్థిరపడి, తమ సంస్థల ద్వారా

స్థానికులకు ఎన్నో ఉద్యోగాలను సృష్టించడమే గాకుండా, జాతీయసంపదను పెంచుతున్నారు.

ఎందరో తెలుగు గుత్తేదారులు, తెలుగువారి సారథ్యంలో ఉన్న నిర్మాణసంస్థలు, మహారాష్ట్రలో రోడ్లు, వంతెనలు, ఫ్లై ఓవర్లు కడుతూ, మహారాష్ట్రకు తమవంతు సేవలందిస్తున్నారు.

కొందరు తెలుగువారు మహారాష్ట్రలో పాఠశాలలు, కాలేజీలు నడుపుతూ, స్థానిక పిల్లల, యువకుల భవిష్యత్తుకు బంగారు బాట వేస్తున్నారు.

ఎందరో తెలుగు ఐ.ఏ.యస్., ఐ.పీ.యస్. ఆఫీసర్లు, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ నిపుణులు మహారాష్ట్రలో ఉంటూ, తమ జ్ఞానం, నైపుణ్యతతో రాష్ట్ర అభివృద్ధికి తోడ్పడుతున్నారు.

ఇదంతా చూస్తుంటే తెలుగు – మరాఠీ అనుబంధాలు ఎంతగా పెనవేసుకున్నాయో, దేశ ఐక్యతకు అవి ఎంతగా తోడ్పడుతున్నాయో అర్థమౌతోంది.

**ఈ వ్యాసరచనకు ఎంతో తోడ్పడిన గ్రంథాలు:**


* “ముంబయీ చ్యా ఉభార్ణీత్ తెలుగు సమాజాచే యోగ్ దాన్” – రచయిత శ్రీ మనోహర్ కదం
* “తెలుగు ఫులాంచా మరాఠీ సుగంధ్” – రచయిత, డా. లక్ష్మీనారాయణ బొల్లి

# ఆధునికాంధ్ర సాహిత్యయుగకర్త 'గురజాడ': ఆరుద్ర దృక్పథం

ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు
9989628049



గురజాడ వేంకట అప్పారావుగారి జీవితాన్ని, రచనలను ఆరుద్ర తన 'గురజాడ గురుపీఠం' (1985) లోనూ, 'సమగ్ర ఆంధ్ర సాహిత్యం' (11వ సంపుటి) లోనూ, ప్రత్యేకసంచికల్లో, పత్రికల్లో, వివిధపుస్తకాలకు రాసిన 'ముందుమాట'ల్లోనూ ప్రకటించారు. అయితే, వీటన్నింటిలో కంటే, 'గురజాడ గురుపీఠం' గ్రంథంలో గల 20 వ్యాసాల్లోనే ఆరుద్ర విమర్శన దృక్పథం బాగా వ్యక్తమవుతుంది. గురజాడవారి గురించి ఆరుద్ర ఇలా ప్రారంభించారు.

"నిస్సందేహంగా ఆధునికాంధ్ర సాహిత్యజనకుడు శ్రీ గురజాడ అప్పారావు గారే. ఇది నిస్సంకోచంగా చెప్పవచ్చు. నిన్నా, నేడూ, రేపూ ఇది నూటికి నూరుపాళ్ళు నిజం. ఆయన యుగకర్త. శకపురుషుడు. ఆధునిక సాహిత్యంలో అభ్యుదయభావాలు ఆయన వచనంలోనే అంకురించాయి" అని చెప్పి, వాటిని గురజాడవారి కన్యాశుల్కం, ముత్యాల సరములు కవిత్వం, పంజాబీలో ప్రసిద్ధ అభ్యుదయ కవి పూరణ్ సింగ్ (1881-1931)తో గురజాడ వారికున్న పోలికలను విశ్లేషించారు. అలాగే, తెలుగు కవులు తిక్కన, వేమన, విమర్శకులు కట్టమంచి, రమణారెడ్డి తదితరుల భావాలతో కూడా పరిశీలించారు. ''అప్పారావుగారి ప్రతిభ అనన్యమైంది, వ్యుత్పత్తి అపారమైనది. దృక్పథం ఆధునికం, ఆదర్శం అభ్యుదయం, భాష సజీవమైనదైతే భావాలు సంచలనాత్మకమైనవి. ఆనాటి రచయితలు ఆనాటి సమాజానికి

అనుకూలమైన భాషను, అవసరమైన భావనలను పట్టించుకోకుండా, వైవిధ్యంగల సజీవసంఘాన్ని పరిశీలించక, సమకాలిక ఇతివృత్తాలను స్వీకరించక, సనాతనకాల్పనిక కథాంశాలనే కావ్యవస్తువులుగా స్వీకరించడం చూచాక బాధ్యతగల ప్రతిభావంతుడు చేతులు ముడుచుకొని కూర్చోలేడు. అందుకే అప్పారావుగారు కలంపట్టారు. భాషలో సంస్కరణ, భావాల్లో విప్లవం తీసుకొచ్చారు.

> గురజాడ రచనలకంటే, వీరి రచనలపై వచ్చిన విమర్శ, పరిశోధనాత్మక పుటల సంఖ్యే ఎక్కువగా ఉంటుంది.

"భాష విషయంలో తిక్కనను, భావాలలో వేమనను అప్పారావుగారు పోలుతారు. సుదీర్ఘ తులనాత్మక పరిశీలనచేసి చెప్పింది కాకపోవచ్చుగాని, ఆదికాలంలో తిక్కన, మధ్యకాలంలో వేమన, ఆధునిక కాలంలో గురజాడ మహాకవులని శ్రీశ్రీ కరెక్టుగానే చెప్పాడు." (పుట:73) అని గురజాడ అప్పారావుగారి సాహిత్య దృక్పథాన్ని ఆరుద్ర వివరించారు.

డా. సి.నారాయణ రెడ్డి నవ్యకవిత్వానికి 'ఇద్దరు యుగకర్తలు'గా రాయప్రోలు, గురజాడలను భావించినా ముందుగా గురజాడనే పేర్కొన్నారు. కె.వి. రమణారెడ్డి 'మహోదయం'లో సెట్టి ఈశ్వరరావు, శ్రీశ్రీ వంటి వారి రచనలు గురజాడ స్థానాన్ని బహుముఖంగా విశదీకరిస్తున్నాయి. ఈ బాటలోనే చాలామంది విమర్శకులు గురజాడ రచనలు, జీవితాన్ని పరిశోధనాత్మకంగా అంచనా వేయడానికి ప్రయత్నిస్తూనే ఉన్నారు. కొత్తకొత్త విషయాల్ని, కొత్త సమన్వయాల్ని వెలువరిస్తూనే ఉన్నారు. గురజాడ రచనలకంటే, వీరి రచనలపై వచ్చిన విమర్శ, పరిశోధనాత్మక పుటల సంఖ్యే ఎక్కువగా ఉంటుంది. అన్ని ఆలోచనలను కలిగించే దిశగా గురజాడ తన సృజనాత్మక సాహిత్యాన్ని కొనసాగించారు.

గురజాడ వేంకట అప్పారావు చాలామంది తెలుగు నవ్యకవిత్వానికి యుగకర్తగాను, ఆధునిక కవిత్వానికి గురుపాదులు గాను, అభ్యుదయ వైఖరితో సంపూర్ణమైన ప్రగతిశీల దృక్పథాన్ని ప్రదర్శించారని పేర్కొన్నారు. ఏ కవికైనా సరే అతనిచుట్టూ ఒక సమాజం, ఆ సమాజానికొక చరిత్ర, ఆ

చరిత్రకొక పరిణామం ఉంటాయి. సామాజిక, చారిత్రక పరిణామ గమనంలో కవియొక్క సాహిత్యస్థానం నిర్ణయమవుతుంది. కవి ప్రగతిశీలి, ప్రతిభాశాలీ అయితే, ఆ గమనాన్ని ఆతడు మరింత వేగవంతం చేస్తాడు. సామాజిక పరిణామానికి విప్లవపంథాలో వేగం సాధించిన 'మహాకవి గురజాడ అప్పారావు' కవి జీవించిన కాలంనాటి పరిస్థితుల్ని మార్చాలనీ, ప్రజల ఆలోచనల్లో మార్పులు తేవాలనీ వివిధ ప్రక్రియల్లో రచనలు చేశారు. ఇలాంటి భావన మాత్రామే కాకుండా, గురజాడ తన 'దేశభక్తి' గేయంలో అంతర్జాతీయ దృక్పథాన్ని ప్రదర్శించారు. అప్పటికి గ్రాంథికభాష చాలా పటిష్ఠంగా అమలు జరుగుతున్నా, సామాజిక పరివర్తన కోరిన కవి కనుక, ప్రజల వ్యవహారంలో ప్రజలలో సులభంగా వ్యాపించగలిగే నాటక ప్రక్రియను తీసుకొని కన్యాశుల్కం నాటకం రాయడం, సామాజిక సమస్యల్ని నిరసించడం వంటివెన్నో తన రచనల ద్వారా కొనసాగించారు. గురజాడ రచనలను లోతుగా పరిశీలిస్తే తన పేరుప్రఖ్యాతుల కోసం రాసాడనే కంటే, సాంఘికప్రయోజనాన్ని ఉద్దేశించి తన సృజనాత్మక రచనను కొనసాగించారనడం సమంజసంగా ఉంటుంది. కన్యాశుల్కం రాసేనాటికి తెలుగు రచయితగా స్థిరపడి, ఖ్యాతి సాధించాలనే తపన ఏమీ గురజాడలో కనపడలేదని విమర్శకులు వ్యక్తం చేసిన అభిప్రాయం సమంజసమనిపిస్తుంది.(కెవెవరపు వెంకట్రావు, కన్యాశుల్కం – చారిత్రక నేపథ్యం (వ్యా), (సం.) నిర్మలానంద ప్రజాసాహితి, కన్యాశుల్కం ప్రదర్శన శత జయంతి ప్రత్యేక సంచిక–ఆగస్టు, 1992, పు:115.)

గురజాడ రచనలను లోతుగా పరిశీలిస్తే తన పేరుప్రఖ్యాతుల కోసం రాసాడనే కంటే, సాంఘిక ప్రయోజనాన్ని ఉద్దేశించి తన సృజనాత్మక రచనను కొనసాగించారనడం సమంజసంగా ఉంటుంది.

గురజాడ జీవితాన్నీ, రచనల్నీ, ఆరుద్ర విమర్శనాత్మక పరిశోధన కొనసాగించి, తులనాత్మకంగా వస్తువునీ, పాత్రల పరిణామాన్ని విశ్లేషించినా, అంతిమంగా 'ఒక్కొక్క పాత్రలోని సొగసులు చూపించాలంటే ఒక్కొక్క పుస్తకమే వ్రాయాలి. ముఖ్యపాత్రల్ని పరిశీలించి, వాటిపట్ల అప్పారావుగారి ఉద్దేశ్యం, ఫిలాసఫీ, సందేశం ఏమిటో గమనించడమే ప్రస్తుతానికి వీలైనది'

(గురజాడ గురుపీఠం, పు:64) అని అన్నారు. దీన్నిబట్టి చూస్తే, ఆరుద్ర చారిత్రక, తులనాత్మక విమర్శనా పద్ధతుల్ని ఉపయోగించుకొని గురజాడ అప్పారావు రచనల్లో కన్పించే అభ్యుదయ దృక్పథాన్నీ, లక్ష్యాన్నీ, నిరూపించారు. గురజాడ, 'కన్యాశుల్కం' రచన చేయడంలో గానీ, పూర్ణమ్మలో బాల్యవివాహాల సమస్యల్ని కరుణరస ప్రధానం చేయడంలో గానీ, సోషల్ రిఫార్మ్, స్పోకెన్ తెలుగు అనే వాటినే మనసులో పెట్టుకున్నారని స్పష్టంగా ఆరుద్ర పేర్కొన్నారు.

'మేలిమి బంగరు మెలతల్లారా !
కలువల కన్నుల కన్నెల్లారా !
తల్లులగన్నా పిల్లల్లారా !
విన్నారమ్మా ఈ కథను ?''

అంటూ ప్రారంభమయ్యే పూర్ణమ్మ గేయం నాటి బాల్యవివాహాల వల్ల సమిధలైపోయే బాలికల మానసికస్థితిని గురజాడ కరుణరసభరితంగా వర్ణించారు. పెళ్లివయసు వచ్చినా రాకపోయినా ఆనాటి సంప్రదాయం ప్రకారం బాల్యంలోనే వివాహాలు చేసేవారు. మరి కొంతమంది అయితే కన్యాశుల్కానికి ఆశపడి అలా పెళ్ళిళ్ళు చేసేవారు. ఆ విషయాన్ని గురజాడ వారు కూడా తన జీవితంలో ప్రస్తావిస్తూ...

"కాసుకు లోనై తల్లీ తండ్రీ
నెనరూ న్యాయం విడనాడి
పుత్తడి బొమ్మను పూర్ణమ్మను వొక
ముదుసలి మొగుడుకు ముడి వేస్రీ.'' అని వర్ణించారు.

పెళ్లిచేసిన తర్వాత అత్తవారింటికి తీసుకువెళ్లడానికి భర్త వచ్చినప్పుడు ఆమె మాత్రమే కాదు పాఠకుడు కూడా కన్నీళ్లు పెడతాడు.

"చిన్నల నందర కౌగిట చేర్చుకు
కంటను బెట్టెను కన్నీరూ !
అన్నల తమ్ముల నప్పుడు పలికెను
పుత్తడి బొమ్మా పూర్ణమ్మా.''

పూర్ణమ్మ గేయం గురజాడవారి కరుణ రసార్ద్రతకి నిదర్శనంగా నిలుస్తుంది. ఈ గేయంలోనే పూర్ణమ్మ గురించి గురజాడ చెప్తూ...

"నలుగురు కూచుని నవ్వే వేళల

నా పేరొక తరి తలవండి" అంటాడు కవి.

దీని వ్యాఖ్యానిస్తూ ఆరుద్ర "నలుగురు కూర్చుని నవ్వే వేళలోనే కాదు, సాహిత్యాన్ని సీరియస్‌గా చర్చించే సమయాల్లో కూడా అప్పారావుగారి పేరును తలచుకోని వాళ్ళుండరు" అన్నారు.

**మధురవాణి పాత్ర పరిణామం:**

గురజాడ చిత్రించిన వివిధపాత్రల్లో ఎంతో పరిణామాన్ని తీసుకొని రావడానికి గల కారణం అప్పారావు దృక్పథంలో మార్పు రావడమే అని కూడా ఆరుద్ర వ్యాఖ్యానించారు. దీనివల్లనే మొదటి మధురవాణికీ, రెండవ మధురవాణికీ తేడాలున్నాయి. తన రచనల్లోని మంజువాణికీ, సరళకీ చాలా తేడాలు కన్పిస్తూ, రెండవ మధురవాణి పాత్రను అప్పారావు జీవితంలోనుంచే తీసుకొన్నా, మెరుగులు పెట్టడానికి వసంతసేనను తీసుకొని ఉండాల్సిన ఔన్నత్యాన్ని అందుకొన్న ఆదర్శమూర్తిగా తీర్చిదిద్దారన్నారు. గురజాడ రాసిన కొండుభట్టీయం లోని పాత్ర మంజువాణి, 'వసంత సేన' శూద్రకుడు రాసిన మృచ్ఛకటికం లో కథానాయిక వేశ్యపాత్ర. సంస్కర్త హృదయం పెద్ద కథ "స్టూపింగ్ టు రైజ్" అనే ఆంగ్లకథలోని నాయక సరళ. మంజువాణీ, సరళ ఇద్దరూ వేశ్యపాత్రలే! స్వయంగా ఓ వేశ్య ఇంటికి పరిశీలన నిమిత్తం వెళ్ళిన అప్పారావుగారితో, 'వేశ్యకు మాత్రం నీతిలేదనుకున్నారా?' అన్నదనీ, ఆ మాటకి ఆనందించి మధురవాణి పాత్రను పోషించడానికి ప్రయత్నించానని చెప్పుకోవడాన్నీ ఆరుద్ర పేర్కొన్నారు. వీటన్నింటినీ ఆరుద్ర తన పరిశోధనలో తెలుసుకున్నప్పటికీ, ఆరుద్ర దృక్పథం విషయంలో ఇక్కడ లోతుగా చర్చించుకోవడం అవసరం. వేశ్యలకు సమాజంలో ఉండే గౌరవమర్యాదల్ని చూసినపుడు, వాళ్ళకి ఎంతో చులకన భావం ఉండటం గమనించాలి. వేశ్య సమస్యకి గల చరిత్ర, సామాజిక కారణాల్ని అన్వేషించాలనీ, అప్పుడు ఆ సమస్యే తలెత్తదనీ, అంతవరకూ, ఆ సమస్యపై చులకనభావాలు తప్పించుకోవడానికే అప్పారావు 'కన్యాశుల్కం'లో ప్రయత్నించారన్నారని ఆరుద్ర అభిప్రాయపడ్డారు.

గురజాడ జీవిత రచనాతత్త్వాన్ని వ్యాఖ్యానిస్తూ ఆరుద్ర, నైతిక ప్రయోజనం సిద్ధించినా వీరిలో సంస్కరణాభిలాష కన్నా సాహిత్యశిల్పం కొన్ని కొంటె పనులు చేయించింది. ఇంత మారాడనుకున్న లుబ్ధావధాన్లులో పాతవాసనలు పోలేదని చూపించడమే వారి చాకచక్యానికి నిదర్శనం... విశ్వప్రేమ అనేది అభ్యుదయ కవిత్వంలోని అంతర్జాతీయ దృక్పథాన్ని స్ఫురింపజేసే అంశం. అంతేకాకుండా, సమగ్ర ఆంధ్ర సాహిత్యంలో గురజాడ రచించిన దేశభక్తి గేయం గురించి వివరిస్తూ, కె.వి. రమణారెడ్డి అభిప్రాయాన్నే ఆరుద్ర స్థిరపరిచారు.(సమగ్ర ఆంధ్ర సాహిత్యం (11 వ సంపుటి) పు.ము, పు: 225,226) ఆ అభిప్రాయం ప్రకారం 'భౌతికసంపత్తి, కళావిలసనం, వ్యాపార వాణిజ్యాల ఇతోధికాభివృద్ధి, ప్రగతి దృష్టి, సార్వత్రిక శాంతి, పరస్పర సహాయ సహకార వైఖరి, జాతులమైత్రి, మతాల ఒద్దిక, సమాజంలోని అడ్డుగోడలనుకున్న వాటిని కూల్చి ఆటంకాలను రద్దుచేసి దేశమంతటా ఒకే ఆర్థికవిధానాన్ని అమలుపరచి, స్వదేశీపరిశ్రమలు పెంపొందించుకొని, ఇతరజాతులతో వర్తకవాణిజ్యాలు సాగిస్తూ దేశాల నడుమ గల వైమనస్యాలను తొలగించి ప్రపంచమంతటా ఏకైకమైన ఆర్థికవ్యవస్థను ఏర్పాటుచేసుకోవాలని కోరుతున్న మధ్యమ వర్గ భావజాలమే ఈ గీతంలో అడుగుడుగునా కన్పిస్తుంది.

'దేశమును ప్రేమించుమన్నా
మంచి యన్నది పెంచుమన్నా
వొట్టి మాటలు కట్టిపెట్టోయ్
గట్టి మేల్ తలపెట్టవోయ్'

తొలి చరణంలోని దేశాన్ని ప్రేమించడం అనేది మాటలతో కాదు చేతలతో ఉండాలి అనేది గురజాడగారి బలమైన అభిప్రాయం. ఆ తరువాత నిజమైన దేశమంటే ఏమిటో, దేశభక్తి అంటే ఏమిటో నిర్వచించాడు.

"సొంత లాభం కొంత మానుకు
పొరుగువానికి తోడుపడవోయ్
దేశమంటే మట్టి కాదోయ్
దేశమంటే మనుషులోయ్"

ఈ భావనే మానవత్వానికి కేంద్రబిందువైంది. ఈ భావన ఈ గేయాన్ని అంతర్జాతీయ స్థాయికి తీసుకువెళ్లింది. అంతేకాదు...

"పరుల కలిమికి పొర్లి" ఏడ్వగూడదన్నప్పుడు కలిమిలేములు అసమానతలు ఉన్నవి ఉన్నట్లుగానే కొనసాగడం అటుంచి, వ్యక్తి ఆస్తిభద్రతకు ఆస్కారం ఏర్పడుతుందన్నారు. అప్పారావు మానవతావాదం ఆ కాలానికి అభ్యుదయకరమే అయితే, దేశభక్తి గేయంలో అభ్యుదయ భావాలున్నా, ఆంధ్రరాష్ట్రంలో మాత్రం అభ్యుదయ రచయితల సంఘం, 1943 కి గాని ఒక రూపానికి రాలేదు. పోనీ, అప్పటికే భారతదేశంలో ఆ భావజాలం, ఆ పేరుతో కొనసాగుతుందనీ చెప్పడానికి వీలులేదు. కానీ, 1935 నాటికే కవులు మార్క్సిస్టు దృక్పథంలో ప్రభావితులై రచనలు కొనసాగిస్తున్నారు. 1935 లోనే భారతదేశంలో 'అఖిల భారత అభ్యుదయ రచయితల సంఘం' రూపుదిద్దుకొంది. శ్రీశ్రీ 'మహాప్రస్థానం' రాసే నాటికి కూడా మార్క్సిస్టు దృక్పథంతో రాయబడుతున్న రచనలకి కూడా 'అభ్యుదయ సాహిత్యం' అనే పేరు రూఢికాలేదు. 1940 తర్వాత మహాప్రస్థానం గేయం ప్రచురణ పొందిన తర్వాతనే అభ్యుదయ కవిత్వమనే పేరు వ్యాప్తిలోకి వచ్చింది. (సి. నారాయణ రెడ్డి, ఆధునికాంధ్ర కవిత్వము–సంప్రదాయములు: ప్రయోగములు, పు:586.)

అయినప్పటికీ, కందుకూరి, గురజాడవంటి వారిని 'ఆంధ్ర అభ్యుదయ రచయితలు' ఆదర్శంగా స్వీకరించి, వారి భావజాలాన్ని ప్రచారం చేయడంలో అభ్యుదయ దృక్పథమే కారణమనేది గమనించవలసి ఉంది. ఈ దృక్కోణంతో పరిశీలించినప్పుడు, 'దేశభక్తి' గేయంలోని విశ్వజనీన ప్రేమను ఆరుద్ర సమర్థించి, మార్క్సిస్టు విమర్శనాదృక్పథాన్నే ప్రదర్శించారని తెలుస్తుంది. ఈ దేశభక్తి గేయాన్ని శ్రీశ్రీ సమస్త ప్రపంచ మహాజనుల జాతీయగీతంగా ప్రశంసించారు. (శ్రీ.శ్రీ, మన గురజాడ, పు:60.) ప్రాంతపుటెల్లలను, దేశసీమలను, జలధులను దాటిన విశాలదృష్టి ప్రదర్శించి, అంతర్వాహినిగా విశ్వప్రేమను ఈ గేయంలో ప్రకటించారని గురజాడ గురించి సినారె అన్నారు. (ఆధునికాంధ్ర కవిత్వము–సంప్రదాయములు: ప్రయోగములు, పు:246.)

రచనకుండే గుణం సమాజాన్ని ప్రగతిశీలంగా ముందుకి నడిపించేటట్లు రూపొందినదయ్యేటట్లు, సామాజిక మార్పులకు సాధనంగా ఉపయో పడేటట్లు, సృజన జరగడమే కాకుండా, చరిత్రగతిని ముందే నిర్ణయించే స్వభావం మార్క్సిజంలో ఉండటం వల్ల, ఆరుద్ర మార్క్సిస్టు దృక్పథంతో విమర్శానాత్మక పరిశోధన కొనసాగించి, తన పరిశోధనలో శాస్త్రీయ దృక్పథానికి మార్గాల్ని తెరిచారు. నిజానికి గురజాడ మార్క్సిజం చదవలేదు. ఆయన ఆలోచనల్లో వర్గసంఘర్షణ చోటు చేసుకోలేదు. అయినా, ఆయన రచనల్లో ఒక ముఖ్యమైన

మార్క్సిస్టు లక్షణం వుందని కొంతమంది (మరువాడ రాజేశ్వర రావు, గురజాడ మార్క్సిస్టు దృష్టి (వ్యా), ప్రజాసాహితి – ఆగస్టు –1992, పు:136.) విమర్శకులు పేర్కొనడాన్ని బట్టి కూడా ఆరుద్ర, గురజాడవారి రచనల్ని మార్క్సిస్టు దృక్పథంతో పరిశీలించడమే శాస్త్రీయమైనదని భావించారు. సిద్ధాంతం అనేది కొంతమంది తెలిసి రాయవచ్చు, మరి కొంతమంది తెలియకుండా కూడా తమ జీవితానుభవాలనుండి రాయవచ్చు. జీవితాలనుండి సిద్ధాంతాలు వస్తాయి. గురజాడ రచనలలో జీవితం ఉంది. ఆ జీవితాలనుండి అనేక సిద్ధాంతాలు చేయవచ్చు. ఆరుద్ర, అంతకుముందు తర్వాత మరికొంతమంది కూడా అలాగే గురజాడలోని మార్క్సిస్టు భావాలను సమన్వయిస్తున్నారు.

**గురజాడపై పింగళి సూరన , వేమన ప్రభావం:**

పింగళి సూరన, కళాసిద్ధాంతాల్ని, వేమన సామాజిక స్పృహను ఆకళింపు చేసుకొని జాతిని మేల్కొలిపిన కవిగా గురజాడను అంచనా వేసారు. పింగళిసూరన లక్షణ గ్రంథం కాకుండా 'కళాపూర్ణోదయం' కావ్యం రాసినా, స్వతంత్ర కల్పనతో సృజనాత్మక కళను ఎలా ప్రదర్శించవచ్చో నిరూపించడం, ఆ కాల్పనిక జగత్తు స్థానంలో సమకాలీన సమాజ స్వరూపాన్ని తన ప్రతిభావిశేషాలతో ప్రతిఫలింపజేయవచ్చుననేది గ్రహించి ఉంటారనేది వీరి అభిప్రాయం కావచ్చు. గురజాడ చేసిన స్వతంత్ర రచనల్లో సామాజిక స్పృహను నిక్షిప్తం చేయడంలో సూరన కళాసిద్ధాంతాల్ని, వేమన స్పృహనీ ఆకళింపు చేసుకున్నాడనే ఆరుద్ర పరిశీలన లోతైనది. గురజాడకంటే ముందుగా, కాలమాన పరిస్థితుల దృష్ట్యా చూసినా తెలుగు సాహిత్యంలో సామాజిక స్పృహగల కవులు వేమన, కందుకూరి, గురజాడలు కన్పిస్తున్నా, వేమన సంస్కరణవాదిగా (మనవేమన. పు:397), కందుకూరి వీరేశలింగంలో కన్పించే సంఘసంస్కరణ, సాహిత్యప్రక్రియలను ప్రారంభించడాన్ని గమనించి, ఆధునికాంధ్ర సాహిత్యప్రక్రియలను ప్రారంభించడాన్ని విస్మరించకుండా కందుకూరిని 'ఆధునికాంధ్ర సాహిత్య నిర్మాత' గానూ, గురజాడను 'ఆధునికాంధ్ర సాహిత్య జనకుడు'గానూ పేర్కొన్నా (గు.గు.పీ. పు:111) అభ్యుదయ యుగకర్తగా శ్రీశ్రీని ప్రకటించడం ఆరుద్రకు తెలుగు సాహిత్యంపట్ల గల లోతైన అవగాహన వెల్లడవుతుంది. ఇది కూడా ఆరుద్రకున్న విమర్శనాత్మక పరిశోధనా దృక్పథాన్ని పట్టిచ్చే అంశమవుతుంది. ఆ విధంగా గురజాడలో పింగళి సూరన, వేమనల ప్రభావం కూడా కన్పిస్తుందన్నారు ఆరుద్ర (గు.గు.పీ.పు:106).

**గురజాడ హేతువాదే కాని, నాస్తికులు కాదు:**

గురజాడను విమర్శనాత్మకంగా పరిశీలించడంలో తన పరిశోధనకు ఈ విమర్శను అంతర్భాగంగా చేసుకోవడం వల్ల, చాలా సంయమనంతో చారిత్రక, తులనాత్మక విమర్శనాపద్ధతుల సహకారాన్ని తీసుకొన్నారని తెలుస్తుంది. కానీ, ఎక్కడా మార్క్సిస్టు దృక్పథం అని పేర్కొనలేదు. దీనికో కారణం కూడా కన్పిస్తుంది. 'కన్యాశుల్కం'లో సౌజన్యరావు, మధురవాణికి భగవద్గీతనిస్తాడు. దీన్ని అనుసరించి గురజాడ భగవద్గీతను ఎంత గౌరవిస్తారో తెలుస్తుందన్నారు ఆరుద్ర (గు.గు.పీ.పు:87). అంతేకాకుండా అప్పారావు హేతువాదే కాని, నాస్తికులు కారు. ఆయన భగవద్గీత వైపు మొగ్గుతారు. కళకు ప్రయోజనముందని గుర్తించి, కళకోసమే కళ అన్నవాదాన్ని ఖండించినా, ఆయన కర్మసిద్ధాంతాన్ని పరోక్షంగా అంగీకరిస్తున్నట్లు కనపడుతుందన్నారు (గు.గు.పీ.పు:87) అంతటితోనే ఆగిపోకుండా, అప్పటికి సోషలిజం సిద్ధాంతాలు గురజాడకి పరిచయం కాకపోవచ్చునన్నారు (గు.గు.పీ.పు:87) కె.వి. రమణారెడ్డి ఈ విషయంలో చెప్పిన వ్యాఖ్యానం 'తర్కదృష్టితో కర్మసిద్ధాంతం సత్తాను చూపి మెచ్చడమే గాని, దాన్ని మొత్తంగా తాను ఒప్పేసుకోవడమేమీకాదు' అనే వాదాన్ని ఖండించి, అప్పారావు కర్మసిద్ధాంతాన్నే నమ్ముతున్నారన్నారు ఆరుద్ర (గు.గు.పీ.పు:87). ఈ విషయంలో సోమయాజుల వెంకట రామమూర్తి అభిప్రాయాన్ని చూస్తే, "భగవద్గీతలోని శ్రీకృష్ణ భగవానుని యుపదేశము లక్ష్యము అరిషడ్వర్గాన్ని చంపుకొనేందుకు ప్రయత్నిస్తుంటాడు, సౌజన్యరావు సార్థకనామధేయుడు' అని తెలుస్తుంది. (సోమయాజుల వెంకట రామమూర్తి, (సం.లు) మొదలి నాగభూషణ శర్మ, ఏటుకూరి ప్రసాద్, కన్యాశుల్కం నూరేళ్ల సమాలోచనం, పు:310.) ఇదే సంకలన గ్రంథంలో కేతవరపు రామకోటశాస్త్రి అభిప్రాయం ఇలా ఉంది.(కన్యాశుల్కం –నూరేళ్ళ సమాలోచనం, పు: 393.)

అమానుషంగా పరిణమించిన సాంఘికధర్మం ఇక సాగటానికి వీలులేదని, దాన్ని సమూలంగా మార్చడానికి తోడ్పడుతున్న పుస్తకం గదా ఇది, తనకు తన రచనల మీద ఉన్న పూర్ణవిశ్వాసాన్ని ఎవరు ప్రకటిస్తే బాగా ఉంటుందో అని ఆలోచించి,అందుకు సౌజన్యరావును ఎన్నుకొన్నాడు గనుక, అప్పారావుగారి ప్రతినిధిగా సౌజన్యరావు కూడా మన విశ్వాసం చూరగొంటున్నాడు". ఎస్. గంగప్ప ఇదేవిషయాన్ని మరో కోణం నుండి చూశారు (కన్యాశుల్కం – నూరేళ్ళ సమాలోచనం,

పు:335,336.)“ఈ హాస్యం అవహేళన, చమత్కారయుతము అయినప్పుడు మరింత మనోజ్ఞంగా ఉంటుంది. బంట్రోతు గాయత్రి ప్రమాణం చేసి, “ఇన్నాళ్ళకి జంజంపోగు వినియోగంలోకి వచ్చింది. థియోసోఫిస్టులు చెప్పినట్లు ఓల్డుకస్టమ్స్ అన్నిటికీ యేదో ఒహప్రయోజనం ఆలోచించే మనవాళ్ళు యార్పరచారు. ఆత్మానుభవం అయితేనే గాని తత్త్వం బోధపడదని వ్యాఖ్యానించడంలో సెటైర్ ఉంది’’ అలిగే వేదమంత్రాలను ఎద్దేవా చేసి నవ్వుపుట్టించడం సంప్రదాయంపై దెబ్బతీయడమవుతుంది వంటి వ్యాఖ్యానాల్ని చూస్తే, సౌజన్యరావు, మధురవాణికి భగవద్గీతను ఇవ్వడంలో, గురజాడ లక్ష్యం కొంత స్ఫురించే అవకాశం ఉంది. ‘భగవద్గీత–మార్క్సిస్టు’ గ్రంథంలో ఆర్వీయార్, కర్మ, భక్తి సిద్ధాంతాలను చర్చించి, సమస్యల నుంచి పారిపోయే దారినే భగవద్గీత చూపిస్తుందనీ, శ్రామిక జనవిముక్తి పోరాటాన్ని ముందుకు సాగనివ్వదు అన్నారు. (ఆర్వీయార్, భగవద్గీత –మార్క్సిజం, జులై, 2002, పు:62.)

ఆత్మానుభవం అయితేనే గాని తత్త్వం బోధపడదని వ్యాఖ్యానించడంలో సెటైర్ ఉంది

ఈ అభిప్రాయాన్ని లోతుగా ఆలోచిస్తే, మరి ఏ దృక్పథంతో సౌజన్యరావు చేత మధురవాణికి ‘భగవద్గీత’ను ఇప్పించారనే తాత్త్విక అంశాల పట్ల ఆరుద్ర విమర్శనాత్మక శక్తి తెలుస్తుంది. సౌజన్యరావు ద్వారా గురజాడ సంఘసంస్కరణను అశించారని చాలామంది విమర్శకులు చెప్పారు. గురజాడ పాత్ర పరంగా సౌజన్యరావులో ఉన్నాడన్నవారూ ఉన్నారు. కనుక, ఆరుద్ర ఎంతో సంయమనాన్ని పాటిస్తూ, ఒక ‘విమర్శనాత్మక పరిశోధకుడు’గా రాగద్వేషాలకు అతీతంగా, గురుజాడ రచనల్లో మార్క్సిస్టు ధోరణులు కన్పిస్తున్నా, అప్పారావు హేతువాదే కాని, నాస్తికులు కాదని తన నిర్ణయాన్ని ప్రకటించారు. గురజాడ అప్పారావు సంధ్యావందనం చేస్తూండేవారని లేఖల వల్ల కూడా తెలుస్తుంది. కనుక, గురజాడను అంచనా వేయడంలో ఆరుద్ర ఎన్నో జాగ్రత్తలు తీసుకున్నాడని తెలుస్తుంది. గురజాడను ఆరుద్ర చాలావరకూ చారిత్రక, తులనాత్మక విమర్శనాదృక్పథంతో పరిశీలిస్తూ కవిలో కన్పించే అభ్యుదయ భావజాలాన్ని మార్క్సిస్టు దృక్పథంతోనే పరిశీలించి శాస్త్రీయదృక్పథానికి ప్రాముఖ్యతనిచ్చారు.

**ముత్యాలసరాలు ప్రాచీన సంప్రదాయ కవిత్వానికి, ఆధునిక కవిత్వానికి ఒక వంతెనలా నిలుస్తాయి.**

అయితే, వస్తువు (ఇతివృత్తం) తీసుకోవడంలోను, పాత్ర చిత్రణలోనూ పరిణామాన్ని నిరూపించడంతో మార్క్సిస్టు దృక్పథం కంటే, చారిత్రక, తులనాత్మక కవి జీవిత విమర్శనాదృక్పథమే ప్రధానంగా కన్పిస్తుంది. చారిత్రకవిమర్శలో రచనాకాలం, నాటి పరిస్థితుల ప్రభావం, ఆ అంశాలు రచనలో ఇతివృత్తంగా రూపొందడానికి కవిపై చూపిన ప్రభావం వంటివన్నీ చేరతాయి. తులనాత్మక పరిశీలనలో చారిత్రక పరిణామంతో పాటు, కవికి గల దృక్పథం భిన్నరచనల్లో వ్యక్తమైన తీరు వెల్లడవుతుంది. వీటన్నింటినీ శ్రద్ధగా పరిశీలించ గలిగినప్పుడే, కవిలో కన్పించే దృక్పథం వెల్లడవుతుంది. వివిధ చారిత్రక కారణాల వల్ల, జీవితసంఘర్షణ వల్ల కవి ఏ దృక్పథానికి చెందుతాడో నిర్ణయించడంలో సందిగ్ధంలో పడే పరిస్థితుల్లో విమర్శకుడిలో అంతర్నిహితంగా ఉన్న దృక్పథాన్ని బట్టి ఆ కవిని అంచనా వేస్తాడు. ఈ అంచనాను బట్టే మళ్లీ విమర్శకుడి దృక్పథం కూడా పరిశీలించడం సాధ్యమవుతుంది. ఇదంతా గురజాడ వారిపై చేసిన పరిశోధన, విమర్శలలో ఆరుద్ర ఎంతో స్పష్టంగా వివరించారు. గురజాడవారి 'దిద్దుబాటు' కథ, మరికొన్ని కథలలో గల అభ్యుదయ భావాలు ఆయనను ఆధునిక కవిగా చూపిస్తాయి. ముత్యాలసరాలు ప్రాచీన సంప్రదాయ కవిత్వానికి, ఆధునిక కవిత్వానికి ఒక వంతెనలా నిలుస్తాయి. వాటిలోని భావాలన్నీ ఆధునికం కావడం గుర్తించదగిన విషయం. కన్యక, పూర్ణమ్మ వంటిగేయాలు, కన్యాశుల్కం నాటకం గురజాడవారి స్త్రీ అభ్యుదయ భావాలకు నిదర్శనంగా నిలుస్తాయి. దేశభక్తి గేయం వారి అంతర్జాతీయ దృక్పథాన్ని మానవతా కేంద్రాన్ని తెలియజేస్తుంది. ఆయన ప్రయోగించిన భాష కవిత్వం వరకు గ్రాంథికంతో పాటు జానపద శైలిని ప్రయోగించారు. ఆయన తన వచన రచనలలో ఆధునిక మానవునికి కావలసిన భాషను ఉపయోగించారు. ఇవన్నీ గురజాడను ఆధునిక తెలుగు సాహిత్య యుగకర్తగా చేయడానికి దోహదపడ్డాయనేది ఆరుద్ర గారి ప్రధానమైన సూత్రీకరణ. అంతేకాదు, ఒక లోతైన పరిశోధకుడిగా ఆరుద్ర ఎంతో కృషి చేసారు. గురజాడ అప్పారావుగారి వ్యక్తిత్వాన్ని, సాహిత్యాన్ని విశ్లేషిస్తూ అనేకమంది చెప్పిన అభిప్రాయాలతోను,

ఆయన సృజించిన సాహిత్యంతో ఆధునిక తెలుగు సాహిత్య యుగకర్తగా సమన్వయించి చెప్పారు.

* చింతా దీక్షితులు గారు 1932 లో రాసిన ఒక వ్యాసంలో అప్పారావుగారిని మెచ్చుకొనని వారు అఖిలాంధ్ర కవుల్లో తాను ఎరిగినంతవరకు ఎవరూ లేరని అన్నారు.

* తల్లావజ్ఝల శివశంకర శాస్త్రి గారు 1933లో ఒక వ్యాసంలో 'గురజాడ అప్పారావు రచించిన నీలగిరి పాటలు, పూర్ణమ్మ కథ మొదలైనవి ఆధునిక కవుల పదాలలో మొదటివి. తర్వాత బసవరాజు అప్పారావు చెప్పిన కీర్తనల వల్ల పదకవిత్వానికి ప్రతిష్ఠ హెచ్చినది' అని పేర్కొన్నారు.

* 1935లో ఒక వ్యాసం రాస్తూ ''ఆధునికాంధ్ర కవిత్వానికి గురుపాదులు శ్రీ గురజాడ అప్పారావు గారని అందరి సమ్మతి మీద తేలిన విషయం. ముత్యాలసరం వారి కానుక. కార్మికులూ, వయాకరణలూ, కళ్ళు మూసుకున్న వాళ్ళూ, మడి కట్టుకున్న వాళ్ళూ మొదలైన పరిమిత క్షేత్ర సంసారమును ధిక్కరించి గురజాడ అప్పారావు గారు మొట్టమొదట నవ్యకవితను ఆంధ్రదేశంలో ప్రవేశపెట్టారు'' అని శ్రీ శ్రీ ప్రకటించారు.

* ''తెలుగు ప్రజలందరి స్మృతిపథంలో అప్పారావు సదా జీవిస్తాడు. చనిపోయినప్పటికీ ఆయన జీవిస్తున్నాడు. అతన్ని తలుచుకోవడం అంటే మన జీవితాలలో అత్యంత ఆనందమైన సంఘటనలను మనం స్మరణకు తెచ్చుకొనడమే'' అని గిడుగు రామమూర్తి గారు వ్యాఖ్యానించారు.

గురజాడ వారిపై తెలుగుకవులు, విమర్శకులు, పరిశోధకులు చేసిన వ్యాఖ్యానాలను, విశ్లేషణలను ఒక్కొక్క వాక్యంగా చేర్చినా, అవన్నీ వందల పుటలవుతాయి. తనకు అందుబాటులో ఉన్న ముఖ్యమైన అభిప్రాయాలను ఆరుద్ర 'గురజాడ గురుపీఠం'లో స్వీకరించారు. అందుకే గురజాడపై రమణారెడ్డిగారి మహోదయం వచ్చినప్పటికీ, ఆరుద్రగారి గురజాడ గురుపీఠం ఉత్తమగ్రంథంగా భాసిల్లుతోంది.

# కన్యాశుల్కం : భాషా విశేషాలు

డా. ఎస్.షమీఉల్లా
9441178415




తెలుగు సాహిత్యచరిత్రలో పరిణతి గల్గిన నాటకం కన్యాశుల్కం. నూరేళ్ళు దాటినా వాసి తగ్గని, వన్నె చెదరని నాటకం. తెలుగుజాతి మర్చిపోలేని విశిష్టరచన. కన్యాశుల్కంతో సాటిరాగల మరో నాటకం తెలుగులో లేదంటే అతిశయోక్తి కాదేమో!!

గురజాడ ఆమూలాగ్రం తన ప్రతిభాపాటవాలను ఒక్కచోట చేర్చి, సమకాలీన జీవనసారాన్ని ప్రపంచించిన మొదటి ఆధునిక సాంఘికనాటకం. అందులో వస్తువెంత సాంఘికమో, పాత్రలంత సమకాలీనం. పాత్రలెంత వాస్తవమో, భాష అంత సజీవం. గురజాడ దృష్టిలో భాష లోకోత్తరం. అంటే భాష అందరిదీ. అందరికీ అందుబాటులో ఉండాలని భాషలో కృత్రిమత్వాన్ని నిరాకరించాడు. పలికేభాషకూ, రాసే భాషకూ సాన్నిహిత్యం చేకూర్చి సాహిత్య ప్రయోజనం, సమాజ ప్రయోజనం భాషతోనే ముడిపడి ఉంటుందని నిరూపించాడు. పాఠకుడికి, రచయితకి సాహిత్యభాష స్వభాషే అయినా అది సమకాలీన వాడుక భాష అయ్యుండాలి. కాకపోతే కాలప్రభావం వల్ల అర్ధాలు మారిపోవడానికి అవకాశం ఉంది. అప్పటప్పటి వాడుకలో ఉన్న పదాలు ఉపయోగిస్తే ఉత్తమ సాహిత్యసృష్టికి భాష జీవనాడి కాగలదనే ఎరుక గల అతికొద్దిమంది సాహితీకారులలో గురజాడ ముందువరుసలో ఉంటాడు.

శబ్దానికీ, అర్థానికీ సమానగౌరవం యిచ్చాడు. భాషకూడా సృష్టిలోని ప్రాణిలాగే చైతన్యం నింపుకొని బతుకుతుంటుందని నమ్మాడు. సమాజప్రయోజనం అనే రథానికి భాష, సంస్కరణ రెండు చక్రాల్లాంటివని; ఊహలు, ఆలోచనలు వాయుమార్గంలో ఉన్నా; ఉపయోగం, వినియోగ ప్రజలకు చేరువలో ఉండాలని భావించాడు. కాబట్టే, సమకాలీన సామాజికవర్గాలకు ప్రాతినిధ్యం వహించే ప్రజావాడుక భాష నాటకంలో కన్పిస్తుంది. ఆఖరికి – “బేస్తు, కుదేలు, డైమాను, ఇస్పేటు, ఆలీసు...” వంటి చీట్ల పేక పదాలు మొదలు “ఫైసలవ్వు, కునిష్టి, అరవ చాకిరి, గుంట వెధవ, గోతాలు, రవ్వ, పొంకం, పస్తాయించి, వొంటు, సవబుకి...” వంటి అప్పటప్పటి పదజాలం వరకూ కన్పిస్తాయి.

నాటకంలోని పాత్రలు నిజజీవితానికి ప్రాతినిధ్యం వహిస్తుంటే భాష సుఖదుఃఖాలను ప్రతిబింబిస్తుంటుంది.

అరబ్బీ, పార్సీ, ఉర్దూ పదాలు తారసపడతాయి. “ఖాయిదా, బేహద్బీ, భరవాసా, పూరా, యిలాకా, అమేషా, కామాప్, లాచారి, జుల్మానా, చహరా...” వంటివి విరివిగా ఎదురవుతాయి. ‘కేసు దాఖలు చేయడం, తక్షీర్ మాప్ చేస్తే, సదరదాలత్ మాఫీ చేయడం, ఒక రూపాయి జాఫా, ఎవరికి ఇక్కడికి రావడానికి మగ్దూర్ ఉంది, పదిరోజుల క్రితం వస్తే ఫోక్తు పరుస్తును, ఒక్కటీ తప్పి పోలేదు, లెక్క జరూరుగుందండి, అయితే నాకో ఖరారు చేస్తారా, తలుపవతల ఖణాయించి ఉండగా...” ఇలాంటివి నాటకంలో ఎన్నో!

కోర్టు, కచేరీలకు సంబంధించిన పదజాలంలో ఉర్దూ పదాల వాడకం ఎక్కువగానే ఉంటోంది. మాండలిక భాషాప్రయోగాలలో చేరి మిశ్రమ భాషాపదాలై నాటకానికి కొత్త సోయగాన్ని తెచ్చిపెట్టాయి. చక్కగా కల్సిపోయి వినూత్న అందాన్ని చేకూర్చాయి. నాటకంలోని పాత్రలు నిజజీవితానికి ప్రాతినిధ్యం వహిస్తుంటే భాష సుఖదుఃఖాలను ప్రతిబింబిస్తుంటుంది.

కన్యాశుల్కం వైదీక బ్రాహ్మణకుటుంబాలకు చెందిన కథే అయినా, కేవలం బ్రాహ్మణపాత్రలే కాక ఇతరవర్గాలకు చెందిన పాత్రలు, వారిభాష కనబడుతుంది. వేదభాష శకలాలనే కాదు, పేదలు మాట్లాడుకునే ఒకటి అరా భాషాశకలాలను కూడా ధారాళంగా వాడుకలోకి తెచ్చాడు. “చీటి ముక్క,

పుణికలు, రాందాసోహుడు, సాచ్చీకం, నిమేటికి, వారా, తిపట...'' మొదలైనవి ఉదాహరణగా చెప్పుకోవచ్చు.

గురజాడ భ్రమల్లో బ్రతికేవాడు కాదు. గురజాడ భాషాదార్శనికత అపూర్వమైనది.

గురజాడ ప్రజలతో, సమాజంలో సాన్నిహిత్య సంబంధమున్నవాడు. సంబంధాలు పెంచుకున్నవాడు. పరిశీలకుడిగా, కార్యవాదిగా, తాత్త్వికుడిగా జీవితాన్ని నిశితంగా, నిష్పాక్షికంగా పరిశీలించాడు. అందువల్లే కన్యాశుల్కంలోని భాష వైశిష్ట్యంగా రూపు దిద్దుకొని విధాయకం కాగల్గింది.

గిరీశం బుచ్చమ్మతో మాట్లాడినప్పుడు తెలుగుమాటలు తప్ప మరే అన్యభాషాపదాలు కన్పించవు. అదే గిరీశం సౌజన్యరావుతో మాట్లాడినప్పుడు భాషావైఖరిలో మార్పు అగుపిస్తుంది. ఫక్తు చదువుకున్నవాళ్ళ శిష్ట వ్యావహారికంలా సంభాషిస్తాడు. ఇంగ్లీషు మాటలు విరివిగా ఉంటాయి. అదేవిధంగా అగ్నిహోత్రావధానులు, లుబ్ధావధానులు, కరటకశాస్త్రుల సంభాషణల్లో ''పన్నాలు, పనసలు, ఏకోత్రవృద్ధి, ఘనాపాఠీ, సూత ఉవాచ, గాయత్రి, దేవదత్తుల అగ్ఘురారం...'' వంటి వైదిక పారిభాషిక పద ప్రయోగాలుంటాయి. ఎక్కువగా అనే అర్థంతో ''ఋణబాధ చాలా లావుగా ఉందండి'' అంటాడు కరటకశాస్త్రి. చులకన చేయడం అనే అర్థంతో రామప్పంతులు తనని ''ఆనాడి' చేస్తున్నారంటాడు. కాజేయడమనే అర్థంతో మధురవాణి ''చెపాయిస్తే నా గతేమిటి?'' అంటుంది. గురజాడ వివిధ శాస్త్ర పాండిత్యం ఆధారంగా విలక్షణ పదప్రయోగాలు కూడా చాలానే చేశాడు. ముఖ్యంగా 'లంబికా' ప్రయోగం అలాంటిదే! హఠయోగానికి సంబంధించిన యోగాసనం. అలాగే బైరాగి ఈ ఊరిలో ''సదా వృత్తిమఠం'' ఉందా? అంటాడు.

గురజాడ భ్రమల్లో బ్రతికేవాడు కాదు. గురజాడ భాషాదార్శనికత అపూర్వమైనది. ''సంకెళ్ళను ప్రేమించేవాళ్ళు దాన్ని ఆరాధించనీయండి. నాకు కావలసింది నా దేశభాష. సజీవమైన తెలుగు భాష (రెండో కూర్పు – పీఠిక)'' అని అనగల్గినాడంటే భాష విషయంలో గురజాడ ధోరణి ఏమిటో ఇట్టే పసిగట్టవచ్చు. వ్యవహారిక భాష అవసరం గిడుగు, గురజాడ గుర్తించినంతగా సమకాలికులెవ్వరూ గుర్తించలేదని చెప్పవచ్చు. గురజాడ వాడుకభాష

అని తన రచనాశైలిని గూర్చి ప్రత్యేకంగా పేర్కొనకపోయినా ఉద్యమరూపంలో వ్యవహారిక భాషను ఉపయోగించిన విధానం వల్ల తను ఎటువంటి భాషను ఆశించారో భాష వల్ల సమాజానికి ఎదురయ్యే ప్రాసంగికత ఏమిటో ఇట్టే అర్థమౌతుంది. గిడుగుకంటే ముందే గురజాడలో భాష పట్ల ఒక సామాజిక దృక్పథం ఉందని తెలుస్తుంది.

**కన్యాశుల్కంలోని వ్యవహారిక భాషావాదం కేవలం భాషారంగానికి పరిమితం కాలేదు.**

కన్యాశుల్కం ఒక సమస్యాత్మక నాటకం. వెనక్కి తిరిగి చూసుకుంటే సంస్కర్తల మేధోవికాస పరిధికి గుర్తుగా సౌజన్యరావు, శిథిలవ్యవస్థకి ప్రతీకలుగా లుబ్ధావధాన్లు, అన్ని అవ్యవస్థల అనుభవాల మధ్య రాటుదేలిన స్త్రీగా మధురవాణి, లోకంలో ఏమీ తెలియని అమాయకులకు ప్రతినిధిగా బుచ్చెమ్మ, పరమార్థాన్ని బయటికి ప్రదర్శిస్తూ స్వార్థానికి ప్రాధాన్యత యిచ్చే వ్యక్తిగా గిరీశం, పాత పాలకవర్గ లౌక్యానికి దాఖలాగా రామప్పంతులు... ఇలా ప్రతి పాత్ర ఏదో ఒక వర్గానికి ప్రాతినిధ్యం వహిస్తూ విస్తరించి వికసించిన నాటకంలో అంతరార్థ విశదీకరణకి సామాజిక వాస్తవికతలోని భావోద్వేగాలను గుర్తించగలిగే సెతస్కోపులా; పునర్వికాశ ప్రాచ్య – పాశ్చాత్య ప్రజాస్వామ్య ఇంటలెక్చువల్ ఎక్విప్మెంట్ కన్యాశుల్క నాటకంలో భాష మాత్రమే – అని చెప్పడం సమంజసమేమో! అది చారిత్రక పరిధిని అధిగమించి సామాజిక జీవితాన్ని చర్చించడానికి, ఆలోచింపచేయడానికి సందర్భం కల్పించింది. రాబోయే సామాజిక భూకంపాల్ని ముందే గుర్తించగలిగే సిస్మోగ్రాఫ్‌లా భాష కాగల్గింది.

కన్యాశుల్కంలోని వ్యవహారిక భాషావాదం కేవలం భాషారంగానికి పరిమితం కాలేదు. అది సామాజికవాదంగా మారి ఉత్తరోత్తర సామాజిక పరిణామాన్ని, అవసరాల్ని, ప్రయోజనాలను విభిన్నకోణాల్లో చూపగల్గింది. తెలుగువాడి ఆలోచనలకి పదును పెట్టగలిగే సంభాషణ అవగలిగింది. మానవులను మేల్కొలిపే రచనగా రూపాంతరమైంది.

గిరీశం దగ్గరనుండి అసిరిగాడు వరకూ... సౌజన్యరావు పంతుల్నుండి బుచ్చెమ్మ, మీనాక్షి దాకా గురజాడ ప్రయోగించిన భాష పాత్రోచితమైందికాదు. ప్రజా ప్రాతినిధ్యమైంది. పాత్రోచితం అంటే ఉచ్చ, నీచభావన చోటు

చేసుకోవడానికి అవకాశం ఉంటుంది. కన్యాశుల్కంలోని భాష అలా కాదు. ఆచారవ్యవహారాలు మొదలు కోర్టుకేసుల వరకూ ఆయాపాత్రల ద్వారా భాషను ప్రాతినిధ్యం చేసి వ్యక్తీకరించారే గాని, అపహాస్యం కోసం భాషను వాడుకోలేదు. భాషను భ్రష్టుపరచనూ లేదు. చిన్నచిన్న పాత్రలద్వారా సంభాషింపచేసినా; ఆ సంభాషణ లోక వృత్త పరిశీలనకు దర్పణం పడుతోంది. ఉదా : లుబ్ధావధాన్లు అసిరిని "వెధవా నువ్వు లోపలికి రాకు" అని కసిరినా; అసిరిగాడు ఆత్మగౌరవంతో "నాను పిలుస్తాస్సినాను" అని అంటాడు.

**కన్యాశుల్కంలో భాషాదృక్పథం ఆధునికం. తిండి, గుడ్డ, నివాసం మీద భాష ఎంత ప్రభావాన్ని చూపుతుందో డేగకళ్ళతో ముందే గుర్తించినవాడు.**

పెళ్ళికూతురు వేషంలో ఉన్న మహేశాన్ని, "ఆ ముండని అవతలుండమను" అన్నప్పుడు; రామప్పంతులు "అడక్కపోతే అమ్మెనా పెడుతుందిరా" అన్నప్పుడు – భాష ద్వారా వారి, వారి సామాజిక నేపథ్యాల్ని పరోక్షంగా విశదపరుస్తాడు. "నాకు బయవేటి? పైడితల్లి చల్లగొండాలి", "ఓలమ్మ! ఎంత బలువుందోస్సి" అని అసిరి ద్వారా చెప్పించడం గురజాడలోని దార్శనికతకు మచ్చు తునకలవి. ఆనాటికి కొత్తగా తోచే "గుంట, బుర్ర, గుంట వెధవ, కొంజి, బుగత... " పదాలు సామాజిక పరిశీలనకు సాక్ష్యాలు. ఇలాంటివి అనేకం.

పదాలే కాదు. కన్యాశుల్కంలోని కొన్ని వాక్యాలు కూడా ప్రత్యేకంగా కన్పిస్తాయి. ప్రధానంగా క్రియను వాడే విధానం... నిషేధార్థాన్నిచ్చే క్రియాప్రయోగాలు – "నీ ఆలోచన యేదో చెప్పావు కాదు", "ఎంతమందిని పంపినా ఇచ్చారు కారటండీ", "నొక్కి అడిగితేగాని చెప్పింది కాదు", అదేవిధంగా "ఆడదాన్ని నన్నా అడుగుతారు?", "వేశ్యనా పెళ్ళాడుతారు?"... కొన్ని మరీ విచిత్ర ప్రయోగాలు కన్పిస్తాయి. అటువంటి వాటిలో – నేను చూడలేదు బాబూ – అనవలసిన చోట "నాకు సూపు లేదు బాబూ" అని అనడం కూడా మనం చూడవచ్చు.

కన్యాశుల్కంలో భాషాదృక్పథం ఆధునికం. తిండి, గుడ్డ, నివాసం మీద భాష ఎంత ప్రభావాన్ని చూపుతుందో డేగకళ్ళతో ముందే గుర్తించినవాడు. సామాజిక వ్యవస్థల్ని ఆంగ్లభాష అప్పటికే ఎలా ప్రభావితం చేసిందో గమనించి

మనల్ని గుర్తింప చేసినవాడు. గురజాడ సమాజాన్ని వస్తుగత దృష్టితో చూసాడు. కాబట్టే, తన కాలాన్ని ప్రాపంచిక దృక్పథంతో విమర్శించి వాస్తవికదృష్టితో విశ్లేషించడం వల్లే కన్యాశుల్కంలోని ఆశయాన్ని, లక్ష్యాన్ని భాషలో సాధించగలిగాడు. పండితులు ఇష్టపడినా, ఇష్టపడకపోయినా ప్రజలకు పరిచయం లేని భాషారూపాలు సృష్టించి హాని తలపెట్టడం కంటే పరిచయమైన ఏ భాషాపదాలైన సరే చేర్చడం మేలని బలంగా నమ్మిన కారణంగానే అప్పటికే చొచ్చుకొస్తున్న ఆంగ్ల భాషాపదాలను, వాక్యాలను వీలైనంతమేరా వాడినాడు.

**కన్యాశుల్కంలో మరో ముఖ్యలక్షణం మాండలిక పదాల వాడకం.**

బుచ్చమ్మని పెళ్ళి చేసుకోవడంలోని లాభనష్టాలను బేరీజు వేసుకొటూ గిరీశం – “టూ బర్డ్స్ ఎట్ వన్ షాట్” అని అనడం, “నాతో మాట్లాడ్డమే ఒక ఎడ్యుకేషన్”, “వెల్ మై డియర్ ఎంప్రెస్”, “టెల్ మాన్”, “టర్క్ డామిట్”, “సెల్లింగ్గర్ల్స్”, “ది సీజ్”, “బార్బరస్”, “డాన్సింగ్ గర్ల్”, “త్రోయింగ్ పెరల్స్ బిఫోర్ స్వైన్”, “కంట్రీ లైఫ్”, “ఇంప్రెమిస్”, “అయామ్ డ్రై డ్ఫ్లుల్లీ ఇన్ లవ్ విత్ హర్”... ఆంగ్ల పదబంధాలు, వాక్యాలు ఉపయోగించడం కేవలం ఆంగ్లభాష మీద ఉన్న మోజుతో రాసింది కాదు. ఆంగ్ల భాషా భవిష్యత్తును సూచించడం మాత్రమే కాదు. భవిష్యత్తులో ఎదురయ్యే గిరీశాలను గుర్తించడాన్ని కూడా పరోక్షంగా తెలియచేయడం కన్పిస్తుంది.

రామప్పంతులు గిరీశం ఆంగ్లభాషా ప్రయోగాన్ని తీసిపారేస్తూ, “బొట్లేరు ముక్కలు” అని ఎద్దేవా చేసినా ఆంగ్లభాష సామాన్యుల జీవితాలలోకి ముఖ్యంగా యువత ఆంగ్లభాష వైపు ఎలా మొగ్గుచూపుతున్నారో... అనివార్యంగా జీవితాలలో ఎలా భాగమౌతోందో గురజాడ తేటతెల్లం చేశాడు.

కన్యాశుల్కంలో మరో ముఖ్యలక్షణం మాండలిక పదాల వాడకం. విజయనగర పరిసర ప్రాంతాల వ్యవహారిక భాషా ప్రయోగాలు ముఖ్యంగా – ఊష్ణం – జ్వరం, సరకు – నగలు, ఆబోరు – గౌరవం, దంగైపోవు – ఆశ్చర్యపోవు, పొటిగరాపు – ఫొటోగ్రాఫ్, గుంట – పిల్ల, ఆడా – ఆధీనం, గోతాలు – గొప్పలు, గొట్టికాయలు – గోళికాయలు, త్వాష్ట్రం – మొరటువాడు, గర్రా – గర్వం, ఖుక్త – భూస్వామి, పర్వా – ఇబ్బంది, టొంప – గుదిబండ,

సంగోరు – సగం, కలికం – ఔషధం, గుండ – పొదరు, గావంచ – తువ్వాలు, జ్ఞానపత్రి – గంజాయి, కుహకం – మోసం ... వంటి మాండలిక అర్థాలు గల పదాలు అనేకం ఉన్నాయి.

భాషతో సామాజికరుగ్మతల్ని రూపుమాపవచ్చని గ్రహింపచేసినవాడు. చాలామంది గమనించనిది గురజాడ గుర్తించాడు.

"యతో ధర్మస్తతో జయ"–శ్లోకాలలోని వాక్యాలు; తైత్తరీయోపనిషత్తులోని "అన్నం బ్రహ్మేతివ్యానాత్"; కృష్ణయజుర్వేదంలోని "చమకం–నమకం" ఇట్లాంటివి కూడా సంభాషణల్లో కన్పిస్తాయి. నిఘంటువుల్లోకి ఎక్కని పదాలు ఎన్నో మిగిలి ఉన్నాయి. కొన్ని పదాలకు వ్యుత్పత్తులేమిటో వెతుక్కోవలసిందే ఈనాటికీ. అందులో – బానాటు, సమదంతా, పంచాళీ మనిషి, ఆకు చిట్టెడు, వొండ, ధగిడీ, చీడీ... మొదలైనవి. ఇవి గురజాడలోని పరిశీలనా దృష్టికి నిదర్శనాలు.

నాటకంలోని ఏ పాత్రా తనదికాని భాషారూపంలో మాట్లాడలేదు. పాత్రకు, భాషానిర్మాణానికి దగ్గర సంబంధం ఉండటం విశేషం. భాషాపరంగా గురజాడ చూపుని ఆకర్షించని వస్తువంటూ ఏదీ లేదు. సమయాన్ని, సందర్భాన్ని అనుసరించి తన భాషాశైలిలో ప్రతిదాన్నీ ఇముడ్చుకొంటూ భాషావైవిధ్యాన్ని ప్రదర్శించాడు.

భాషతో సామాజికరుగ్మతల్ని రూపుమాపవచ్చని గ్రహింపచేసినవాడు. చాలామంది గమనించనిది గురజాడ గుర్తించాడు. ప్రతిదీ శాస్త్రీయ అవగాహనలోకి తెచ్చుకుని కృతక భాషావాదాన్ని ఆశ్రయించడం కంటే నిత్యజీవితంలో పరిచయమైన పదజాలాన్ని వ్యవహారిక జీవితంలో గౌరవం కల్పించడం మేలని భావించాడు. అందువల్లె నిత్యజీవితంలో పరిచయం అయిన కొత్త పదాలను, కొత్త పదబంధాలను, కొత్త అర్థాలను వాడుకభాషలోకి చేర్చి సామాజిక వ్యవస్థల్ని భాష ప్రభావితం చేస్తుందనే స్పృహను కల్పించాడు.

భాష సామాజిక స్వరూపస్వభావాలను ప్రభావితం చేస్తుంది. సమాజాన్ని ప్రభావితం చేయగలిగేంత కీలకాంశంగా భాష ఎలా మారగలిగిందో... ఎలా మారగలుగుతుందో –కాలక్రమంలో సామాజికంగా వచ్చే మార్పులకోణంనుండి పరిశీలించాల్సిన అవసరం ఉంది. సమాజచట్రం లోపలి సమస్యలను ఎలా

గుర్తించాలో; తత్ఫలితంగా సమాజంలో స్థిరపరచడానికి, పరిష్కారదిశగా పుట్టుకొచ్చే కొత్తకొత్త ఆలోచనలు, సమస్యలు సరిగ్గా అర్థం కావడానికి ఎలా ప్రయత్నించాలో – సామాజిక సమస్యల్ని సరిగ్గా అర్థం చేసుకోలేనప్పుడు; సమస్యలు ఉన్నవాటికంటే ఎంత భయంకరంగా తలెత్తుతాయో... ఆ కోణం నుండి ఇవాళ కన్యాశుల్క నాటకాన్ని పునరధ్యయనం చేయాల్సిన ఆవశ్యకత ఉందేమో! అనిపిస్తోంది.

గురజాడ అప్పారావు బాధ్యత ఎరిగిన రచయిత.

దీర్ఘదర్శి. ఆధునిక సామాజిక చింతనలకి మార్గదర్శి.

మనిషి చేసిన రాయి రప్పకి
మహిమ కలదని సాగి మొక్కుతు
మనుషులంటే రాయి రప్పల
కన్న కనిష్టం గాను చూస్తా వేల, బేలా ?
వుఁడెకడో దాగెనంటూ
కొండ కోనల వెతుకులాడే వేలా ?

– గురజాడ

# మెదడులోని "ప్రపంచ స్థానీకరణ వ్యవస్థ(ప్రస్థావ్య) లో కీలక నాడీకణాలు - 2014 నాటి వైద్యశాస్త్ర నోబెల్ పరిశోధన

డా. చాగంటి కృష్ణ కుమారి ✆ 98851 63304

2014 నాటి వైద్యశాస్త్రానికి సంబంధించిన నోబెల్ బహుమతి డాక్టర్ జాన్ ఎం.ఓ'కీఫ్, డాక్టర్ మే–బ్రిట్ మోసర్; డాక్టర్ ఎడ్వార్డ్ ఐ. మోసర్‌లకు లభించింది.

1."మనిషికి తానెక్కడ ఉన్నాడో ఆ చోటును తెలియజెప్పే, అనుభవపూర్వకంగా ఆ చోట్లను చూసిన తరువాత వాటిని జ్ఞాపకం ఉంచుకోవడంలో సహాయపడే మెదడులోని నాడీకణాలు (స్థానకణాలు– place cells) కనుగొన్నందుకు" పురస్కారంలో సగభాగాన్ని జాన్ ఓ'కీఫ్, అందుకోగా,

2.మనిషి ఎక్కడకైనా వెళుతున్నప్పుడు దిశానిర్దేశం చేస్తూ ఆయా దారులను జ్ఞాపకం ఉంచుకోవడంలో సహాయపడే మెదడులోని నాడీకణాలు–


John O'Keefe
జాన్ ఓ'కీఫ్


May–Britt Moser
మే–బ్రిట్ మోసర్


Edvard I. Moser
ఎడ్వార్డ్.ఐ .మోసర్‌లు

చట్రకణాలను (grid cells) కనుగొన్నందుకు పురస్కారంలో మిగిలిన సగభాగాన్ని మే–బ్రిట్ మోసర్, ఎడ్వర్డ్. ఐ. మోసర్‌లు అందుకొన్నారు.

ఈ నాడీకణాలు మన చుట్టూవున్న పరిసరాల అవగాహనతో మనం ఎక్కడున్నామో నన్న స్పృహ, అనగా పరిసరాలను గుర్తించి, వాటిని గుర్తుంచుకోవడానికీ; మనం ఎటు వెళ్తున్నామో, ఏదారిన వెళుతున్నామో చెప్పడానికీ, అనగా మన కదలికల దిశానిర్దేశానికీ కీలకమైనవి. అలాగే అదివరలో వెళ్లిన ప్రదేశాలను, అక్కడకు చేరుకొనే దారులనూ గుర్తుపెట్టుకోవడంలో అతి ముఖ్యమైనవి. వెరసి ఇవి మన మెదడు నిర్వర్తించే 'ప్రపంచ స్థానీకరణ వ్యవస్థ (ప్రస్థావ్య)' గ్లోబల్ పొజిషనింగ్ సిస్టమ్ (GPS) అన్నమాట!

'ఉపగ్రహ–ఆధారిత ప్రపంచ స్థానీకరణ' వ్యవస్థ ద్వారా మనం భూమిపై ఎక్కడ ఉన్నామో తెలుసుకోవచ్చు మరియు ఒక ప్రదేశంనుండి మరొక ప్రదేశానికి ఎలా వెళ్లాలో కనుక్కోవచ్చు.

కానీ మన మెదడు ప్రస్థావ్య ఎలా పని చేస్తుందోనన్నవిషయంపై తత్వవేత్తలు, శాస్త్రవేత్తలు చాలా కాలంగా చర్చిస్తున్నారు.



Immanuel Kant
(1724–1804)

జర్మనీ తత్వవేత్త ఇమ్మానుయెల్ కాంత్ కొన్ని మానసికసామర్థ్యాలు మనుషులలో సహజంగానే ఉంటాయని వాదించాడు.

ఇతని ప్రకారం పుట్టుకతో వచ్చిన మానసికసామర్థ్యాలలో తామున్న స్థలం గురించిన అవగాహనాసామర్థ్యం కూడా ఒకటి.



Edward Chace Tolman
(1886 –1959)

అమెరికన్ మానసిక శాస్త్రవేత్త ఎడ్వర్డ్ టోల్మన్ 1948లో ప్రాదేశిక సంబంధాల ప్రతీకాత్మక చిత్రపటం మెదడులో ఏర్పడుతుందని ప్రతిపాదించాడు. ఇతని ప్రకారము స్థలాల మధ్య సంబంధాలను, సంఘటనలను అనుభవపూర్వకంగా జంతువులు చూచినపుడు, ఆయా పరిసరాలను అన్వేషించే ప్రక్రియలో ఒక అభిజ్ఞాపటం (cognitive

map) ఏర్పడుతుంది — ఇది జంతువులు సరైనదారిని కనుగొనడానికి ఉపయోగపడుతుంది.

టోల్మన్ సిద్ధాంతం ఆ కాలంలో ప్రబలంగా ఉన్న "ప్రవర్తనా సిద్ధాంతవాదం" (behaviorism)కు విరుద్ధం. ఎందుకంటే, ప్రవర్తనావాదులు సంక్లిష్టమైన ప్రవర్తన కేవలం ఇంద్రియసామర్థ్యమూ, కదలిక సామర్థ్యముల రెంటి కలయికలో జనించిన ప్రతిస్పందనా శ్రేణుల సంబంధాల (chains of sensory-motor response relationships) ద్వారా జరుగుతుందని నమ్మారు. కానీ టోల్మన్ సిద్ధాంతం అభిజ్ఞాత్మక పటాలను ఏర్పరచే వ్యవస్థలు మెదడులో ఎక్కడ ఉండవచ్చో వివరించలేదు.



1958లో స్టుర్మ్వాసర్ (Strumwasser) చేసిన పరిశోధనల ద్వారా స్వేచ్ఛగా కదులుతున్న జంతువుల మెదడులో నాడీకణాల కార్యకలాపాలను సూక్ష్మ తీగల (micro-wires) ద్వారా నమోదు చేయడం సాధ్యమయింది. ఈ సాంకేతికను వాడుతూ 2014 నోబెల్ గ్రహీతలు మెదడు నిర్వర్తించే 'ప్రపంచ స్థానీకరణ వ్యవస్థ (ప్రస్థావ్య)' వివరాలను కనుగొన్నారు.

### స్థల నాడీ కణాలను కనుగొనుట

జాన్ ఓ కీఫ్ కి శారీరక మనస్తత్వ శాస్త్రంలో ప్రవేశం ఉంది. శారీరక మనస్తత్వ శాస్త్రాన్ని జీవమనస్తత్వ శాస్త్రం అని కూడా అంటారు. ఇది మన ఆలోచనల, భావోద్వేగాల, ప్రవర్తనల వెనుకనున్న జీవ సంబంధమైన (శారీరక) యంత్రాంగాల అధ్యయన శాస్త్రం. జాన్ ఓ కీఫ్ ఈ జ్ఞానాన్ని మెక్‌గిల్ విశ్వవిద్యాలయంలో కెనడియన్ మనస్తత్వవేత్త రోనాల్డ్ మెల్జాక్ (Ronald Melzack) దగ్గర పనిచేస్తున్నప్పుడు పొందియున్నాడు. ఈ పరిజ్ఞానంతో లండన్ యూనివర్సిటి కాలేజీలో పాట్రిక్ వాల్ (Patrick Wall) గారి ప్రయోగశాలలో పరిశోధన ప్రారంభించాడు.1960 చివర్లలో జంతువుల ప్రవర్తనలపై అధ్యయనాలను మొదలు పెట్టాడు.



Patrick David Wall
( 1925 2001)

### హిప్పోకాంపస్



గ్రీకుభాషలో సముద్రగుర్రాన్ని (నీటిగుర్రం) హిప్పోకాంపస్ అంటారు. జంతువుల (మన) మెదడులో నీటిగుర్రపు ఆకారంలో వుండే ఒక భాగాన్ని హిప్పోకాంపస్ అంటారు. ఇది మన భావోద్వేగాలకీ, జ్ఞాపకశక్తికీ ప్రాతినిధ్యంవహించే మెదడులోని భాగము.

హిప్పొకాంపస్ పై విభాగాన్ని డోర్సల్ పార్టిషన్ అంటారు.(dorsal partition) ఇది ప్రధానంగా ప్రదేశపు ఎరుకకు, గ్రహింపు సామర్థ్యానికీ ప్రాతినిధ్యం వహిస్తుంది. ఈ విభాగాన్నిCA1గా చెపుతూ గుర్తిస్తారు. హిప్పొకాంపస్ లోపలివిభాగము భావోద్వేగాలు కలుగజేయడానికి పనిచేస్తుంది.

మెదడునిర్మాణంలో పైభాగపు హిప్పొకాంపస్ డోర్సల్ విభాగంలో నాడీకణాలను నమోదు చేస్తున్నప్పుడు స్థలనాడీ కణాలను (place cells) జొనథన్. ఓ. డోస్ట్రొస్కీతో (Dostrovsky, 1971) కలసి చేసిన అధ్యయనాలలో జాన్ ఓ కీఫ్ కనుగొన్నాడు. నాలుగు ప్రహరీగోడల మధ్యనున్న జాగాలో ఎలుక చలనాల్లో ఈ స్థలకణాలను వారు పరిశీలించగలిగారు.




పటము *(O'Keefe and Dostrovsky, 1971)*

*పటములో బూడిదరంగు చతురస్రంగా చూపిన భాగంలో ఎలుక సంచరిస్తున్నది. పసుపురంగులో సూచించినది స్థలకణాలున్న హిప్పొకాంపస్. ఎలుక సంచరిస్తున్న పరిసరాలలో ఒకానొక ప్రత్యేకమైన స్థలానికి అది చేరినపుడు స్థలకణాలు క్రియాశీలమై ఎలుకలో ప్రేరేపణను పుట్టిస్తాయి. పసుపు ప్రదేశంలో ఆరంజ్ రంగు చుక్కలు ఎలుక చేరుకొన్న సమయంలో ఆ ప్రదేశంలో క్రియాశీలంగా వున్న స్థలకణాన్ని సూచిస్తాయి. ఎలుక సంచరిస్తున్న ప్రాంగణంలోని భిన్నప్రాంతాలకి హిప్పోకాంపస్‌లోని విభిన్న స్థలకణాలు క్రియాశీలమవుతాయి. అనగా ప్రదేశ ప్రదేశానికీ క్రియాశీలమయ్యే స్థలకణాలు వేరువేరుగా ఉంటాయి.*

క్రియాశీలమవుతున్న స్థలకణాలను పరిశీలిస్తున్నప్పుడు అవి క్రియాశీలమయ్యే తీరు శాస్త్రవేత్తల అంచనాలకు విరుద్ధంగా ఉంది. మునుపెప్పుడూ వారు ఎటువంటి మెదడు కణాల్లోనూ గమనించని విధంగా వీటి చురుకుదనాలు ఉన్నాయి. జంతువు పర్యావరణంలో ఒకానొక ప్రత్యేకస్థానం – స్వీయస్థలక్షేత్రం – లో ఉన్నప్పుడే, ఆ స్థానానికి సంబంధించిన ప్రత్యేకమైన స్థలకణాలు క్రియాశీలమవుతాయి. క్రమపద్ధతిలో పర్యావరణాన్ని మారుస్తూ, స్థలక్షేత్రాల సృష్టికి వివిధ సైద్ధాంతిక అవకాశాలను పరీక్షిస్తూ జంతువు సంచారాలలో స్థలకణాలను జాన్ ఓ కీఫ్ పరిశీలించాడు. స్థలకణాలు క్రియాశీలమవడము కేవలము ఇంద్రియ నాడీకణాల్లోని కార్యకలాపాలను మాత్రమే వెల్లడించదనీ అది పర్యావరణపు సంక్లిష్టమైన సమగ్ర మానసికరూపాన్ని ఏర్పచడమనీ నిరూపించాడు.

వేర్వేరు స్థలకణాలు వేర్వేరు జాగాల దగ్గర క్రియాశీలములవగా, అలా చాలా జాగాలలో క్రియాశీలమైన స్థలకణాలన్నిటి క్రియాశీలతల కలయికతో ఏర్పడిన ఒక సంయుక్త క్రియాశీలత అంతర్గత నాడీపటాన్ని (internal neural map) సృజిస్తుంది. ఈ పటము ఆ ఫలానా నిర్దుష్టమైన పర్యావరణాన్ని సూచిస్తుంది. (O'Keefe, 1976; O'Keefe and Conway, 1978).

మెదడుకి స్థలకణాలు 'ప్రాదేశిక సూచన వ్యవస్థ' లేదా 'భౌగోళిక సూచన వ్యవస్థ'ను సమకూరుస్తాయని లిన్ నాడెల్ (Lynn Nade) తో కలసి జాన్ ఓ'కీఫ్ నిర్ధారించాడు. అనగా మెదడుకి స్థలజ్ఞానాన్ని



Ynn Nadel (1942)
American psychologist

స్థలకణాలు కలుగజేస్తాయన్నమాట. వివిధ పర్యావరణాలలోనూ, వివిధ కాలాలలోనూ (సమయాలలోనూ) క్రియాశీలమైన స్థలకణాలన్నింటి సంయుక్త క్రియాశీలతలు సూచించే

పటాల బాహుళ్యాన్ని హిప్పొకాంపస్ కలిగి వుంటుందని ఓ'కీఫ్ నిరూపించాడు.

అందువల్ల ఒక నిర్దుష్టమైన వరుస కలయికలతో కూడిన స్థలకణాల సంయుక్త క్రియాశీలత ఒకానొక ప్రత్యేకమైన పర్యావరణసూచనకి చెందుతుంది. ఇతర కలయికల సంయుక్తాలు ఇతరములైన పర్యావరణసూచనలవుతాయి.

జాన్ ఓ'కీఫ్ అవిష్కరణల వల్ల మెదడులో అభిజ్ఞాత్మక పటానికి (cognitive map) ప్రత్యక్ష ఆధారం లభించింది. అభిజ్ఞాత్మక పటం ఏర్పడుతుందనే సిద్ధాంతం బలపడింది.

ఓ'కీఫ్ పరిశోధనలకు ముందస్తుగా కావలసినవి స్వేచ్ఛగాతిరుగుతున్న జంతువుల చలనాలను నమోదు చేయగల సాంకేతిక పద్ధతులు. ఈపద్ధతులు అభివృద్ధి చెందాయి కనుకనే ఓ'కీఫ్ కి ఈ పరిశోధన సాధ్యపడింది. ఓ'కీఫ్ సహజస్థితిలో సంచరిస్తున్న జంతువుల హిప్పొకాంపస్ నాడీకణాలూ, ఇతర నాడీకణాల నమోదుకు సూక్ష్మతీగల (micro-wires) నమోదు పద్ధతిని వాడిన మొదటి వ్యక్తికాదు, అయితే ఈ పద్ధతులు రూపొందిన తొలినాళ్లలోనే వాడుకొన్నవాడు. అంతకు మునుపు ఇతర శాస్త్రజ్ఞులు వీటిని వాడారు; కానీ వారు జంతువులు పరిమిత ఉద్దీపన-ప్రతిస్పందన(Stimulus-response) లకు వాడారు.

*(ఒక జీవి బాహ్య లేదా అంతర్గత వాతావరణంలోమార్పుతీసికొని రావడం ఉద్దీపన; ఉద్దీపన జీవిలో ఒక చర్యను ప్రేరేపిస్తుంది, అప్పుడా జీవి ఒక నిర్దుష్ట ప్రతిస్పందనను ప్రదర్శిస్తుంది; ఉదా: ప్రకాశవంతమైన కాంతి ఉద్దీపనమయితే ఆకాంతిని చూసినప్పుడు కళ్ళు మూసుకోవడం ప్రతిస్పందన)*

ఓ'కీఫ్ జంతువుల సహజసంచారంలో సహజప్రవర్తనలలో నాడీకణాల క్రియాశీలతలను నమోదు చేసాడు. అందువల్లే అతను స్థలక్షేత్రాలను పరిశీలించగలిగాడు; స్థలకణాల క్రియాశీలతను గమనించి, వాటి చురుకుదనాన్ని స్థలభావనతో అనుసంధానించ గలిగాడు.

ఆ తరువాత చేసిన ప్రయోగాలలో స్థలకణాలు జ్ఞాపకవిధులు కూడా నిర్వర్తించవచ్చునని వెల్లడించాడు. వేర్వేరు పర్యావరణాల్లో అనేక స్థలకణాలు ఒకేసారి పునర్వ్యవస్థీకృతమయ్యే ప్రక్రియను పటపునఃరూపొందు ప్రక్రియ(remapping) అని పిలిచాడు. ఒకసారి ఏర్పడిన తర్వాత అవి దీర్ఘకాలికంగా స్థిరంగా ఉండగలవు; అందువల్ల స్థలకణాలు పర్యావరణ జ్ఞాపకా లను నిలువచేసి ఉంచే కణస్థాయి ఆధారాన్ని అందిస్తాయి.

(cellular substrate for memory) పర్యావరణ జ్ఞాపకము స్థలకణాల నిర్దుష్టకలయికల రూపంలో నిలువ ఉంటుంది. కొన్ని సందర్భాలలో స్థలకణాలు దూరాలను కొలుస్తాయని తెలియవచ్చింది.

**చట్రకణాలను కనుగొనుట (Grid cells)**

1980లు, 1990లలో, స్థలక్షేత్రాలు హిప్పోకాంపస్‌లోనే ఉత్పత్తి అవుతాయన్న సిద్ధాంతం ప్రబలంగా ప్రచారంలో వుండేది. మేబ్రిట్ మోసర్, ఎడ్వర్డ్ మోసర్ ఒస్లోలోని పెర్ ఆండర్సన్ ప్రయోగశాలలో పీహెచ్‌డీ చేస్తున్న సమయంలో స్థలకణాలలో క్రియాశీలత హిప్పోకాంపస్ వెలుపల జరగవచ్చు కదా?– అని ప్రశ్నించారు. ఎడిన్ బరోలో రిచర్డ్ మోరిస్ ప్రయోశాలలోనూ, లండన్ లోని జాన్ ఓ'కీఫ్ ప్రయోగశాలలో సందర్శనా శాస్త్రవేత్తలుగా (visiting scientists) కూడా. వారు ఇదే ప్రశ్నవేసారు.




The word "limbic" comes from the Latin word "limbus, "meaning "border." It was named this because the structures of the limbic system are located on the border between the cerebral cortex and the subcortical structures of the brain. 'Cortex' means "bark" in Latin and appropriately the cerebral cortex is the outermost layer of the brain. below the cerebral cortex. Subcortical structures are not visible when looking at the surface of the brain, and include structures like the hippocampus, thalamus, and hypothalamus (among many others)




*ఎంటోర్‌హైనల్ కార్టెక్స్(EC) మెదడు లింబిక్ వ్యవస్థలో ఒక భాగం. ఇది హిప్పోకాంపస్ కి వీధిగుమ్మం లాంటిది. సమాచారాలు హిప్పోకాంపస్ లోనికి వెళ్లడానికీ, అలాగే లోపలనుండి బయటకు రావడానికీ ద్వమార్గపు దారి అన్నమాట*

హిప్పోకాంపస్‌కు ప్రధానంగా చేరే సమాచారం ఎలుక మెదడు పై అంచున ఉన్న ఎంటోర్హైనల్ కార్టెక్స్ నుండి వస్తుంది. ఈ CA1 నుండి వచ్చే సంకేతాలు హిప్పోకాంపస్‌లోని డెంటేట్ గైరస్ కు చేరి, తరువాత CA3 ప్రాంతానికి, అక్కడి నుండి CA1 ప్రాంతానికి వెళ్తాయి. ఓ'కీఫ్ మొదట స్థల కణాలను CA1 ప్రాంతంలోనే కనుగొన్నడం గమనించదగ్గ విషయము.




2002లో, మోసర్ దంపతులు ఎంటోర్హైనల్ కార్టెక్స్ నుండి CA3కు వెళ్ళే అనుసంధానాలను తీసివేసినప్పుడు CA1 స్థలక్షేత్రాల నిర్మూలన జరగలేదని కనుగొన్నారు (Brun et al., 2002). ఎంటోర్హైనల్ కార్టెక్స్ CA1ల మధ్య నేరుగా, ద్విమార్గాలుగా సంబంధాలున్నాయి, కాబట్టి ఈ ప్రయోగఫలితాల వల్ల మోసర్ దంపతులు ఎంటోర్హైనల్ కార్టెక్స్‌లో స్థలకోడింగ్ కణాలను వెతకడానికి సంసిద్ధులయ్యారు. జంతువులు బాగా విస్తృతమైన ప్రదేశాల్లో సంచరించగలిగేలా చేసి ప్రయోగాలు నిర్వహించారు. అప్పుడు వారు సరికొత్త కణాలను కనుగొన్నారు. వీటి పేరు చట్రకణాలు.




*చట్రకణాలు( Grid cells) ఎంటోర్హైనల్ కార్టెక్స్ లో ఉంటాయి, ఒక చట్రకణం జంతువు సంచరిస్తున్న జాగాలోని నిర్దుష్ట స్థానాలకు చేరినప్పుడు క్రియాశీలమవుతుంది. ఈ స్థానాలు షడ్భుజాకార అమరికలో ఉంటాయి. (నీలిరంగులో సూచించినవి)*

**మొసర్ దంపతులు వారి పరిశోధనలో ఏమిమి కనుగొన్నారంటే...**

1. చక్రమువంటి అమరికలో చక్రకణాలు సమాన దూరాలలో, ఒకే దిశలో క్రియాశీల మవుతాయి, ఈ విధంగా క్రియాశీలమవుతున్నచక్రకణాలు వివిధస్థానాలలో ఉంటాయి. అందువల్ల జంతువు సంచరిస్తున్న మొత్తం ప్రదేశాలన్నిటినీ అవి ఆవరిస్తాయి.

2. చక్రక్షేత్రాల మధ్య దూరాలు ఎంటోరైనల్ కార్టెక్స్ మధ్యస్థ ఉపరితలం(medial entorhinal cortex) నుండి మారుతూ ఉదర భాగం దగ్గర (ventral part) పెద్దవిగా అవుతాయి.

3. చక్రనమూనా మెదడులోని సంక్లిష్టమైన జాలక నిర్మాణ క్రియాశీలత (complex network activity) వల్ల ఉత్పత్తి అవుతుంది, అది కేవలము సరళమైన రీతిలో

ఇంద్రియాల,లేదా కదలికల సంకేతాల ,(sensory or motor signals), ద్వారా రాదు; ఇటువంటి చక్రనమూనా ఇంతకుముందు ఎప్పుడూ మెదడుకణాలలో ఎవరూ పరిశీలించలేదు.

4. మోసర్ దంపతులు చక్రకణాలు మార్గాన్నీ, దిశను తెలిపే వ్యవస్థలో భాగమని, అవి ప్రయాణించిన దూరాన్నికొలవడానికి, హిప్పోకాంపస్‌లోని స్థలపటానికి (spatial map) స్థలపరిమాణాన్ని (spatial metric) జోడించడంలో సహాయపడతాయని తేల్చి చెప్పారు.

5. తలదిశ నిర్దేశక కణాలు (Head direction cells), )

తలదిశ నిర్దేశకకణాలు ఎంటోరైనల్ కార్టెక్స్ మధ్యస్థ ఉపరితలలో ఒక జాలములో వుంటాయనీ, చాలా సందర్భాలలో అవి కలసి సంయుక్తంగా పనిచేస్తాయని మోసర్ దంపతులు కనుగొన్నారు. (Solstad et al., 2008). తల దిశను నిర్దేశించే కణాలు మెదడులో హిప్పోకాంపస్‌కి రక్షణనిచ్చే

> The word "subiculum" comes from the Latin word subiculum, meaning "support," to reflect its anatomical position supporting the hippocampus proper. It is a distinct region of the brain that lies beneath the hippocampus, forming a transition zone between the hippocampus and the entorhinal cortex. Anatomical meaning: This name was chosen because the subiculum is located underneath the main part of the hippocampus in the brain

సబికులమ్ (subiculum) భాగంలో వుంటాయని తొలిసారిగా జేమ్స్ బి. ర్యాంక్ (James Ranck 1985) కనుగొన్నాడు. ఈకణాలు జంతువు ఒక నిర్దుష్టదిశలో తలతిప్పి చూసినప్పుడు క్రియాశీలమవుతాయి; దిక్సూచి (compass) లాగా పనిచేస్తాయి.

6. సరిహద్దు కణాలు (Border cells).

సైద్ధాంతికనమూనాలతో ఓ'కీఫ్,తనసహాధ్యాయులతోకలసి(Hartley, et al. 2000). సరిహద్దు కణాలుంటాయని ఊహించాడు . మోసర్ దంపతులు చట్రకణాలు, తల నిర్దేశకణాలు, సరిహద్దు కణాలు హిప్పోకాపస్ లోని స్థలకణాలకి ప్రక్షేపణ(project )మై ఉంటాయని నిరూపించారు (Zhang et al. 2013). సరిహద్దుకణాలు జంతువు గోడలు లేదా సరిహద్దుల దగ్గర ఉన్నప్పుడు క్రియాశీలమవుతాయి.

ఎంటోర్హైనల్ కార్టెక్స్‌లోని పలుచోట్లలో పలు చట్రకణాల నమోదు ప్రయోగాలు వీరు నిర్వహించారు. చట్రకణాలు వివిధపరిమాణాల చట్ర మాడ్యూల్స్ (modules) రూపంలో వ్యవస్థీకృతమై ఉంటాయనీ, దీనివల్ల మెదడు చిన్నవైన మరియు పెద్దవైన స్థలాలను రెండింటినీ చూడగలుగుతుందని, ఓ'కీఫ్, మోసర్ దంపతులు నిర్వహించిన ప్రయోగాలు, నమూనాల ద్వారా, నిరూపించారు. చట్రకణాలు, స్థలకణాలు పరస్పరం ప్రభావితం మవుతాయనీ, అలాగే అంచుకణాలు స్థలకణాల కార్యకలాపాన్ని నియంత్రించడంలో సహాయపడతాయని చట్రకణాల ఆవిష్కరణ ద్వారా వారు చెప్పగలిగారు.



*పటము: ఎలుక ఎంటోర్హైనల్ కార్టెక్స్ లోని చట్రకణాలు( నీలంనీలము) హిప్పో కాంపస్‌లో స్థలకణాలు (పసుపు ) ల చూపుతున్న రేఖాచిత్రము*

సమీకృత కణాలు(Combination cells) – పై రెండు విధాలైన లక్షణాలు కలిగినవి. ఈ కణాలు హిప్పోకాంపల్ స్థల కణాలతో (hippocampal place cells) అనుసంధానమై ఉంటాయి, ఇవి స్థలంలోని నిర్దుష్ట ప్రదేశాలను సూచిస్తాయి.

మధ్యస్థ ఎంటోరైనల్ కార్టెక్స్ (medial entorhinal cortex) మెదడులో స్థల, దిశామార్గదర్శక (spatial navigationగణన కేంద్రం (computational center) గా పనిచేస్తుందనిఈ పరిశోధనవల్ల తెలిసింది.

**మానవ ఆరోగ్యం మరియు వైద్యానికి సంబంధించిన ప్రాముఖ్యత**

స్థల, చట్రకణాల ఆవిష్కరణ మెదడువ్యాధుల్లో, ముఖ్యంగా మతిమరుపు అనగా జ్ఞాపకశక్తిని కోల్పోవడము (Alzheimer's) వ్యాధి మూలాలను తెలిసికొనడానికి వేసిన ఒక పెద్ద అడుగు. ఓ'కీఫ్ మరియు సహచరులు చేసిన మతిమరపు వ్యాధి వున్న ఎలుకల నమూనాలతో చేసిన పరిశోధనలో ఆఎలుకలు స్థలాలను మరచిపోవడానికి వాటి మెదడులో స్థలక్షేత్రాలు చెడిపోవడంతో నేరుగా సంబంధముందని చూపించారు.ఈ ఫలితాలు నేరుగా చికిత్సావైద్యానికి అన్వయించకపోయినా, హిప్పోకాంపల్ నిర్మాణం మతిమరుపు వ్యాధిలో దెబ్బతినే భాగాలలో ఒకటని తెలుసుకోవడం వల్ల, మెదడులోని మార్గనిర్దేశిక వ్యవస్థను అర్థంచేసుకోవచ్చు. తద్వారా రోగులు తమజ్ఞానాన్ని ఎలా కోల్పోతున్నారో వివరించేందుకు ఈ వివరాలు సహాయపడతాయి.

జాన్ ఓ'కీఫ్, మేబ్రిట్ మోసర్, ఎడ్వర్డ్ ఐ. మోసర్ చేసిన స్థల, చట్రకణాల ఆవిష్కరణలు మెదడులోని ఇతర ప్రత్యేక కణాల సమూహాలు కలిసి ఉన్నతస్థాయి జ్ఞాన కార్యకలాపాలను ఎలా నిర్వహిస్తాయన్న సరికొత్త అవగాహనను అందించాయి .ఈ ఆవిష్కరణలు మానవులు సహా అనేక సస్తన(పాలిచ్చే) జంతువులలో కొత్త పరిశోధనలకు మార్గం చూపాయి. వీరు నిర్వహించిన మెదడులోని మార్గనిర్దేశక వ్యవస్థ అధ్యయనాల ద్వారా, అభిజ్ఞ ప్రక్రియలు ఎలా గణనాత్మకంగా అమలవుతాయో తెలుసుకోడానికి కొత్తమార్గాలు తెరుచుకొన్నాయి.

★★★

## References for further study


1. https://pmc.ncbi.nlm.nih.gov/articles/PMC4276740.
2. Norwegian University of Science and Technology – NTNU https://www.ntnu.edu □ nobelprize2014
3. https://www.theguardian.com/science/2014/oct/06/nobel-prize-physiology-medicine-brain-navigation
4. https://www.mpg.de/8687441/moser-nobel-prize
5. https://www.nobelprize.org/prizes/medicine/2014/summary/
6. Norwegian University of Science and Technology – NTNUhttps://www.ntnu.edu □ nobelprize2014

# ధన్యోస్మి

ప్రకాశిక అక్టోబర్ – డిసెంబర్ 2025 సంచిక ఐదవ వార్షికోత్సవ సంచిక. గురజాడ అందెశ్రీల స్మృతికి నివాళులు అర్పిస్తున్న సంచిక. ఈ ఇద్దరి జీవితం, సాహిత్యం మీద ప్రత్యేక వ్యాసాలు ప్రకాశిక వార్షిక సంచిక కోసం రాసినందుకు ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు గారికి అభినందన పూర్వక ధన్యవాదాలు. పాత కొత్తల మేలు కలయికగా సంతరించుకుంటున్న ప్రకాశికని ఆదరిస్తున్న అశేష తెలుగు భాషాభిమానులకీ, సాహితీవేత్తలకీ అక్షర కైమోడ్పులు.

ఈ ప్రత్యేక సంచికలో ప్రచురణ కోసం మంచి వ్యాసాలు ప్రత్యేకంగా రాసి పంపిన వ్యాసకర్తలకి శతకోటి నమస్సులు.

ఈ సంచిక వెలువరించడంలో ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ సహకరించినవారందరో, వారందరికీ వందనములు.

గత ఐదు సంవత్సరాలలో వచ్చిన సంచికలకోసం వ్యాసాలు రాసిన వ్యాసకర్తలాకీ, కవులకి, కథకులకీ, సంపాదకవర్గానికీ మరొక్కసారి కృతజ్ఞతలు తెలియచేస్తున్నాను.

భవదీయుడు

**ఆచార్య కొవ్వలి గోపాలకృష్ణ**

ప్రధాన సంపాదకులు

ISSN 2766-0168
అంతర్జాల త్రైమాస పత్రిక
వ్యవస్థాపక సంపాదకులు
కీ.శే. గురజాడ వేంకట అప్పారావు
www.prakasika.org

# ప్రకాశిక

సమగ్ర సాహిత్య, సామాజిక పత్రిక

సంపుటి 5 | సంచిక 4 అక్టోబర్-డిసెంబర్ 2025

మమత-సమత-మానవత
www.gurajada.org

